

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 238 | విజయవాడ, సోమవారం 28 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

విద్యుత్ పోరాట అమరవీరులకు జోహార్లు



ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో జరిగిన మహోద్యమంలో ఇదే రోజు చంద్రబాబు ప్రభుత్వ తుపాకులకు బలైన అమరవీరులు



రెండో ప్రయోగ వేదిక పైకి పిఎస్ఎల్‌వి-సి39

31న ప్రయోగం

9

విశ్వాసం పేరుతో హింసను సహించం

- దోషులకు శిక్ష తప్పదు
- హర్యానాలో హింసపై ప్రధాని మోడీ

8

కాకినాడ

చివరి రోజు చంద్రబాబు, జగన్ పోటాపోటీ ప్రచారం

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారం ముగింపునకు తుది రోజైన ఆదివారం అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అధినేతలు కాక పుట్టించారు. పరస్పర వ్యక్తిగత విమర్శలు సంధించుకున్నారు. హామీల జడివానలో కాకినాడ ఓటర్లను తడిపి ముద్ద చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన రోడ్డు షోలో ప్రసంగించారు. ఓట్ల కోసం వైసిపి దొంగలు వస్తుంటారని, క్రికెట్టు బెట్టింగులు, భూ కబ్జాలు తదితర పనులు చేసే నేతలు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులుగా ఎంపికైతే ప్రజలకు ఎనలేని నష్టమని, వారిని తరిమి కొట్టాలని ఓటర్లను కోరారు. మరోవైపు ప్రతిపక్ష నేత జగన్ కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఇంటికో మారుతి కారు, కిలో బంగారం ఇస్తానని మోసం చేస్తారని, అలాంటి మాటలను నమ్మి మోసపోద్దన్నారు. టిడిపికి ఓటేస్తే ఆ ఓటు మురిగిపోయినట్లేనని అన్నారు.



దొంగలను తరిమికొట్టండి : చంద్రబాబు

కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి వద్ద జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతిపక్షనేత ప్రవర్తన చిన్నతనంలో సక్రమంగా లేకపోవడంతో ఆయన తండ్రి అతణ్ని ఇతర రాష్ట్రాలకు పంపించేశారన్నారు. నంద్యాల్లో జరిగిన ఎన్నికల సభలో 'చంద్రబాబును ఉరితీయండి.. నడిరోడ్డుపై కాల్చిచంపండి' అని తన గురించి వ్యాఖ్యానించి ఉన్మాదిలా వ్యవహరించాడన్నారు. ఉత్తరాదిలో డేరా బాబా మాదిరిగా మనరాష్ట్రంలో జగన్‌బాబా తయారయ్యారని ఎద్దేవా చేశారు. గతంలో విశాఖపట్నంలో రిపబ్లిక్ డే రోజున ప్రపంచస్థాయి సదస్సు జరుగుతుంటే జగన్ తమిళనాడులో జల్లికట్టు మాదిరిగా ఉద్యమం నిర్వహించారన్నారు. ఇది ముమ్మాటికీ ఉన్మాద చర్యేనని అన్నారు. ఉన్మాది లాంటి వ్యక్తి నాయకుడిగా ఉన్న పార్టీ

మిగతా 9లో



మోసగాళ్లకు ఓటేస్తే మురిగిపోతుంది : జగన్

మరోవైపు వైసిపి అధినేత జగన్ కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపికి ఓటేస్తే ఆ ఓటు మురిగిపోయినట్లేనని చెప్పారు. వచ్చే ఎన్నికల మహా కురుక్షేత్ర సంగ్రామానికి నంద్యాల, కాకినాడ ఫలితాలు నాంది కావాలని పిలుపునిచ్చారు. రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు రావాలన్నారు. చంద్రబాబు అమలు చేయలేని హామీలిచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలు ప్రశ్నిస్తారనే భయం ఉండేలా ఈ వ్యవస్థలో మార్పు రావాలన్నారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు కాకినాడ గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు తొలగిస్తామని చెప్పిన బాబు తన మాట నిలబెట్టుకోలేదన్నారు. డ్వాక్రా మహిళలకూ రుణమాఫీ చేయలేదన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పారని, ప్రస్తుతం ఉన్న

మిగతా 9లో



వెండి వెలుగు

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోరాడి ఓడిన సింధు

ఒక్క పాయింట్‌తో చేజారిన స్వర్ణం

గ్లాస్గో : ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి సింధు పోరాడి ఓడింది. ఆదివారం జరిగిన తుదిపోరులో జపాన్ క్రీడాకారిణి నోజోమీ ఒకుహుర చేతిలో ఓడిపోయి వెండి పతకంతో సరిపెట్టుకున్నప్పటికీ సింధుచూపిన పోరాట పటిమ అందరి ప్రశంసలను అందుకుంటోంది. అత్యంత ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలో ఇద్దరు క్రీడాకారులు నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. ప్రతి పాయింట్ కోసం పోరాడారు. ఏ దశలోనూ రాజీపడకుండా సాగిన పోరాటం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. విజేతగా నిలిచిన ఒకుహురకూ రెండవ స్థానంలో ఉన్న సింధూకు గేమ్‌పాయింట్లు మాత్రమే తేడాగా మిగిలాయంటే మ్యాచ్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. చివరకు ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణం సాధించే అవకాశాన్ని సింధు కోల్పోయినప్పటికీ వెండి వెలుగులతో మురిసింది. సింధూపై జపాన్‌కు చెందిన నొజోమి ఒకుహర 21-19, 20-22, 22-20 పాయింట్లతో విజయం సాధించింది. స్వర్ణం గెలుచుకుంది.



సిర్సాలో మోహరించిన భద్రతా బలగాలు

నేడు గుర్మీత్‌కు శిక్ష ఖరారు

- జైలు వద్దే తీర్పు
- సిర్సాలోని డేరా ఆశ్రమం వద్ద కర్ఫ్యూ

రోహతక్/చండీఘడ్ : ఆత్యాచార కేసులో దోషిగా తేలిన బాబా గుర్మీత్‌కు నేడు శిక్ష ఖరారు చేయనున్నారు. తీర్పు నేపథ్యంలో మరిన్ని అల్లర్లు, హింసాత్మక సంఘటనలు జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని హర్యానా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. డేరా సచ్చాసౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అనుచరులను రోహతక్‌లోకి అడుగుపెట్టనివ్వమని హర్యానా ప్రభుత్వం స్పష్టం చేసింది. డేరా అనుచరులు రోహతక్‌లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. అత్యాచార కేసులో గుర్మీత్ దోషి అని శుక్రవారం పంచకుల సిబిఐ కోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో డేరా మద్దతు దారులు రెండు రోజులుగా ఆందోళనలు చేస్తూ హింసాత్మక సంఘటనలకు ఒడిగడుతున్నారు. ప్రస్తుతం గుర్మీత్ ఉన్న సునారియా జైలు పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. బిఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసు సిబ్బంది పహారా నిర్వహిస్తున్నారు. జైలు చుట్టూరా 10 కిలోమీటర్ల ప్రాంతాన్ని పోలీసులు అధీనంలోకి తీసుకున్నారు. గుర్మీత్‌ను మళ్ళీ కోర్టుకు

మిగతా 8లో

ముద్రగడ అరెస్టు

పోలీసు వలయాన్ని ఛేదించి పాదయాత్ర

- పలుచోట్ల లాఠీచార్జి
- ముద్రగడ పద్మనాభంపై కేసు నమోదు
- పెద్దాపురం డిఎస్‌పిపై సస్పెన్షన్ వేటు!




ముద్రగడను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట, రాజమహేంద్రవరం క్రైం (తూర్పుగోదావరి)

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ నెల రోజులుగా పాదయాత్ర చేపడుతూ పోలీసు ఆదేశాలతో వెనక్కి వెళ్తున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆదివారం పోలీసు వలయాన్ని ఛేదించుకుని పాదయాత్ర కొనసాగించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. పోలీసులు లాఠీఛార్జి చేసి, ఆయనను అరెస్టు చేశారు. ముద్రగడను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా ఉద్యమకారులు వాహనాన్ని పలుచోట్ల అడ్డుకున్నారు.

చలో అమరావతి పాదయాత్రను పోలీసులు అడ్డుకుంటూ ఉండటంతో 32 రోజుల నుంచి ఇంటి వద్దే నిరసన తెలుపుతున్న ముద్రగడ.. ఆదివారం వంటావార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కాకినాడలో చంద్రబాబు, జగన్ పర్యటనలతో కిర్లంపూడిలో పోలీసు బందోబస్తు తక్కువగా ఉంది. నెలరోజులుగా ముద్రగడ గృహనిర్బంధంతో ఆగ్రహంగా ఉన్న కాపులు, వారికి మద్దతుగా ఇతర సామాజిక తరగతులకు చెందినవారు అధిక సంఖ్యలో కిర్లంపూడి చేరుకోవడంతో ఒక్కసారిగా ముద్రగడ పాదయాత్రను కొనసాగించారు. జిల్లా ఎస్పి విశాల్‌గున్ని, డిఐజి రామకృష్ణ, ఇతర పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి వచ్చినప్పటికీ పాదయాత్రను అదుపుచేయలేకపోయారు. రాజుపాలెం సెంటర్లో పోలీసు ఉన్నతాధికారులు రోడ్డుకు అడ్డంగా బోర్డులు పెట్టినప్పటికి వాటిని తోసుకుంటూ ముందుకు చొచ్చుకుని

మిగతా 9లో



'బిజెపి భగావో..దేశ్ బచావో'

జాతీయస్థాయిలో 'మహాగట్ బంధన్' : శరద్‌యాదవ్



పాట్నాలో నిర్వహించిన బహిరంగ సభలో శరద్, లాలూ ఆలింగనం, అశేషంగా తరలివచ్చిన ప్రజలు

- బిజెపిపై ఆర్జేడీ చీఫ్ విమర్శలు
- తొలిసారిగా లాలూతో వేదిక పంచుకున్న జెడి(యు) నేత
- ర్యాలీకి హాజరైన ప్రతిపక్ష నేతలు

పాట్నా : దేశ రాజకీయ చరిత్రలో మరో మహాగట్‌బంధన్‌కు బీహార్ వేదికకానుంది. జెడి(యు) సీనియర్ నేత శరద్‌యాదవ్ తన రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఆర్జేడీ చీఫ్ లాలూయాదవ్‌తో ఒకే వేదికను పంచుకుని నితీశ్ కుమార్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎను ఓడించేందుకు జాతీయ స్థాయిలో మహాగట్‌బంధన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజా మద్దతును కూడగట్టేందుకు పాట్నాలో 'బిజెపి భగావో..దేశ్ బచావో' నినాదంతో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు గాంధీ మైదానంలో

మిగతా 8లో

కొద్ది గంటల్లో నంద్యాల విజేత

భారీగా భద్రతా ఏర్పాట్లు-144 సెక్షన్ అమలు



కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక లెక్కింపు కేంద్రం వద్ద గస్తీ నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది.

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల ఉప ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు కొద్ది గంటల్లో తెరపడనుంది. నేడు కర్నూలు జిల్లా నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజే నంద్యాలలో టిడిపి, వైసిపిల మధ్య ఘర్షణ తలెత్తి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకొంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలకు పూనుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ నంద్యాల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్పి గోపినాథ్‌జెట్టిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌంటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు. ఇందులో భాగంగానే జిల్లా పోలీసు అధికార యంత్రాంగం నంద్యాలలో ఎలాంటి

మిగతా 9లో



ప్రజ్ఞ

1. వివాదాస్పద బాబా గుర్మీత్ రామ్ రహీమ్ ప్రధాన ఆశ్రమం 'డేరా సచ్చ సౌదా' ఎక్కడుం ది?
2. ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకున్న క్రీడాకారిణి ఎవరు?
3. అవినీతి కేసులో ఐదేళ్ల జైలు శిక్ష ఖరారైన శామ్‌సంగ్ అధిపతి ఎవరు?
4. పాకిస్తాన్ ఆరవ జనగణన లెక్కల ప్రకారం ఆ దేశ జనాభా ఎంత?
5. జైట్లీ ప్రారంభించిన తేలికపాటి యుద్ధ విమానాలు తయారీ యూనిట్ ఎక్కడ ఉంది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

కుల సంఘాలతో సిఎం మంతనాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కులాల వారీగా ఓటర్ల మద్దతు పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ప్రయత్నాలు చేశారు. పది కుల సంఘాల నాయకులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, హామీల వర్షం కురిపించారు. టిడిపిని గెలిపించాలని కోరారు. మీడియాను దూరంగా పెట్టి నిర్వహించిన సమావేశాల్లో 'మీ అందరినీ ఆదుకుంటాను' అంటూ హామీ ఇచ్చారు. కాకినాడ ఎన్నికల ప్రచారానికి శనివారం మధ్యాహ్నం వచ్చిన చంద్రబాబు రాత్రి 10 గంటల వరకూ ప్రచారం చేశారు. అచ్చంపేట సెంటర్‌లోని లక్ష్మీ పరిణయ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి కుల సమీక్షలు చేశారు. క్షత్రియులు, చౌదరిలు, బ్రాహ్మణులు, శెట్టిబలిజ, బిసి, ముస్లిములు, కాపులతో వేర్వేరుగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. చివరిగా మాల, మాదిగ, క్రిస్టియన్, గిరిజన సంఘాలతో సుమారు గంటన్నరపాటు మంతనాలు చేశారు. కార్పొరేషన్లు ఏర్పాటుచేసి నిధులు కేటాయించింది టిడిపి ప్రభుత్వమేనని, త్వరలో వైశ్య కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. గంటన్నరపాటు మాల, మాదిగ, క్రిస్టియన్, గిరిజన నాయకులతో జరిగిన సమావేశంలో ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ జూపూడి ప్రభాకరరావును మాత్రమే పది నిమిషాలు మాట్లాడనిచ్చారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వర్ల రామయ్య మాట్లాడుతుండగా చంద్రబాబు మైక్ తీసుకుని మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మంత్రి జవహర్ హాజరైనా ఆయనకు కూడా అవకాశం ఇవ్వకపోగా సమావేశానికి వచ్చిన వారిని కూడా మాట్లాడనివ్వకుండానే చంద్రబాబు తను చెప్పాలనుకున్నది చెప్పేసి ముగించారు. ఎస్‌సి, ఎస్‌టిలు టిడిపికి దూరంగా ఉన్నారనేది అపోహ అని, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఎస్‌సి సబ్‌ప్లాన్ కింద రూ.9,847 కోట్లు, ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద రూ.3,554 కోట్లు ఇచ్చామని, ఆ నిధులను మరింతగా పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో టిడిపి, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



కులసంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రలోభాల పరంపర

కాకినాడలోని మొత్తం 48 డివిజన్లలోనూ అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపిలు ప్రలోభాల వల విసిరారు. అధికార పార్టీ అభ్యర్థుల పక్షాన ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఇచ్చారు. బలమైన అభ్యర్థులు పోటీలో ఉన్నచోట అంతకంటే ఎక్కువగా కూడా పంచేశారు. వైసిపి అభ్యర్థులు కూడా రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకూ ఇచ్చారు. బిజెపి కూడా అధికార పార్టీ కోవలోనే ఓటర్లు అందరికీ పంపిణీ చేశారు. అధికార పార్టీ తరపున రెండు రోజుల క్రితమే ప్రారంభమైన డబ్బుల పంపిణీ ఆదివారం మధ్యాహ్నానికి దాదాపుగా పూర్తిచేసినట్టు చెబుతున్నారు. వైసిపి శనివారమే డబ్బుల పంపిణీ ప్రారంభించడంతో ఆదివారం రాత్రికి పూర్తి చేయాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించినట్లు సమాచారం.

ముగిసిన ప్రచారం

కొద్దిరోజులుగా జోరుగా సాగిన ప్రచారం ఆదివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. శని, ఆదివారాల్లో సిఎం చంద్రబాబు ప్రచారాన్ని హోరెత్తించారు. ఆదివారం జగన్ రంగంలోకి దిగి రోడ్‌షోలలో ప్రసంగించారు. బిజెపి తరపున ఆ పార్టీ నేతలు ప్రచారం చేశారు. సిపిఎం రెండు డివిజన్లలోనూ, సిపిఐ డివిజన్లలోనూ పోటీ చేస్తున్నాయి. ఈ డివిజన్లతోపాటు కొన్నిచోట్ల స్వతంత్రులకు వామపక్షాలు మద్దతు ఇచ్చాయి. ఆ పార్టీల తరపున సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 29న ఎన్నికలు జరగనున్నాయి.



కాకినాడ ఎన్నికల ప్రచారంలో రఘువీరారెడ్డి

'మనీ'టంగ్ వ్యవహారాలే ఆధారం

పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విమర్శ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపి, వైసిపి, బిజెపిలు మదర్ టంగ్ మరిచిపోయి 'మనీ'టంగ్ వ్యవహారాల (డబ్బు పంపిణీ) మీదనే ఆధారపడుతున్నాయని, వాటికి బుద్ధి చెప్పాలని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి ప్రజలను కోరారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల ఎన్నికల్లో రూ.200 కోట్లు వెదజల్లారని ఆరోపించారు. ఇప్పుడు కాకినాడలోనూ ఆ పనే చేస్తున్నారని విమర్శించారు. టిడిపి కార్పొరేటర్ అభ్యర్థికి రూ.50 లక్షలు, వైసిపి కార్పొరేటర్ అభ్యర్థికి రూ.25 లక్షలు ఓట్లు కొనేందుకు ఇచ్చారన్నారు. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతున్నా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. టిడిపి, వైసిపి, బిజెపిలు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రంలోని నరేంద్రమోడీ వద్ద తాకట్టు పెట్టాయని, రాష్ట్ర అభివృద్ధికి అవరోధంగా తయారయ్యాయన్నారు. ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయన్నారు. కాపు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌కు సవరణ చేయాల్సి ఉందన్నారు. అది చేసే సత్తా తమ పార్టీకే ఉందని, టిడిపి, వైసిపిలకు లేదని తేల్చి చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులు 17 మందిని గెలిపించాలని కోరుతూ నిర్వహించిన మోటర్ బైక్ ర్యాలీని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మ ఆధ్వర్యాన మహిళలు రోడ్ షోలో పాల్గొన్నారు.

మోడీ విధానాల్ని ఎండగడుతూ 15 నుంచి దేశ వ్యాప్త ప్రచారం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోడీ ప్రభుత్వ విధానాల్ని ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలోని పరిస్థితుల్ని నెల రోజులపాటు ప్రజలకు వివరిస్తామన్నారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకయ్య, చంద్రబాబు లిద్దరూ ప్రజాస్వామ్యం, చట్టసభల గురించి ప్రవచనాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్ని చూస్తుంటే భవిష్యత్తులో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండడమే మేలనిపిస్తోంద"న్నారు. నంద్యాల ఉప ఎన్నికలో టిడిపి, వైసిపిలు పోటీలుపడి మరీ ఓటర్లను కొనుగోలు చేసాయన్నారు. నిజమైన అభివృద్ధి జరిగి ఉంటే ప్రచారానికి సిఎం వెళ్లనవసరం లేదన్నారు. నంద్యాల ఉప ఎన్నిక నిర్వహణలో ఎన్నికల కమిషన్, పోలీసుశాఖ పూర్తిగా విఫలమయ్యా యన్నారు. ప్రస్తుతం ఫలితాలపై కోట్లలో బెట్టింగులు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నక్సల్స్‌ను కాల్చేయడమొక్కటే పోలీసుల పని అన్నట్టుగా డిజిపి సాంబశివరావు భావిస్తున్నారన్నారు. బెట్టింగ్‌లపై ప్రేక్షకపాత్రను పోషించడం దారుణమన్నారు.

ధర్మాజీగూడెం పిహెచ్‌సిలో నిండు గర్భిణి మృతి

డాక్టర్ అరెస్టుకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - లింగపాలెం (పశ్చిమగోదావరి)

డాక్టర్ నిర్లక్ష్యానికి ఓ నిండుగర్భిణి బలైంది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఆ డాక్టర్‌ను అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని పిహెచ్‌సిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, బంధువుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన దేవరపల్లి విఘ్నేశ్వరి(22), మండలంలోని మఠంగూడెం శివారు సుందరరావుపేటకు చెందిన తంబి భార్యభర్తలు. విఘ్నేశ్వరికి ఈనెల పురిటి25న నొప్పులు రావడంతో ధర్మాజీగూడెం పిహెచ్‌సికి శుక్రవారం ఉదయం 10 గంటలకు తీసుకెళ్లారు. గర్భిణిని పరీక్షించిన అక్కడి వైద్యాధికారి మోజేస్ వినయ్‌కుమార్ ఆసుపత్రిలో చేర్చుకుని ఆమెకు సాధారణ ప్రసవమవుతుందని చెప్పి అక్కడే ఉంచారు. శని, ఆదివారాలు వైద్యాధికారి అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ ఆదేశాలు లేకుండా ఏం చేయాలో తెలియక ఆమెకు ప్రసవం చేయలేదు. శుక్రవారం నుంచి నొప్పులతో వేదన అనుభవిస్తున్న విఘ్నేశ్వరికి ఆదివారం నొప్పులు తీవ్రతరమయ్యాయి. ఆ సమయంలో కూడా వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో పరిస్థితి విషమించింది.



వైద్యుడి నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన గర్భిణి విఘ్నేశ్వరి

సకాలంలో సరైన వైద్యం అందక విఘ్నేశ్వరి తనకు పుట్టబోయే బిడ్డతో సహా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పిహెచ్‌సి వద్ద ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.సురేష్‌బాబు మృతురాలి బంధువులతో మాట్లాడారు. ప్రభుత్వపరంగా సాయం అందిస్తామని చెప్పారు. దానికి వారు నిరాకరించారు. తమకు ఇద్దరు ప్రాణాలను ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చే సాయం అక్కర్లేదని తేల్చి చెప్పడంతో ఆయన వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ డాక్టర్ మోజేస్ వినయ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

డ్వాక్రా వ్యాపారాలను ప్రపంచస్థాయికి తీసుకెళ్తా

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-కాకినాడ

డ్వాక్రా సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపారాలను ప్రపంచస్థాయికి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ అంబేద్కర్ భవనంలో ఆదివారం నిర్వహించిన డ్వాక్రా సంఘాల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరిక నిర్మూలన కోసం స్వయం ఉపాధితో కూడిన డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కుటుంబానికీ వడ్డీలేని రుణం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. మహిళల ముఖాల్లో వెలుగును నింపేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీపం పథకంలో భాగంగా సబ్సిడీతో కూడిన గ్యాస్‌ను అందజేశామన్నారు. రాష్ట్రంలో 60 లక్షల టిడిపి సభ్యత్వాలు వుంటే, డ్వాక్రా సంఘాల సభ్యులు 90 లక్షల మంది ఉన్నారని తెలిపారు. రౌడీలు చెప్పే కథలు వినొద్దని, వారి మాటలు వినడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని సూచించారు. నంద్యాలను పులివెందులలా మారుస్తామంటే అక్కడ ప్రజలు ఒప్పుకోలేదన్నారు. కాకినాడను పులివెందులగా మారుస్తామని చెబుతుండటం హాస్యాస్పదమన్నారు. ప్రతి మహిళ రాత్రిపూట ప్రశాంతంగా నడిరోడ్డుపై తిరిగే విధంగా భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు.

మినహాయింపుల్లేని రిజర్వేషన్లు ఇవ్వాలి

- బలిజ, కాపు, తెలగ ప్రతినిధుల డిమాండ్
- అడ్‌హాక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఇమ్మడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

షరతులతో కూడిన రిజర్వేన్లు తమకు అక్కర్లేదని, ఎటువంటి మినహాయింపుల్లేని పూర్తి స్థాయి రిజర్వేషన్లు ఇవ్వాలని బలిజ, కాపు, తెలగ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బలిజ, కాపు, తెలగ ప్రతినిధుల తొలి సమావేశం విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్ ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి 13 జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా ఇమ్మడి సత్యనారాయణ, సభ్యులుగా మరో 14 మందిని ఎంపిక చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, ఎంబిసి, మైనారిటీలను ఒక తాటి పైకి తీసుకొస్తామన్నారు. ఇదివరకే ఆయా వర్గాల నేతలతో సంప్రదింపులు జరిపామన్నారు. ఇప్పటి వరకు అగ్రకులాల ప్రతినిధులే పాలకులుగా వ్యవహరిస్తూ, మిగిలిన వర్గాల వారిని బానిసలుగా చూస్తున్నారని, ఈ వ్యవస్థ మారాలని, ఇదే తమ ప్రధాన అజెండాగా పనిచేస్తామన్నారు. రాజకీయ అధికారాన్ని చేపట్టేందుకు అన్ని వర్గాల్నీ కూడగడతామన్నారు. దీని కోసం త్వరలో ఒక రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

స్విస్ ఛాలెంజ్‌తో రాష్ట్రానికి నష్టం

- జీవో 179ను రద్దు చేయాలి
- సిఎం చంద్రబాబుకు ఐవైఆర్ లేఖ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో



అమరావతి నగర నిర్మాణానికి స్విస్ ఛాలెంజ్ విధానం సరైనది కాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్విస్ ఛాలెంజ్ విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు 19 పేజీల లేఖ రాశానన్నారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా సింగపూర్ కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని ఆరోపించారు. జీవో 179 ద్వారా సింగపూర్‌లోని అసెండస్, సింగ్రిడ్జి, సెంబ్‌కార్ప్ సహా మరికొన్ని కంపెనీలను దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ పరిణామాలను చూస్తుంటే సింగపూర్ కంపెనీల విషయంలో నిబంధనలను సమగ్రంగా పాటించారా? అన్న అనుమానం తలెత్తుతోందన్నారు. జీవో 179ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్విస్ ఛాలెంజ్ అంటే సుమోటోగా కంపెనీలు రావాలని, కానీ ప్రలోభాలతోనే పనులను కట్టబెడుతున్నట్టుగా ఉందని పేర్కొన్నారు. సింగపూర్‌లో వారి అంతర్గత విషయాల్లో మాత్రమే నిజాయతీ పాటిస్తారని, ఇతర విషయాల్లో మాత్రం నిజాయతీగా ఉండరని చెప్పారు. ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి చట్ట విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సాంకేతిక కమిటీని కూడా పారదర్శకంగా వేయలేదన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు రాకముందే పనులు ప్రారంభించడం సరికాదన్నారు. భవిష్యత్‌లో తీర్పు వ్యతిరేకంగా వస్తే, రాజధాని చోటు మార్చాల్సి ఉంటుందన్నారు. అటువంటప్పుడు తొందరపడి పనులను అప్పజెప్పాల్సిన అవసరం లేదన్నారు. నిర్మాణ లెక్కలు గాలిలో మేడలు కట్టినట్టుగా ఉన్నాయన్నారు. ప్రలోభాలతో కాకుండా అంతర్జాతీయ బిడ్డింగ్ విధానంలోనే రాజధాని నిర్మాణ పనులను అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

టిడిపి గడ గడ

- ముద్రగడ పాదయాత్రతో ఆత్మరక్షణలో పడ్డ అధికార పక్షం..!
- జిల్లాల వారీగా అడ్‌హాక్ కమిటీల ఏర్పాటుకు కాపు నేతలు సమాయత్తం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత నెల రోజులుగా గృహ నిర్బంధానికే పరిమితమైన కాపు రిజర్వేషన్ల ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆదివారం పోలీస్ బంధనాలను తెంచుకుని రోడ్లపైకి రావడంతో అధికార తెలుగుదేశం వర్గాలకు ముచ్చెమటలు పట్టాయి. మరోవైపు పోలీసుల్నీ పరుగులు పెట్టించింది. కాకినాడ మున్సిపల్ ఎన్నికలకు కొన్ని గంటల ముందు జరిగిన ఈ పరిణామంతో అధికార టిడిపిని ఆత్మరక్షణలో పడేసింది. 2014 ఎన్నికల సందర్భంగా టిడిపి హామీ ప్రకారం కాపు రిజర్వేషన్లు అమలు కోరుతూ తూర్పు గోదావరి కిర్లంపూడి నుంచి అమరావతికి సుమారు 126 కిలోమీటర్లు, 25 రోజులు నిరవధిక పాదయాత్ర చేపడతానని ముద్రగడ గతంలోనే ప్రకటించారు. ఇందులో భాగంగా గత నెల జులై 26న పాదయాత్రను ప్రారంభించారు. యాత్రకు ఎటువంటి అనుమతులు లేవని పోలీస్ అధికారులు ముద్రగడను అప్పట్నించి గృహ నిర్బంధంలో ఉంచారు. టిడిపి నేతలు ముద్రగడ యాత్రకు సుముఖంగా లేకపోవడంతో ఈ నెల రోజుల వ్యవధిలో కొన్నిసార్లు కిర్లంపూడిలోని ఇంటి నుంచి పాదయాత్ర చేయడానికి బయటకు వచ్చినా పోలీసులు అడ్డుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటి వరకు ఇంటికే పరిమితమైన ముద్రగడ ఆదివారం పోలీసుల కళ్లుగప్పి ఒక్కసారిగా కిర్లంపూడి నుంచి వీరవరం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఇది అధికార టిడిపిని ఉలికిపాటుకు గురిచేసింది. పోలీస్ సిబ్బంది అంతా కాకినాడ మున్సిపల్ ఎన్నికల హడావిడిలో ఉండటంతో ముద్రగడ పాదయాత్రను ప్రారంభించి కొన్ని గ్రామాల్లో పర్యటించారు. అప్రమత్తమైన పోలీసులు ముద్రగడను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో తరలించారు. సున్నితమైన రాజకీయ అంశం కావడంతో ఏం జరుగనుందోనని ప్రభుత్వ అధికారులు గడగడలాడిపోతున్నారు. ముద్రగడ వ్యవహారంలో పోలీస్ శాఖ అధికార టిడిపికి తొత్తుగా మారిందన్న విమర్శలూ లేకపోలేదు. టిడిపి ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో స్వయంగా డిజిపి సాంబశివరావు రంగంలోకి దిగారు. తూర్పు గోదావరి జిల్లాకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరించారు.

అయోమయంలో ప్రభుత్వం...!

రాష్ట్రంలో కాపు, ఉపకులాల సామాజిక వర్గానికి బలమైన ఓటు బ్యాంక్ ఉండటంతో ముద్రగడ వ్యవహారంలో ప్రభుత్వం ముందు నుంచి ఆచితూచి వ్యవహరిస్తోంది. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో అక్కడ బలిజ సామాజిక వర్గం ఓట్లుండడం, కాకినాడ మున్సిపాలిటీలోనూ కాపు, ఉపకులాల ఓటింగ్ అత్యధికంగా ఉండటంతో ముద్రగడ వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రభుత్వం సంయమనం పాటించినట్లు కనబడుతోంది. యాత్రకు అనుమతిస్తే ఏం జరుగుతుందోనన్న భయంతో పాటు కాపు సామాజిక వర్గంలో తమ పట్టు సడలిపోతుందన్న ఆందోళన అధికార టిడిపి వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో ముద్రగడ వ్యవహారాన్ని ఏ విధంగా సెటిల్ చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది.

కాకినాడ మున్సిపోల్స్ తరువాత కీలక నిర్ణయం తీసుకుందామనుకునే సమయంలోనే ఈ విధంగా జరగడం తాము ఆత్మరక్షణలో పడిపోయామని టిడిపికి చెందిన కొందరు కాపు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ రాజకీయ భవిష్యత్తు కూడా ఇబ్బందుల్లో పడే పరిస్థితులున్నాయని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా అడ్‌హాక్ కమిటీలు....!

కాపు ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండటంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాపు నేతలు రహస్యంగా సమావేశమై భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు. దీనికి సంబంధించి విజయవాడలో ఆదివారం కీలక సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా అడ్‌హక్ కమిటీలు ఏర్పాటు చేసి తూర్పు గోదావరిలో ఉద్యమం చేస్తున్నట్లు ఇకపై అన్ని జిల్లాల్లోని కాపు నేతలందరూ ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. అన్ని జిల్లాల్లోనూ రిజర్వేషన్లకు మద్దతుగా, రాజకీయ పార్టీలకతీతంగా నాయకులు ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తేనే ప్రభుత్వంలో కదలిక వస్తుందని భావిస్తున్నారు. దీనికనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇంటింటా కిడ్నీ రోగులు

ఉద్దానాన్ని తలపిస్తున్న శ్రీరంగరాజపురం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా బలిజిపేట మండలం నారన్నాయుడువలస పంచాయతీ శ్రీరంగరాజపురంలో ఇంటికో కిడ్నీ రోగి కనిపిస్తున్నాడు. కిడ్నీ రోగులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన శ్రీకాకుళం జిల్లాలోని ఈ గ్రామం ఉద్దానం ప్రాంతాన్ని తలపిస్తోంది. నీటి కాలుష్యమే ఈ సమస్యకు కారణమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. జన్మభూమి కార్యక్రమాల్లో ఎంపిడిఒ, తహసీల్దార్, పిహెచ్‌సి వైద్యులు మొదలుకుని మాజీ మంత్రి కిమిడి మృణాళికి సైతం విన్నవించినా ఫలితం లేకపోయింది. గ్రామంలో 70 ఇళ్లు ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకూ కిడ్నీ, కీళ్ల నొప్పుల సమస్యలు లేవని గ్రామస్తులు చెప్తున్నారు. అనంతరం గ్రామంలో వేసిన రెండు బోర్ల నీటి వాడకం మొదలెట్టిన ఏడాది లోపు నుంచే కిడ్నీ వ్యాధులు, కీళ్ల నొప్పులు, పళ్లు గారపట్టడం, కాళ్ల మడమలు వంకరపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. నీరు మాత్రం చల్లగా, రుచిగా ఉంటుందని, తాగిన కొద్దిసేపటికే శరీరం వేడెక్కి మూత్రం రావడం లేదని పలువురు తెలిపారు. గ్రామంలో ఎక్కువమంది గారపట్టిన పళ్లతో బాధపడుతున్నారు. చిన్నపిల్లలు, యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారూ పైనపేర్కొన్న వాటిలో ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారు. 25 ఏళ్ల పడాల రమేష్, 35 ఏళ్ల పడాల అప్పలస్వామి ఐదేళ్లగా కీళ్ల నొప్పులు, చిప్పల సలుపులతో బాధపడుతున్నారు. కోనారి గంగరాజు, పడాల పైడిరాజు, పడాల శివుడు ప్రస్తుతం విజయనగరం, శ్రీకాకుళం జిల్లా రాజాంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పడాల ఎకరయ్యకు కిడ్నీ సమస్య ఉన్నట్టు ఐదేళ్ల క్రితం తేలింది. విశాఖలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికి ఉన్న రెండెకరాల పొలం విక్రయించినా వ్యాధి అదుపులోకి రాలేదు. ప్రస్తుతం ఆయన వద్ద డబ్బులు లేకపోవడంతో వైద్యం చేయించుకోలేక ఏడాదిగా ఇంటి వద్ద మంచంపై మూలుగుతున్నాడు.

భోగాపురంలో జిఎంఆర్ వెనక్కి!

- ఎయిర్‌పోర్ట్ అథారిటీకే పనులు
- లాభంలో 30.2 శాతం చెల్లించేందుకు ఎఎఐ సుముఖం
- కేంద్ర, రాష్ట్రాలమధ్య టెండర్ దోబూచులాట



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)కే దక్కనుంది. గట్టి పోటీదారుగా ఉన్న జిఎంఆర్ గ్రూపు స్వల్ప తేడాతో వెనుదిరగాల్సి వచ్చింది. రెండు రోజుల క్రితం తెరిచిన ఫైనాన్స్ బిడ్‌లో జిఎంఆర్ కన్నా ఎక్కువ మొత్తాన్ని తమ లాభాల నుంచి ప్రభుత్వానికి చెల్లించేలా ఎఎఐ ముందుకు రావడంతో ఆ సంస్థకే అవార్డు ప్రకటించాల్సి పరిస్థితి నెలకొంది. అయితే టెండర్ ఖరారుపై కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలాకాలంగా నెలకొన్న దోబూచులాటకు తెరపడినప్పటికీ, అవార్డు ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలోగా స్పందిస్తుందన్నది చూడాలి. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసేయాల్సిన నేపథ్యంలో విజయనగరం జిల్లా భోగాపురంలో మరో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించేందుకు, దానికి కొంత ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. మొత్తం రూ.2260 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. దీనికోసం 2726 ఎకరాల భూమిని కూడా దాదాపు సేకరించారు. ఇందులో భాగంగానే టెండర్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. సాంకేతిక బిడ్లలో జిఎంఆర్, ఎఎఐ అర్హత సాధించగా, తాజాగా తెరిచిన ఆర్థిక బిడ్లలో ఎఎఐ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సంస్థ తనకు వచ్చే లాభాల్లో 30.2 శాతాన్ని చెల్లించేందుకు ప్రతిపాదించగా, జిఎంఆర్ మాత్రం 21.6 శాతాన్ని ప్రతిపాదించింది. దీంతో ఎఎఐకే టెండర్ ఖరారు చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి టెండర్ ఖరారైన సంస్థ, ప్రభుత్వం కేటాయించిన భూమికి గాను లైసెన్స్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఎంత చెల్లించాలనేది ప్రభుత్వమే ఖరారు చేస్తుంది. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన పదేళ్ల తరువాత నుంచి విమానాశ్రయ నిర్వహణ ద్వారా వచ్చిన లాభాలపై కొంత శాతాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ లాభాన్నే ఎఎఐ ఎక్కువగా ప్రతిపాదించడంతో ఆ సంస్థకే టెండర్ ఖరారు చేయాల్సి వస్తోంది. వాస్తవానికి టెండర్ ప్రక్రియలో ఎఎఐకి కేంద్రం, జిఎంఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్రానికి చెందిన కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు కూడా ఎఎఐకే అనుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే టెండర్ ఎవరికి దక్కుతుందన్న దానిపై అనేక ఊహాగానాలు నెలకొన్నప్పటికీ, తాజా ఆర్థిక బిడ్ల ద్వారా ఎఎఐకే అనుకూలంగా రావడం విశేషం. ఇది చంద్రబాబు ప్రభుత్వంలో కొంతమందికి రుచించడం లేదని అంటున్నారు. ఎఎఐకే టెండర్ అనుకూలంగా రావడంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విధానాన్ని అవలంబిస్తుందన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తే ఎఎఐకే ఇవ్వాల్సి ఉంటుంది. అయితే వెనువెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా, లేక తాత్సారం చేస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా ఉందని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పొంచి ఉన్న నీటి సంక్షోభం



సాగర్ నుంచి విడుదల కాని నీరు

- 50వ ఏట అథమ స్థాయికి సాగర్ నీటి మట్టం
- గుంటూరు, నెల్లూరుజిల్లాల పరిధిలో ఎండిపోనున్న 500 చెరువులు
- 11.17 లక్షల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తగ్గిపోవడంతో అధికారుల్లో, రైతుల్లో ఆందోళన పెరిగింది. ప్రాజెక్టు నిర్మించి 50 ఏళ్లు గడిచింది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సాగర్ జలాశయం నుంచి తొలిసారిగా కాల్వలకు నీరు విడుదల చేశారు. అప్పటి నుంచి మూడు, నాలుగు సార్లు మినహా సాగర్ నుంచి తాగు, సాగునీరు విడుదల అవుతూ వస్తోంది. యుద్ధ ప్రాతిపదికన సాగర్ నుంచి వారంలోగా నీరు విడుదల చేయకుంటే గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 500 చెరువులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ చెరువుల కింద దాదాపు 350 రక్షిత నీటి పథకాలు పనిచేస్తున్నాయి. ఈ పథకాలకు నీరు సరఫరా కాకపోతే ఈ రెండు జిల్లాల్లోనూ తాగునీటి కటకట తప్పదు.

శనివారం సాయంత్రానికి సాగర్‌లో నీటి మట్టం 500.10 అడుగుల్లో ఉంది. గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా మరో 11 అడుగులు తగ్గి 489 అడుగులకు నీరు చేరితే డెడ్ స్టోరేజీకి చేరినట్టేనని అధికారులు తెలిపారు. ప్రస్తుతం శ్రీశైలంలో 782.9 అడుగుల్లో ఉంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు నాలుగు నెలలుగా నీరు రావడం లేదు. 2014-15లో సాగర్‌కు ఎగువ నుంచి వరద రావడం వల్ల గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 159 టిఎంసిలు తాగు, సాగు నీరు అవసరాలకు వినియోగించారు. 2015-16లో ఏ పంట కూ నీరివ్వలేదు. కేవలం 17.46 టిఎంసిలే తాగునీటి అవసరాలకు వినియోగించారు. 2016-17లో ఆరుతడి పంటలకు, తాగునీటి అవసరాలకు కలిపి 59 టిఎంసిలు ఈ రెండు జిల్లాలకు విడుదల చేశారు. 2017-18లో ఇప్పటి వరకూ ఒక్క టిఎంసి అయినా సాగు కోసం విడుదల చేయలేదు. ఈఏడాది మేలో తాగునీటి చెరువుల కోసం 5.71 టిఎంసిలు మాత్రమే విడుదల చేశారు. మే 12న పూర్తిగా కాల్వకు నీరు నిలిపివేశారు. దాదాపు 100 రోజులు దాటినా ఇప్పటి వరకూ తాగు, సాగునీటి అవసరాలకు నీరు రావడం లేదు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని 11.17 లక్షల ఎకరాల భూమిలో సాగు ప్రశ్నార్థకంగా మారింది. గత 50 ఏళ్లలో 2002-2003, 2012- 2013, 2015-16లో ఇప్పటి వరకూ సాగర్‌పరిధిలో తీవ్రమైన నీటి సమస్య రాగా ఈ ఏడాదీ ఇదే పరిస్థితి పునరావృతం కానుంది. మూడేళ్లుగా సాగర్ ఆయకట్టులో వరికి అవకాశం ఇవ్వడం లేదు. ఈ ఏడాదీ వర్షాధార పంటలు మాత్రమే వేసుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు నిండిన తర్వాత శ్రీశైలానికి నీరొస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. సాగర్ జలాశయానికి మూడునెలలుగా నీరు రావడం లేదు.

తాగు అవసరాల కోసం తక్షణం సాగర్ నుంచి గుంటూరు, ప్రకాశం, కృష్ణా, నల్గొండ, హైదరాబాద్ జిల్లాలకు 20 టిఎంసిలు నీరు విడుదల చేయాలని కృష్ణా రివర్ బోర్డుకు తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు విజ్ఞప్తి చేశాయి. తాము కర్నాటకు లేఖ రాస్తామని కృష్ణా బోర్డు రెండు ప్రభుత్వాలకు తెలిపింది. అయినా ఇంత వరకూ సానుకూల స్పందనా రాలేదు. దీని వల్ల చిలకలూరిపేట, ఒంగోలు పట్టణాలకూ తాగునీటి సమస్య పొంచి ఉంది. సాధారణంగా సాగర్ నుంచి పూర్తి స్థాయిలో నీరు విడుదలైతే గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 4.35 లక్షల ఎకరాల్లో వరి, 6.82 లక్షల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తారు.

పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు

రెండు రోజుల్లో జూరాలకు నీరు

కృష్ణానది పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర డ్యాంల కింద ఉండే ఆయకట్టు రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆల్మట్టి డ్యాంలోకి 17,896 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. కృష్ణానది ఉప నది అయిన తుంగభద్ర నదిపై ఉన్న తుంగభద్ర డ్యాంలోకి 10,700 క్యూసెక్కులు వస్తోంది. కృష్ణానదికి మరో ఉపనది అయిన భీమానదిపై ఉండే ఉజ్జయిని డ్యాంలోకి ఏకంగా 36,523 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఉజ్జయిని డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 117 టిఎంసిలు కాగా ప్రస్తుతం 104.5 టిఎంసిలు ఉంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 96.5 టిఎంసిలు ఉంది. ప్రస్తుతం ఉజ్జయినీ డ్యాంలోకి రోజుకు 3 టిఎంసిలకు పైబడి వస్తుండడంతో మరో రెండు రోజుల్లో డ్యాంలో పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకుని దిగువన జూరాల వైపు నీరొచ్చే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 100.8 టిఎంసిలు కాగా ప్రస్తుతం 59.8 టిఎం సిల దాకా ఉంది. తుంగభద్ర ఉపనది వేదవతి ఉప్పొంగ డంతో 200 క్యూసెక్కుల ప్రవాహం ఆర్‌డిఎస్‌లో కలుస్తోంది.

అలాగే అల్మట్టి, నారాయణపూర్‌లలోనూ పూర్తిస్థాయిలో నీటి మట్టాలు ఉండడం వల్ల ఇప్పుడొచ్చే వరద ప్రవాహమంతా జూరాల వైపే వచ్చే అవకాశం ఉంది.

జూరాల నిండితేనే శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు

జూరాలలో పూర్తిస్థాయి సామర్థ్యం 9.66 టిఎంసిలకుగాను 5.99 టిఎంసిలు ఉంది. జూరాల నిండేందుకు ఇంకా మూడున్నర టిఎంసిల నీరు రావాలి. ఎగువన వర్షాలు కురుస్తుండడంతో ఈ నీరు జూరాలకు వచ్చి జూరాల నిండగానే శ్రీశైలం వైపు వరద వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో డెడ్‌స్టోరేజీ కంటే తక్కువస్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 215 టిఎంసిలు కాగా ప్రస్తుతం 21.6 టిఎంసిలు మాత్రమే అందుబాటులో ఉంది.



రాష్ట్రంలో బౌద్ధ క్షేత్రాల సర్క్యూట్

- రూ.60 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిలో బౌద్ధ క్షేత్రాల సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని పర్యాటక, సాంస్కృతి శాఖ నిర్ణయించింది. ఇందు కోసం స్వదేశ్ దర్శన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కేంద్ర పర్యాటక శాఖ ఉన్నత స్థాయి సమీక్షలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. దీంతో ఈ క్షేత్రాల్లో బుద్ధుల నిర్మాణాలను చేపట్టేందుకు పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తోంది. బౌద్ధ క్షేత్రాల ఏర్పాటుతో సరిపెట్టుకోకుండా వాటిపై విస్తృత ప్రచారం చేపట్టాలనే ఆలోచనలో పర్యాటక శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఉన్నతాధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన అనంతరం రాష్ట్రంలో బౌద్ధ క్షేత్రాల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. క్షేత్రాల ఏర్పాటుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతితో పాటు ఐదు ప్రాంతాల్లో ఈ బౌద్ధ క్షేత్రాలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎపిటిడిసి) నిర్ణయించింది. ఆ క్షేత్రాల వద్దే ఆహ్లాద కేంద్రాలు, పార్కింగ్, యోగా కేంద్రాలు (ధ్యాన బుద్ధ వనం) ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనుంది. తొట్లకొండ, బావికొండ, శాలిహుండం, బొజ్జనకొండ, అనుపలో బౌద్ధ క్షేత్రాల అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లను కూడా ఆహ్వానించనున్నారు. ప్రాచీన సంపదను భావితరాలకు అందిచాల్సిన బాధ్యత తమపై ఉందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఘంటసాలలో అతి పెద్ద బుద్ధ విగ్రహం

కృష్ణా జిల్లా ఘంటసాలలో అతి పెద్ద బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. రూ.1.5 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రెండున్నర ఎకరాల స్థలంలో 70 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో మహాపరినిర్వాణలో ఉన్న బుద్ధుని విగ్రహాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు తుది ఆకృతుల్ని పర్యాటక శాఖ ఇప్పటికే విడుదల చేసింది. ఒక చేతిని భూమిని ఆనించి పడుకున్న బుద్ధుని ఆకారంలో ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రెండు అంతస్తులుగా చేపట్టనున్న ఈ నిర్మాణంలో బౌద్ధ గ్రంథాలయం, ధ్యాన కేంద్రం, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ హాల్ ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు.

పునరావాసం నత్తనడక

- 2018 నాటికి తొలిదశ పూర్తికి సన్నాహాలు
- వెలుగొండ నిర్వాసితులు కూడా నీళ్లలోనేనా?
- ఇంతవరకూ నిర్మాణం కాని పునరావాస కాలనీలు
- రీ సర్వేచేసి 18 ఏళ్లు నిండిన బాధితులకూ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు ప్రతినిధి

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత కలల ప్రాజెక్టు వెలుగొండ. ఇరవై ఏళ్ళ క్రితం చేపట్టిన ఈ ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం పూర్తి కాలేదు. వీరి సమస్యను పరిష్కరించకుండా మరో ఏడాదిలో తొలిదశ నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని ప్రభుత్వం చెబుతోంది. అంటే నిర్వాసితులు నీళ్లలోనే వదిలేస్తుందా? లేక ఏడాదిలో పూర్తి చేస్తామని ఉచిత హామీలిస్తోందా? అనేది తేలాల్సి ఉంది. నిర్వాసితుల పిల్లలు కూడా పెద్దలయ్యారు. కుటుంబాల సంఖ్య పెరిగింది. వీరంతా వివిధ దశల్లో ఆందోళనలు చేశారు. అధికారులు హామీలిచ్చారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదు. మొత్తంగా నిర్వాసితులను వదిలేశారు.

వెలుగొండ ప్రాజెక్టు వల్ల 12 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ గ్రామాలన్నీ రిజర్వాయర్‌లోనే ఉన్నాయి. ఏ ఒక్క గ్రామానికీ పునరావాసం కల్పించలేదు. అక్కడ నుంచి జనం ఖాళీ చేయాలంటే వేరే చోట పునరావాసం కల్పించాల్సిందే. ప్రస్తుతం రెండు గ్రామాలకు పునరావాస చర్యలు సాగుతున్నాయి. గుండంచర్ల, గొట్టిపడియ గ్రామాలకు పునరావాస కాలనీల కోసం ఇంతవరకూ భూసేకరణే చేయలేదు. ప్రస్తుతం సాగుతున్న పునరావాస పనులు చూస్తే మరో నాలుగేళ్లు పట్టేలా కనిపిస్తోంది.

పునరావాస పనులు ఇలా..

వెలుగొండ ప్రాజెక్టు వల్ల 7,200 మంది రైతులు, వివిధ తరగతుల ప్రజలు నిర్వాసితులుగా మారారు. 2006 నాటికి చేపట్టిన సర్వేలో ఈ సంఖ్య తేలింది. ప్రాజెక్టు కింద పెద్దారవీడు మండలంలోని కలనూతల, చింతలముడిపి, కాటంరాజుతండ, గుండంచర్ల, సుంకేశుల గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కలనూతల, చింతలముడిపి, కాటంరాజుతండ గ్రామాలకు మార్కాపురం సమీపంలోని దరిమడుగు వద్ద ఇడుపూరు 1,2 కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. తోకపల్లి వద్ద గుండంచర్ల, సుంకేశుల నిర్వాసితులలో కొందరికి పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో పనులు నత్తనడకనే సాగుతున్నాయి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, దేవాలయాలు ఇంకా చేపట్టలేదు. విద్యుత్ సరఫరా కోసం రూ.68 లక్షలు కేటాయించారు. టెండర్లు పిలిచారు. ఇంకా సైడు కాలువలు, సిమెంటు రోడ్లు టెండర్ల దశలోనే ఉన్నాయి. కొన్ని కాలనీల్లో సిమెంటు రోడ్లు వేశారు. లే అవుట్‌లో కొన్ని పనులు చేశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇటీవలే ప్రాజెక్టును సందర్శించిన ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా వచ్చే ఏడాది వెలుగొండ సొరంగం పూర్తవుతుందని చెప్పారు. ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని చెప్పారు. ఇటీవల పునరావాసం కేంద్రాలలో పర్యటించిన జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి రూ.7 కోట్లతో పనులు చేపట్టామన్నారు. 6 నెలల్లో పనులు పూర్తిచేస్తామన్నారు. జరుగుతున్న పనులు చూస్తే ఆచరణలో సాధ్యం కావని స్పష్టమవుతోంది.



వెలిగొండ ప్రాజెక్టు ముఖద్వారం

18 ఏళ్లు నిండిన వారికీ ప్యాకేజీ

నిర్వాసితుల సంఖ్యను తేల్చేందుకు గతంలో అనేక సర్వేలు చేశారు. అన్నీ గణాంకాల్లోకి ఎక్కించారు. 2006 నాటికి నిర్వాసితుల సంఖ్యను తేల్చారు. అప్పటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ప్యాకేజీలు వర్తిస్తాయి. ఇప్పటికి పదేళ్లు దాటింది. ఆనాడు నిర్వాసితులుగా గుర్తింపులోకిరాని పిల్లలు.. పెద్దలై పెళ్లి చేసుకుని వేరు కాపురాలు పెట్టారు. ఇలాంటి వాళ్లు ఇపుడు రెండువేల మంది వరకూ ఉన్నారు. 2018 నాటికి సొరంగం తవ్వి ప్రారంభించాలనే ఆలోచన గట్టిగా ఉంటే ఈలోపే గ్రామాలను ఖాళీ చేయించాలి. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఇళ్లు, కాలనీలు నిర్మిస్తే తరలిపోతారు.

18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి

2006లో పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన యువకులను మాత్రమే ఆర్‌ఆర్ ప్యాకేజీలోకి తీసుకున్నారు. అప్పటి యువతీ, యువకులంతా వివాహాలు చేసుకున్నారు. తల్లిదండ్రులకు ఒక్క గృహం ఇచ్చి బిడ్డలకు ఇల్లు లేదంటే ఎలా? ఈ విధంగా ఒక్కో ఇంటిలో ఇద్దరు లేదా.. ముగ్గురు సంతానం కలిగిన వారికి ఇల్లులేని పరిస్థితి నెలకొంది. అందరూ కలిసి ఒకే ఇంటిలో ఉండలేని పరిస్థితి. ఇంటితోపాటు వారందరికీ ఆర్థిక ప్యాకేజీ అందదు. గ్రామం ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఎందరుంటారో, అందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి. అందు కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదు

- పాలిరెడ్డి కృష్ణారెడ్డి, కలనూతల, పెద్దారవీడు మండలం

అదనంగా రూ.20 లక్షలు ఇవ్వాలి

మా భూములకు 2006లో ఎకరానికి రూ.లక్ష ఇస్తే.. బ్యాంకుల్లో అప్పులకే సరిపోయాయి. పునరావాసం కల్పిస్తే.. తమకు జీవన భృతి పరిస్థితి ఏమిటి? ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదు. మరో పదేళ్లయినా పడుతుందేమో! మాకు 2013 భూ సేకరణ చట్టం తప్పక వర్తిస్తుంది. దాని ప్రకారం మా భూములకు లెక్క కట్టి ఇస్తే తమ జీవనానికి ఢోకా లేదు. లేదా ఇంటికో ఉద్యోగమైనా, అదనంగా రూ.20 లక్షల నగదయినా ఇవ్వాలి

- ఒంటెద్దు పెద్ద పిచ్చి రంగారెడ్డి,గొట్టిపడియ



ఘటనా స్థలంలోనే మృతిచెందిన అశోక్

వినాయక నిమజ్జనంలో అపశృతి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు మృతి

ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

వినాయక నిమజ్జనం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్నాడు. ఈ ఘటన కొత్తపట్నం మండలం ఈతముక్కలలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలులోని భాగ్యనగర్, రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరలో స్థానికులు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈతముక్కల, మడనూరు వద్ద నిమజ్జనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భాగ్యనగర్‌కు చెందిన యువకులు అశోక్(25), పవన్(14), శివకుమార్ నిమజ్జనానికి వెళ్లి, బైక్‌పై తిరిగి వస్తున్నారు. అదే సమయంలో కందులూరుకు చెందిన అలూరి రాంబాబు(28), బొబ్బాల క్రిష్ణమూర్తి(30) తమ గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనానికి మడనూరుకు బైక్‌పై వెళుతున్నారు. ఈ రెండు బైకులూ అతివేగంగా వస్తూ సూరారెడ్డిపాలెం రైల్వే గేటు దాటిన తరువాత ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో పవన్, క్రిష్ణమూర్తి, రాంబాబు మృతిచెందారు. శివకుమార్ కోమాలో ఉన్నాడు.

నూర్‌భాషాలకు రాజకీయ ప్రాధాన్యతనివ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగూల్ మీరా

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్రంలో ఉన్న నూర్‌భాషాలకు అన్ని రాజకీయ పార్టీలూ తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర నూర్‌భాషా సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగూల్ మీరా కోరారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎపి నూర్‌భాషా ముస్లిం యూత్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూర్‌భాషా యూత్ గౌరవాధ్యక్షుడు షేక్.చాన్‌భాషా అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాగూల్‌మీరా మాట్లాడుతూ.. వెనుకబడి ఉన్న నూర్‌భాషాల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. నూర్‌భాషాలకు ఎలాంటి కష్టమొచ్చినా తాను ముందుండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూర్‌భాషా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి షేక్.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి

ప్రజాశక్తి-కొండపి

గుండెపోటుతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతిచెందిన ఘటన మండలంలోని వెన్నూరులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మన్నం పద్మావతి(53) అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా సుమారు రూ.పది లక్షలకు పైగా ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలు చేసి, సంస్థకు చెల్లించింది. ఖాతాదారుల నుంచి డబ్బు కోసం ఒత్తిడి ఎక్కువైన నేపథ్యంలో శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది.

6 వేల కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)

విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు సుమారు ఆరు వేల కిలోల కల్తీ నెయ్యిని తీసుకెళుతున్న లారీని ఆదివారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాలక్యాన్‌లలో కల్తీ నెయ్యిని నింపి ఎవ్వరికీ అనుమానం రాకుండా లారీపై పట్టాలు కప్పి తీసుకెళుతుండగా ముందస్తు సమాచారంతో ఇబ్రహీంపట్నం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. కల్తీ నెయ్యి తరలిస్తున్న లారీని గుర్తించారు. ఈ సందర్భంగా సిఐ చవాన్ మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి విక్రయిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే నెయ్యి కల్తీయా కాదా అనే విషయాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నిర్ధారించాల్సి ఉందని, అందుకోసం శాంపిల్స్‌ను పంపామని తెలిపారు. నివేదిక రాగానే తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఎన్‌ఒసి లేని వ్యాపారులకు 'ఫైర్' నోటీసులు

- నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజీలు
- ఆరునెలల్లో వచ్చిన దరఖాస్తులు 1070, అనుమతి పొందినవి 740

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) లేకుండా కోట్లాది రూపాయల్లో వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులకు అగ్నిమాపక శాఖ లీగల్ నోటీసులు జారీ చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాక్టరీలు, కోల్డ్‌స్టోరేజీలు, పలు వ్యాపార సంస్థలు నడుస్తున్నాయని ఆ శాఖ అధికారులు గుర్తించారు. ఎన్‌ఒసిలు లేకుండా వ్యాపారం చేసే వారు తప్పని సరిగా నిబంధనలకనుగుణంగా మార్పులు చేసుకోవాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. ఇటీవల విజయవాడ ఆటోనగర్‌లోని ఓ కంపెనీ, ప్రకాశం జిల్లా చీరాలలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సినిమా హాలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. వీటికి ఎన్‌ఒసి లేకపోవడంతో త్వరలోనే లీగల్ నోటీసులిచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారని సమాచారం. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా పలు కోల్డ్ స్టోరేజీల యజమానులూ నిబంధనలను పాటించడంలేదని ఉన్నతాధికారులు గుర్తించారు. ఏదైనా సంఘటన జరిగితే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న ఉత్పత్తులకు నష్టపరిహారం చెల్లింపునకు ఇన్స్యూరెన్స్ అధికారులు తప్పనిసరిగా ఎన్‌ఒసి సర్టిఫికెట్‌ను పరిశీలిస్తారు. కొన్ని కోల్డ్ స్టోరేజీల విషయంలో ఇన్స్యూరెన్స్ అధికారులూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం గుంటూరులో ఉన్న 105 కోల్డ్ స్టోరేజీలను పరిశీలించి వీటిలో ఒక్కదానికే ఎన్‌ఒసి ఉందని గుర్తించారు. దీంతో డిజిపి, అగ్నిమాపక శాఖ డిజి కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్‌ఒసిలు తీసుకోవాలని హెచ్చరించారు. అయినా నేటికీ ఒక్కరూ దరఖాస్తు చేయలేదని వారు తెలిపారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి జూన్ 30 వరకు అగ్నిమాపక శాఖకు ఎన్‌ఒసి కోసం 1070 దరఖాస్తులొచ్చాయి. వీటిలో నిబంధనలకనుగుణంగా ఉన్న 740 దరఖాస్తులకు అనుమతి మంజూరు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 991 వ్యాపార సంస్థలు నిబంధనలకనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. వీటికి సంబంధించి 105 మంది వ్యాపారులకు నోటీసులిచ్చారు. రెండేళ్లుగా పరిశీలిస్తే ఎన్‌ఒసి లేనివి 482 ఉన్నట్లు గుర్తించిన అధికారులు 154 మందిపై కోర్టులో కేసులు దాఖలు చేశారు. 162 కేసులు ట్రయల్ రన్‌లో ఉన్నాయి. ఎన్‌ఒసిలు తీసుకోని 237 మందికి ఫారం-12 ప్రకారం నోటీసులు జారీ చేశారు. వీటిలో 123 మంది సమాధానాలివ్వకపోవడం, నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసుకోకపోవడంతో ఫారం-14 కింద నోటీసులు ఇచ్చారని సమాచారం. చివరిగా కోర్టు ద్వారా సమన్లు జారీచేసేలా చర్యలు తీసుకుంటామని అగ్నిమాపక శాఖ అధికారులు చెపుతున్నారు. కోర్టులో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అపరాధ రుసుం విధించే అవకాశం ఉంది.

సంపాదకీయం

‘మానవ జీవితానికి చిరునవ్వులతోనే స్వాగతం పలకాలి. ఆవేశం ఎంతటిదైనా.. ప్రశాంతత ముందు తల వాల్చాల్సిందే. మనిషి నిలువెత్తు స్వార్థానికి నిర్మల మనస్థత్వంతో సున్నితమైన సమాధానం చాలు. కవిత్వానికి యతి, ప్రాసల కఠిన పదాలే కాదు.. సారవంతమైన నాలుగు అక్షరాలతోనూ మనుషుల మనస్సులను కదిలించవచ్చు. అలాగే.. మానవీయ విలువలను కాపాడాలంటే నమ్మకమనే పునాదులపైనే అనుబంధాల భవనాన్ని నిర్మించాలి’ అంటాడు కవి, రచయిత సోమవరపు రఘుబాబు. అంతేకాదు... మనిషి మర మనిషై/ మమత మృగతుల్యమై/ మనసు జాడ తెలియని/ యంత్ర ప్రపంచంలో... నాడి తెలియక వెతుకుతున్న/నాకు నరుని చిరునామా/నల్లపూసై పోయింది..! అంటాడు. మనుషుల మధ్య ఆత్మీయ, అనురాగాలు, ఒకరంటే ఒకరికి విశ్వాసం, నమ్మకం ఉండాలంటూ నమ్మకం కాకూడదు అమ్మకం/ నమ్మిన వ్యక్తి ఉండాలి జీవితాంతం అంటాడు. జీవితంలో ఏది సాధించాలనుకున్నా... చేయగలనన్న నమ్మకం, నిజమైన ఆత్మస్థయిర్యం అంతరాల్లో నుండి రావాలి. నమ్మకం జీవితానికి అవసరం. అపనమ్మకం అశాంతికి కారణం. మనిషి బతకటానికి కావలసింది ప్రశాంతత. ఆ ప్రశాంతతకి పునాది నమ్మకం. నమ్మకాలన్నీ భ్రమలుగా మిగిలి పోతున్నప్పుడు, ఆ నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలి. సరికొత్తగా నిర్మించుకోవాలి. తమమీద తమకే నమ్మకం లేని వ్యక్తులు తమని తాము తీవ్రంగా నిందించుకుంటారు. అభద్రతా భావానికి లోనవుతుంటారు. ‘మనపై మనకుండే నమ్మకం శత్రువుని భయపెడుతుంది, మనపై మనకుండే అపనమ్మకం శత్రువు బలాన్ని పెంచుతుంది’ అంటాడు చాణక్యుడు. అందుకే నమ్మకం ఒక ఆయుధం. నమ్మకం ఒక సాధనం.

నమ్మకం

నమ్మకం అనేక బంధాల్ని ముడివేస్తుంది. జీవితంలో వేసే ప్రతి అడుగూ నమ్మకంతోనే వేయాలి. అలాంటి నమ్మికతో కూడిన అడుగు మనల్ని మనం సాధించుకోడానికి.. ఆత్మీయులను సంపాదించుకోడానికి సాధనమౌతుంది. అన్నిటికంటే ముందు మనల్ని మనం నమ్మాలి... మన ఆత్మీయులనూ నమ్మగలగాలి. అందుకే ఏ పనిచేయాలన్నా ఆత్మవిశ్వాసం ఉండాలి. అప్పుడే జీవితం ఆనందంగా సాగుతుంది.

‘నడిచేటి మనిషికి భూమిపై నమ్మకం/ నదిలోని చేపకి నీటిపై నమ్మకం/ నడిపించు నాయకుడికి వ్యూహంపై నమ్మకం/ నడిచేటి సేనకి నాయకుడిపై నమ్మకం’అంటాడు కవి మౌలాలి. ప్రజలకందరికీ రెండుపూటలా తిండి, వంటిమీద బట్ట, తలదాచుకునేందుకు ఇల్లు, ఆరోగ్యం, అక్షర జ్ఞానం ఉండాలి. ఇవి కనీస మానవ హక్కులు. ఈ హక్కులను కాపాడడం, అమలులోకి వచ్చేలా చూడడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజలు ఆ ప్రభుత్వాలకు అధికారమిచ్చింది తమ హక్కులను కాపాడతారనే నమ్మకంతోనే. కాని ప్రభుత్వాలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. అధికారం ఇచ్చినది మనం. పన్నులు కట్టేది మనం. ప్రభుత్వం ఖర్చు చేసేది మన డబ్బు. కాని... ‘నేను ఇచ్చిన బియ్యం తిన్నారు నాకే ఓటెయ్యండి!’, ‘నా డబ్బుతో వేసిన రోడ్డు మీద నడుస్తున్నారు నాకే ఓటెయ్యండి!’ అంటారొక ‘పెద్ద’మనిషి. మనుషులకు తిండి పెట్టలేరు. పశువులకు మేత వెయ్యలేరు. పిల్లలకు ఆక్సిజన్ అందించలేరు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అమ్మేస్తుంటారు. ఏదీ చాతకాని వీరు ‘మాదే చేతనైన ప్రభుత్వం’ అని డబ్బా కొట్టుకుంటారు. ‘డబ్బుకి నేను సారా అమ్ముతున్నాను. డబ్బుకి సదివిన సదువంతా నువ్వమ్ముతున్నావు. డబ్బుకి పోలీసోళ్ళు నాయ్యేన్నమ్ము తున్నారు... అమ్మకం! అమ్మకం! అమ్మకం! అమ్మకం తప్ప మరేట్నేదీ లోకంలో’ అంటూ ‘ఆరు సారా కథలు’లోని ‘మాయ’ కథలో ముత్యాలమ్మ చెప్పే మాటల్లో ఎవరూ కాదనలేని చేదు నిజాలున్నాయి. చేపను చేప మింగేసే ఆటలో గడుసుతనాల మీద రావిశాస్త్రి వెటకారపు బాణాలివి. ఇదంతా నమ్మకం వెనుక జరిగే అమ్మకం.

ఏ సంబంధంలోనైన నమ్మకం చాలా అవసరం. తన బిడ్డ తల్లికి నిజం, తండ్రికి నమ్మకం. నమ్మకం లేని బంధాలు అనుబంధాలు నీటి మీద రాతల్లాంటివే. ప్రతి మనిషి జీవితం నమ్మకంతోనే ముడిపడి ఉంటుంది. నమ్మకం లేనిదే ఒక్క అడుగూ ముందుకు వేయలేం. నమ్మకం వుంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చు. కాబట్టే నెపోలియన్ అసాధ్యం అనే పదాన్ని డిక్షనరీలోంచి తీసివేయాలన్నాడు. మనం చేసే పనిపై నమ్మకం వుంటే అసాధ్యం అనేది ప్రపంచంలోనే లేదు. ప్రతీదీ సాధ్యమే. అలాగే... ఎదుటి వారి నమ్మకాన్ని పొందడమూ ముఖ్యమే. ఒక్కసారి నమ్మకం కోల్పోతే మళ్లీ పొందలేం. అందుకే ఎదుటివారి నమ్మకాన్నెప్పుడూ వమ్ము చేయకూడదు. ముఖ్యంగా నేటి రాజకీయాల్లో నమ్మకానికి తావులేకుండా పోయింది. మరీ గట్టిగా మాట్లాడితే... నమ్మినవారిని కాకపోతే ఇంకెవరిని మోసం చేస్తాం అని కూడా అంటారు. అందుకే అంటాడు అబ్రహం లింకన్... ‘నువ్వు అందరినీ కొంతకాలం, కొంతమందిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. కాని అందరినీ ఎల్లకాలం మోసం చేయజాలవు’ అని. ఏ నాయకుడైన నమ్మికతో ప్రజల మనసులను గెలుచుకోవాలే తప్ప... కుయుక్తులతో ఓట్లను పొందడానికి మాత్రమే పరిమితం కారాదు. నమ్మకాన్ని కోల్పోయిన వారికి బుద్ధి చెప్పేందుకు రేపనేది కూడా వుంటుందని మర్చిపోకూడదు.

మహనీయుల మాట



పరిపూర్ణత అనేది ఆచరణ నుంచి మాత్రమే వస్తుంది.

- ముల్క్‌రాజ్ ఆనంద్

క్రీనీడల్లోనే క్రీడలు

సందర్భం

బెందాళం క్రిష్ణారావు

‘క్రీడాస్ఫూర్తిని విశ్వ వ్యాప్తం చేస్తామని, క్రీడాభివృద్ధే లక్ష్యమని, కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని....’ చెప్తున్న నేతల కబుర్లు ఎన్నో ఏళ్ళ నుంచీ వింటూనే ఉన్నాం. వాస్తవానికి దేశంలోనూ రాష్ట్రంలోనూ క్రీడల్లో ప్రగతి సాధిస్తున్నామా? అని ఈ ‘జాతీయ క్రీడా దినోత్సవం’ సందర్భంగా ఒకసారి స్వీయ విమర్శ చేసుకుందాం. ఒకప్పుడు బెర్లిన్ ఒలింపిక్స్‌లో నాజీ నియంత హిట్లర్‌ని సైతం తన అనన్య సామర్థ్యంతో ఆశ్చర్యచకితుడిని చేసిన భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజునే ‘జాతీయ క్రీడా దినోత్సవా’న్ని నిర్వహిస్తున్నారు. కానీ దేశంలో క్రీడా ప్రతిభ క్రమేపీ కొడిగడుతోంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో 83 మంది అథ్లెట్ల బృందంతో పాల్గొన్న భారతజట్టు పేరుకు ఆరు పతకాలు సాధించినా, పతకాల పట్టికలో 55వ స్థానంలో నిలిచింది. ఇక 2016 రియో ఒలింపిక్స్‌లో 118 మంది సభ్యుల భారీ బృందంతో బరిలోకి దిగి కేవలం రెండు పతకాలతో పరువు దక్కించుకొంది. పతకాల పట్టిక 66వ స్థానానికి దిగజారిపోయింది. మన దేశంలో ఓ జిల్లా జనాభా సైతం లేని కొసావో, ఫిజీ, ఉక్రెయిన్, న్యూజిలాండ్, జపాన్, కొరియాలాంటి చిన్న చిన్న దేశాలు ఓవైపు బంగారు పతకాల మోత మోగిస్తుంటే, మనకి మాత్రం మొదటి యాభై దేశాల జాబితాలో కూడా చోటు వుండటం లేదు.



అంతకు ముందు ఒలింపిక్స్ చరిత్రలోనే మనకు అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు అందించిన ఒకే ఒక్క క్రీడ హాకీ. అందులో మూడు బంగారు పతకాలు సాధించిన రికార్డు డ్రిబ్లింగ్ యోధుడు ధ్యాన్ చంద్‌కు మాత్రమే ఉంది. 1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్, 1932 లాస్‌ఏంజిల్స్, 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లలో భారత్ వరుసగా మూడు బంగారు పతకాలు గెలుచుకోవడంలో ధ్యాన్‌చంద్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ రికార్డును ఇంత వరకు ఎవరూ అధిగమించలేదు. వాస్తవానికి ప్రస్తుతం భారత్ ఒలింపిక్స్‌లో తగిన స్థానాన్ని పొందలేక పోవడానికి కీలకమైన రాజకీయ ప్రతిబంధకాలతో పాటు అనేక అంశాలను కారణంగా చెప్పుకోవచ్చు. పేరుకే జాతీయ క్రీడ హాకీ, కానీ అనధికార జాతీయ క్రీడ క్రికెట్. గ్లోబల్‌గేమ్ టెన్నిస్ నుంచి దేశవాళీ కబడ్డీ వంటి క్రీడల వరకూ క్రీడారంగాన్ని రాజకీయవేత్తలు, బిజినెస్ మాగ్నెట్లు, బ్యూరోక్రాట్లు కబ్జా చేసి శాసిస్తున్నారు.

దేశంలో క్రీడారంగ వైఫల్యాలు ఎప్పటికప్పుడు బయటపడుతున్నా వాటిపై సమీక్ష జరిపి అందుకు కారణమైన వారిపై సరైన చర్యలు తీసుకునే పరిస్థితి లేనే లేదు. రియో ఒలింపిక్స్‌లో కేవలం రెండు పతకాలు మాత్రమే దక్కినప్పటికీ ప్రభుత్వం, మీడియా చేసిన హడావిడిలోనే ఈ విషయం బయటపడింది. వైఫల్యాలకు ఎవరినీ బాధ్యులను చేయనివ్వకుండా సాధించిన పరిమిత విజయాలే ప్రపంచ స్థాయి విజయాలన్నట్లు ప్రచారం చేసుకున్నారు. రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని తృటిలో చేజార్చుకున్న జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ సరైన ఆదరణ లేని కారణంగా ఎన్నో కష్టాలు పడింది. అందుకే ఆమె కోచ్, బిశ్వేశ్వర్ నంది అధికారుల తీరుపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ‘పతకాలు సాధించిన తర్వాత కోట్లకు కోట్లు కుమ్మరించడం కంటే, మేజర్ టోర్నీలకు వెళ్లే ముందే క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం ఇవ్వడం మంచిద’ని భారత హాకీ మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీ సైతం వ్యాఖ్యానించారు. దీనిపై నంది స్పందిస్తూ, ‘ఇది భారత దేశం. ఇక్కడ ఎవరికీ ముందస్తు ప్రోత్సాహం దొరకదు. సౌకర్యాలు లభించవు. కోట్లకు కోట్ల డబ్బు, సన్మానాలు, సత్కారాలు లభించాలంటే అంతర్జాతీయ వేదికలపై ఏదో ఒకటి సాధించాలి. లేకపోతే గుర్తింపు ఉండదు’ అన్నారు. వీరి మాటలు భారత క్రీడారంగ దుస్థితిని కళ్ల ముందు ఆవిష్కరిస్తున్నాయి.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులకు ఇచ్చే అర్జున, రాజీవ్ ఖేల్ రత్న లాంటి అవార్డుల ఎంపికలోనూ ఎప్పటికప్పుడు వివాదాలు చోటుచేసుకొంటూ విమర్శలకు తావిస్తున్నాయి. బాక్సర్ మేరీ కోమ్, అథ్లెట్ కృష్ణ పూనియా లాంటి మహిళలు క్రీడా పురస్కారాల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపించిన వెయిట్ లిఫ్టర్ పూజారి శైలజ వంటి క్రీడాకారులు తమకు ప్రోత్సాహం కల్పించండంటూ ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించేందుకు పాఠశాలల్లో తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్న నేతల హామీలు ఎక్కడా అమలు కావడం లేదు. కార్పొరేట్ విద్యాసంస్థల విజృంభణతో చదువులు తప్ప ఆటలు అనేవి లేకుండా పోయాయి. ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా ఎలాంటి క్రీడా స్థలాలు లేకపోయినా, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహణకు అనుమతులు ఇచ్చేసి, ఆదిలోనే క్రీడా రంగాన్ని దెబ్బతీస్తోంది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోనూ క్రీడా సామగ్రి కొనుగోలుకు ఒక్క పైసా కూడా అధికారులు కేటాయించడం లేదు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక పీరియడ్ క్రీడల కోసం కేటాయించాలని 2012లో జీవో 63 విడుదల చేసినా, అదీ అమలు కావడం లేదు. పాఠశాలల్లో పీఈటీలు, పీడీల కొరతపై సర్కారు దృష్టి పెట్టడం లేదు. దీంతో విద్యార్థులు క్రీడాంశాలపై దృష్టి సారించలేకపోతున్నారు. ఎంతో ఉత్సుకతతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు కనీస గుర్తింపు లేకుండా పోతోంది. అన్ని పాఠశాలల్లోనూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్‌తో పాటు ఇండోర్ గేమ్స్ క్యారమ్స్, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్నా తగిన వసతులు లేవు. ఒక్కో స్కూల్లో ఒక్కో క్రీడకు క్రీడా సామగ్రిని కొనుగోలు చేయాలంటే ఏటా కనీసం రూ. 15 వేలు నుంచి రూ. 25 వేలు వరకు ఖర్చు అవుతుంది. ఇంత మొత్తాన్ని అటు క్రీడా ఉపాధ్యాయులు గానీ, ఇటు విద్యార్థులు గానీ సొంతంగా భరించలేకపోతున్నారు. దీంతో నామ మాత్రంగా ఎలాంటి ఖర్చు లేని ఖోఖో, కబడ్డీలాంటి క్రీడలనే అడపాదడపా ఆడిస్తూ చేతులెత్తేస్తున్నారు.. పొరుగున వున్న చైనాను చూసైనా మన వాళ్ళు నేర్చుకోవడం లేదు. అక్కడ పసితనం నుంచే చిన్నారుల్లో వున్న ప్రతిభను గుర్తించి ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తుంది. ఈ విధంగా మన దేశంలో పాఠశాల స్థాయి నుంచే క్రీడావిద్య అమలు జరగడం లేదు. దీంతో ఎంతోమంది మట్టిలో మాణిక్యాలు కనుమరుగవుతున్నారు. ప్రతిభ ఉన్నా గుర్తింపు లేకుండాపోతోంది. ఇప్పటికైనా రాజకీయ పెత్తనాన్నుంచి క్రీడారంగాన్ని విముక్తి చేయాలి. అంతేకాదు, క్రీడాభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

(ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం)

మతం.. మూర్ఖత్వం .. రాజకీయం..

ఈదర శ్రీనివాసరెడ్డి



విశ్లేషణ

మూడు రాష్ట్రాల్లో ఆగని హింసాత్మక సంఘటనలు, 36 మంది పౌరుల మరణం, 250 మందికి పైగా తీవ్ర గాయాలు, మూడు రైల్వేస్టేషన్లు, ఒక ఎక్స్‌ప్రెస్ రైలు, ఒక విద్యుత్ సబ్‌స్టేషన్, ఆదాయపు పన్ను శాఖ భవనం, పలు ప్రభుత్వ భవనాలు, 70 వాహనాలు, మీడియా వాహనాల దహనం, ఇవన్నీ ఏ సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నప్పుడో, లేక మత ఘర్షణలు ఏర్పడినప్పుడో జరిగిన సంఘటనలు కావు. కేవలం ఒక మత గురువు ఇద్దరు మహిళలపై చేసిన లైంగిక దాడికి న్యాయస్థానం శిక్షార్హుడిగా నిర్ణయించటం వల్ల అతని అనుచరులు సృష్టించిన మరణకాండ. న్యాయస్థానం భవిష్యత్తులో అతనికి శిక్ష విధించవచ్చు. అప్పుడు ఇంకెంత హింస చెలరేగుతుందో తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది.

ఏనాడు కనీవినీ ఎరుగని ఇంతటి హింస చెలరేగటానికి కారణం మతాన్ని మతంగా చూడకుండా, మూర్ఖంగా ఆలోచించే మన అమాయకత్వమా? మతాన్ని రాజకీయ అవసరాల కోసం వాడుకునే ఇటువంటి గోముఖ వ్యాఘ్రాల్లాంటి మత గురువులను పెంచి పోషించే మన రాజకీయ నాయకులా? నేరం జరిగినప్పుడు సకాలంలో స్పందించకుండా ఏళ్ల తరబడి విచారణను సాగిస్తూ కాలం గడిపే న్యాయస్థానాలా? సమాజంలో వివక్షను తట్టుకోలేక, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి తాము కూర్చున్న కొమ్మనే నరుక్కునే అమాయక ప్రజలున్నంత వరకూ మన దేశంలో ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతూనే వుంటాయి.

కోరికలు తీర్చుకునే శక్తి లేక దేవుడ్ని ఆశ్రయిస్తున్నారు ఎక్కువ మంది. వీరు మానసికంగా బలహీనులు. వీరిని లోబరుచుకోవటానికి, తాత్కాలికంగా ఉపశమనం కల్పిస్తూ చేరదీస్తారు మత గురువులు. ఈ మత గురువుల మాయ మాటలు విని, తమ భవిష్యత్తు బంగారు మయం అవుతుందని గుడ్డిగా అనుసరిస్తున్నారు ఎక్కువ మంది మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలు. సమాజంలోని వివక్ష కూడా ఈ కుహనా మత గురువుల వైపు ఆకర్షితులవటానికి ఒక కారణం. మన దేశంలోని దళితులు, నిమ్న వర్గాల వారు, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రభుత్వాధినేతలు ఈ అపోహలను తొలగించడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయకపోగా, వారి పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీని వల్లే గోధ్రా, పంచకుల వంటి సంఘటనలు ఈ దేశంలో పునరావృతమవుతూనే వుంటాయి. సామాన్యులు ఈ సంఘటనలకు బలి అవుతూనే వుంటారు.

రామ్ రహీం బాబా పంజాబులోని ఒక వర్గానికి చెందిన వారికి మత గురువు. పంజాబులోని సిర్సాలో ‘డేరా సచ్ఛా సౌదా’ అనే ఆశ్రమాన్ని స్థాపించి తన కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఇతన్ని మత గురువు అనే కంటే ... మతాన్ని అడ్డుపెట్టుకుని వ్యాపారం సాగించే ‘బేహారీ’ అని చెప్పవచ్చు. మన దేశంలో ఇటువంటి యోగా, మత గురువుల ఆస్తులను చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. వీరి ఆస్తులపై ఆదాయపు పన్ను శాఖలు కాని, అవినీతి నిరోధక శాఖలు కాని ఏనాడూ చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడవు. ఎందుకంటే పలు సార్వత్రిక ఎన్నికల్లో ప్రముఖ పార్టీల నాయకులకు ఆర్థిక సహాయం చేసేది వీరే కాబట్టి. 2014 ఎన్నికల్లో అధికార బిజెపి నాయకులకు ‘డేరా బాబా’ నుంచి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందినట్లు సాక్ష్యాలు కూడా ఉన్నాయి. అందువల్లే ఈ డేరా బాబా మతం ముసుగులో చేస్తున్న అరాచకాలను హర్యానా ప్రభుత్వం చూసీ చూడనట్లు వదిలేసిందనే అపప్రథ కూడా వుంది. ఇంతటి మారణకాండ జరిగినా ఈ డేరా బాబాను సమర్థిస్తోన్న కొంతమంది అధికార పక్ష పార్లమెంటరీ సభ్యులది మూర్ఖత్వం అనాలా? మతోన్మాదం అనాలా? లేక చట్టాల పట్ల తమకున్న నిర్లక్ష్య ధోరణి అనాలా?

బాబా అంటే సర్వసంగ పరిత్యాగి. కాని నేటి బాబాలు కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెడుతూ విమానాల్లో విదేశాలు పర్యటిస్తూ సర్వసుఖాలు అనుభవిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా డేరా బాబాకు 250 ఆశ్రమాలు వున్నాయి. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వేలాది ఎకరాల భూములు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, క్రికెట్ స్టేడియం, పలు కళాశాలలు, సొంత విమానం, ఇలా చెప్పుకుంటూ పోతే తరగని ఆస్తులు ఈ బాబా సొంతం. ఇంతటి భారీ ఆస్తులను ఎలా కూడబెడుతున్నాడని ప్రభుత్వాలు ఏనాడూ ఆలోచించిన పాపాన పోలేదు. మన రాష్ట్రంలో కూడా సత్యసాయి బాబా మరణించినప్పుడు వెలుగు చూసిన కోట్ల కొలది ఆస్తులు, వాటి చుట్టూ జరిగిన పరిణామాలు దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. నిజమైన బాబాలు ఏనాడు ఆస్తులు కూడ బెట్టరు. డేరా బాబాకు ప్రపంచ వ్యాప్తంగా ఆరు కోట్ల మందికి పైబడి అనుచరులు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం దళితులే. సమాజంలోని అసమానతలు, వివక్షతను తట్టుకోలేక కొంతమంది, సరైన ఉపాధి లేక కొంతమంది, సరైన చదువులేక అజ్ఞానంతో ఇంకొంత మంది బాబాను ఆశ్రయిస్తున్నారు. వీరి అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకుని మతం ముసుగులో సిర్సా లోని తన ఆశ్రమంలో ఎన్నో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా... ప్రభుత్వాలు కాని, ప్రతిపక్షాలు కాని ఏనాడు అటువైపు తొంగి చూసిన పాపాన పోలేదు. ఒకేసారి తన భక్తులు 400 మందిని హిజ్రాలుగా మార్చి సంచలనం సృష్టించినా ప్రభుత్వ యంత్రాంగం పట్టనట్టే వుండిపోయింది. 2002లో ఇదే ఆశ్రమంలో ఇద్దరు మహిళలపై లైంగిక దాడి జరిగిన విషయం బాధిత మహిళల లేఖ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ బాబా దురాగతాలు సైతం అప్పుడే బయటి ప్రపంచానికి తెలిశాయి. ఈ లేఖలు ప్రధాన మంత్రి వాజ్‌పేయి, పంజాబ్ న్యాయమూర్తికి అందినా సంఘటనపై విచారణకు ఆదేశించడానికి సంవత్సరం పట్టింది. ఈ లోపు ఈ లేఖను యథాతథంగా పత్రికల్లో ప్రచురించిన జర్నలిస్ట్ రాంచందర్ ఛత్రపతిని బాబా అనుచరులు హత్య చేశారు. సిబిఐ సాక్షులను విచారించి బాబాపై కేసు నమోదు చెయ్యటానికి ఐదేళ్లు పట్టింది (2008). 2014లో ఈ విషయంపై బాబాను విచారించగా తాను సన్యాసినని, సంసారానికి పనికిరానని హిజ్రాగా జీవితం గడుపుతున్నానని నమ్మబలికాడు. దీనికి బలం చేకూర్చటానికే 400 మందిని హిజ్రాలుగా మార్చాడు. నిజానికి బాబాకు భార్య, ముగ్గురు కుమారులున్నారు.



ఇదే ఆశ్రమంలో ఇద్దరు మహిళలపై లైంగిక దాడి జరిగిన విషయం బాధిత మహిళల లేఖ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ బాబా దురాగతాలు సైతం అప్పుడే బయటి ప్రపంచానికి తెలిశాయి. ఈ లేఖలు ప్రధాన మంత్రి వాజ్‌పేయి, పంజాబ్ న్యాయమూర్తికి అందినా సంఘటనపై విచారణకు ఆదేశించడానికి సంవత్సరం పట్టింది. ఈ విషయంపై బాబాను విచారించగా తాను సన్యాసినని, సంసారానికి పనికిరానని హిజ్రాగా జీవితం గడుపుతున్నానని నమ్మబలికాడు. దీనికి బలం చేకూర్చటానికే 400 మందిని హిజ్రాలుగా మార్చాడు. నిజానికి బాబాకు భార్య, ముగ్గురు కుమారులున్నారు.

ఒక నేరం జరిగితే... ఆ నేర విచారణకు పదిహేనేళ్లు పడితే ... మన న్యాయస్థానాలు ప్రజలకు ఏ సందేశం ఇవ్వనున్నాయి. ఇంతటి సుదీర్ఘ కాలంలో నేరస్తులు బలపడి చట్టాల నుంచి తప్పించుకోరా? ప్రభుత్వాలను, అమాయక ప్రజలను తన గుప్పిట్లో పెట్టుకున్న బాబా లాంటి వారి గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు. 2007లో ఈ కేసును విచారిస్తున్న డిఐజి స్థాయి అధికారి నారాయణన్‌పై అధికారికంగా, రాజకీయంగా ఎన్నో వత్తిళ్లు వచ్చినా లొంగకపోవడం... నేటికీ ఇంకా నిజాయితీ బతికే ఉందనటానికి నిదర్శనం.


కోర్టు బాబా విచారణ తేదీని ప్రకటించగానే, వారం రోజుల ముందుగానే అనుచరులు బాబాకు మద్దతుగా పంచకుల చేరుకోవటం మొదలు పెట్టారు. పంచకులలోని పార్కులు, వీధులన్నీ బాబా మద్దతుదారులతో నిండిపోతున్నా మంత్రులుకాని, ఎమ్మెల్యేలు కాని, ప్రతిపక్ష నేతలుగాని చోద్యం చూస్తున్నారు తప్ప పెదవి విప్పిన పాపాన పోలేదు. ఎందుకంటే వీరంతా ఏదో ఒక సందర్భంలో ఎన్నికలప్పుడు బాబా నుండి ఆర్థిక సహాయం పొందిన వారే 2014లో బి.జె.పి. ప్రభుత్వం అధికారంలోకి రాగానే హర్యానాలోని 19 మంది ఎమ్మెల్యేలు బాబాను సందర్శించి ఆశీస్సులు పొందిన వారే. దీనిని బట్టే మన దేశంలో మతం రాజకీయంతో ఎంతగా పెనవేసుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. 2014 నవంబరులో సంత్ రామ్‌పాల్‌ను కూడా ఇదే విధమైన కేసుల్లో కోర్టుకు హాజరు పరిచే క్రమంలో పద్నాలుగు రోజులపాటు అతని ఆశ్రమ భక్తులకు, పోలీసులకు పెద్ద యుద్ధమే జరిగింది. ఈ ఘటనల్లో ఆరుగురు అమాయక పౌరులు మరణించారు. అయినా కూడా మోహల్‌లాల్ ఖత్తర్ ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదు. 200 వాహనాల్లో మారణాయుధాలతో, పది మంది లాయర్లతో కోర్టుకు హాజరవుతుంటే హర్యానా ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప, తక్షణ రక్షణ చర్యలు చేపట్టినట్లు ఎక్కడా కాన రావు.

ఇకనైనా పాలకులు మేల్కొని మతాన్ని రాజకీయాల నుంచి వేరు చేయగలిగితే దళితులకు నిమ్న వర్గాల వారికి, మైనార్టీ ప్రజలకు ప్రభుత్వాలపై నమ్మకం ఏర్పడి మత గురువులవైపు ఆకర్షితులు కారు. చట్టాలు సైతం ఏళ్ల తరబడి తీర్పులను వాయిదా వేయకుండా, నేరం జరిగిన వెంటనే శిక్షలు అమలు జరిపితే సమాజంలో కొంతైనా న్యాయ స్థానాలపై నమ్మకం ఏర్పడుతుంది. ఏది ఏమైనా మన దేశ న్యాయస్థానాలు సామాజిక రుగ్మతులైన, మతం ముసుగులో జరిగే ట్రిపుల్ తలాక్, లైంగిక వేధింపులు లాంటి వాటిపై సమర శంఖం పూరించటం మంచి చర్యేనని చెప్పాలి.

(రచయిత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్)

స్త్రీ పునరుజ్జీవనానికి రాజ్యాంగమే గీటురాయి


డాక్టర్ కత్తి పద్మారావు



‘తలాక్’ ద్వారా ముస్లిం స్త్రీకి విడాకులు ఇవ్వడం ఖురాన్‌కు కూడా వ్యతిరేకమని సుప్రీం కోర్టు ఇచ్చిన సంచలనాత్మక తీర్పు భారత దేశంలో స్త్రీ విముక్తికి మరొక ముందడుగు అని చెప్పక తప్పదు. నిజానికి ప్రపంచంలో ఉన్న మతాలన్నీ పురుషాధిపత్యం కలిగినవే. మత గ్రంథాలన్నీ దాదాపు పురుషులు రాసినవే. మత గ్రంథా లన్నింట పురుష పెత్తనమే కొనసాగింది. ఈనాడు ‘తలాక్’ రద్దు కావటం మీద హిందువులు ఎంతో ఆనంద పడుతున్నా... హిందూ స్త్రీల విముక్తి గురించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సూత్రాలు నిర్దేశించి నప్పుడు మాత్రం వీరంతా ఉలిక్కిపడ్డారు.

మనువు స్త్రీని అస్పృశ్యురాలిగా చిత్రించాడు. చూశాడు. తరువాత సమాజంలో బానిస వ్యవస్థను రూపొందించ టానికి అస్పృశ్యతను సమాజంపై రుద్దాడు. కన్నతల్లినే అస్పృశ్యురాలిగా చూసిన పితృస్వామ్య వ్యవస్థ కర్కశ రూపాన్ని మనం అవగాహన చేసుకుంటే కాని హిందూ సమాజపు పునాదులు మనకు అవగతం కావు. పితృస్వామిక రూపం ద్వారా స్త్రీని బానిసను చేయటానికి, ఆమెను తన సొంతం చేసుకొని, ఆమె శక్తులన్నీ గుంజుకుని, తనవిగా హైజాక్ చేయటానికి పురుషుడు ఎంతగానో ప్రయత్నం చేశాడు. ఇస్లాం మతం, క్రైస్తవ మతం హిందూ భావజాలంలో నిండిపోయాయి. ఇస్లాం మతంలో హిందూ మత భావనలతో పాటు అభద్రతతో కూడిన అనేక మూఢ నమ్మకాలు ఉన్నాయి. ముస్లిం మత ఆచారాలు అంతర్గతంగా స్త్రీని అణచి వేస్తున్నాయి. క్రైస్తవ మతంలో అయితే కులం అలాగే ఉంది. మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులుగానే ఉన్నారు. ఇంకా ఒకే కులంలో అనేక మత శాఖల వలన శ్మశానాలు కూడా వేరుగా కట్టుకొంటున్నారు. స్త్రీ అణచివేత సైతం క్రైస్తవ మతంలో బలంగా ఉంది. 50, 60 వేల రూపాయల జీతం తెచ్చే మహిళ కూడా ఎటిఎం కార్డులను భర్త చేతుల్లోనే పెట్టాల్సి వస్తుంది. కట్నాలు, కానుకలు, స్త్రీ అణచివేత అన్నీ మామూలే. ఇస్లాం మతంలో తలాక్ విధానం ఒకటైతే బహు భార్యాత్వం కూడా పోవాల్సిన అవసరం ఉంది. చాలా మంది ముస్లిం స్త్రీలు ఇంగ్లీషు చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. వారికి ఆ అవకాశం కూడా కల్పించడం లేదు. ఇంకా అనేక ప్రాంతాల్లో బురఖా విధానాన్ని ఆచరిస్తున్నారు.

భారత రాజ్యాంగాన్ని సాంప్రదాయ హిందువులు చదవనట్టే ... ముస్లింలు, క్రైస్తవులు కూడా చదవడం లేదు. అందుకే వారు వారి కుల వ్యవస్థలోనే జీవిస్తున్నారు. కాని భారత రాజ్యాంగపరంగా జీవించలేక పోతున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అనుభవిస్తూ చర్చిలకు విపరీతంగా చందాలిస్తున్నారు. వీధికొక చర్చిని నిర్మించి, పిల్లలు చదువుకునే సమయాల్లో కూడా మైకులు హోరెత్తిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు తమ ప్రవక్తలు చెప్పినవాటిని వేటినీ ఆచరించటం లేదు. ఈనాడు తమ సేవ కోసం విద్య, వైద్య విస్తృతి కోసం ఇచ్చిన స్థలాలను క్రైస్తవ మిషనరీ కమిటీలు... ఫైవ్ స్టార్ హోటళ్ళకు, పేకాట క్లబ్బుల కోసం అమ్ముకుంటున్నారు. క్రైస్తవ మత పెద్దలు విందులు, వినోదాలు చేసుకొంటూ వ్యక్తిగత ఆస్తి పెంచుకుంటున్నారు. మైనార్టీల పేరుతో ముస్లింలు కాలేజీలు పెట్టి పెత్తందారీ కులాలకు, పాలక వర్గాలకు తాకట్టు పెడుతున్నారు. ఒక పక్క ఆరెస్సెస్ విశ్వ హిందూ పరిషత్ ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళ్తోంది. మరో పక్క వారిపై దాడులు చేస్తూనే క్రైస్తవులు, ముస్లింలతో చెలిమి చేస్తూ వారిని హిందూ భావజాలానికి లొంగదీయాలని ప్రయత్నిస్తోంది. అందుకు విశ్వ హిందూ పరిషత్ అంతర్గత సమావేశాలు నిర్వహిస్తోంది. నిజానికి భారత రాజ్యాంగ సూత్రాలకు వీళ్ళు లోబడి ఉండాలి. అటువంటి స్ఫూర్తి మనకు ఎక్కడా కనపడదు. ప్రపంచంలో ఉన్న శాస్త్రవేత్తల అధ్యయనాన్ని, శాస్త్ర జ్ఞానాన్ని వీరు నిరాకరిస్తారు. మూడు మతాలకూ హేతు దృక్పథం లేదు. పిల్లలు చదువుకునేటప్పుడు మైకులు పెట్టకూడదు, పెద్ద పెద్దగా అరవకూడదు అనే ప్రాథమిక సూత్రాన్నే క్రైస్తవులు పాటించటం లేదు. ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు తగ్గించడం కోసం మిషనరీలు అనేక ఆస్పత్రులు రూపొందించాయి. మరి ఇప్పుడు క్రైస్తవ బోధకులు ‘స్వస్తత కూటముల’ను పెడుతున్నారు. ప్రభువు దీవించిన నీళ్ళు ఇస్తే రోగాలు తగ్గుతాయని చెప్తున్నారు. మరెందుకు క్రైస్తవ మిషనరీలు పెద్ద పెద్ద హస్పటళ్ళు నిర్మించాయి? రాయవేలూరులో దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద వైద్యశాలను ఎందుకు నిర్మించారు? మీ విశ్వాసాలు మీరు ఉంచుకోవచ్చు. కానీ శాస్త్ర జ్ఞానానికి భిన్నమైన అంశాలను, మీ ప్రవక్తలు చెప్పినవాటికే విరుద్ధమైన అంశాలను మీరు ఎలా ప్రచారం చేసుకుంటారు కదా! కానీ ఒక మతం మీద ఒక మతం పోటీ పడి మరీ చేస్తున్న ఉత్సవాలు, కొలుపులు, ఊరేగింపులు, జాతరలు జనజీవనాన్ని సంక్షోభంలో ముంచెత్తుతున్నాయి. మరి ఇన్ని మతాల బోధకులు సుభోధలు చేస్తుంటే మద్యం ఇంకా ఎందుకు అమ్ముడవుతుంది? సిగరెట్లు ఎందుకు ఎక్కువగా తాగుతున్నారు? క్లబ్బులు ఎందుకు నడుస్తున్నాయి? ఈ మతాలు మనిషిలో నైతిక శక్తిని తేలేకపోతున్నాయా! అంటే మతం ఏర్పడింది నైతిక శక్తిని తేవటానికి కాదా! అందుకే మత మౌఢ్యానికి, శాస్త్ర జ్ఞానానికి ఎంతో వైరుధ్యం ఉంది. హిందూ మత పెద్దలు తమ మత భావాలు, మత మౌఢ్యాలు, మతోన్మాదం ప్రచారం చేసుకోవడం కోసం ఇతర మతాల్లో ఉన్న మూఢ భావాలను కూడా ప్రోత్సహిస్తున్నారు.



ఏ మతానికి స్త్రీని అణగదొక్కే హక్కు లేదు. రాజ్యాంగమే భారత దేశంలోని ప్రజలందరికీ గీటురాయి. రాజ్యాంగంలోని హక్కులకు లింగభేదం లేదు. ఇవాళ స్త్రీలలో వస్తున్న చైతన్యం అనేక సందర్భాల్లో మత భావాలకు లొంగిపోతోంది. అలా కాకుండా స్త్రీలు జ్ఞానవంతులై, విద్యావంతులై, చైతన్యవంతులై, రాజ్యాంగబద్ధులై ... తమ మీద జరుగుతున్న అణచివేతలను, తమ గురించి అవమానపరిచే రాతలను, భావజాలాలను ఎదుర్కోవడం కోసం ఈ సుప్రీం కోర్టు తీర్పు మరింత దోహదం చేస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రతి మతమూ కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన చారిత్రక అవసరం ఉంది. అంతేకాదు ఏ మతానికి స్త్రీని అణగదొక్కే హక్కు లేదు. రాజ్యాంగమే భారత దేశంలోని ప్రజలందరికీ గీటురాయి. రాజ్యాంగంలోని హక్కులకు లింగభేదం లేదు. ఇవాళ స్త్రీలలో వస్తున్న చైతన్యం అనేక సందర్భాల్లో మత భావాలకు లొంగిపోతోంది. అలా కాకుండా స్త్రీలు జ్ఞానవంతులై, విద్యావంతులై, చైతన్యవంతులై, రాజ్యాంగబద్ధులై ... తమ మీద జరుగుతున్న అణచివేతలను, తమ గురించి అవమానపరిచే రాతలను, భావజాలాలను ఎదుర్కోవడం కోసం ఈ సుప్రీం కోర్టు తీర్పు మరింత దోహదం చేస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. స్త్రీని అణగదొక్కే ఏ మతం వర్ధిల్లే అవకాశం లేదు. స్త్రీ నీకు తల్లి, చెల్లి, ఉపాధ్యాయిని. ఆమెను కుటుంబంలో ద్వితీయంగా చూడటం వల్ల కుటుంబానికి అభ్యున్నతి రాదు. అలాగే ఏ స్త్రీకైనా స్వేచ్ఛ ముఖ్యం. జీవితంలో, వివాహంలో, జీవన వర్తనలో స్వేచ్ఛను భారత రాజ్యాంగం ప్రసాదించింది. దాన్ని రక్షించుకోవడంలోనే స్త్రీల విజయం దాగుంది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని సమానత్వ భావనను అందరూ అర్థం చేసుకుని లౌకిక భావజాల నిర్మాణం కోసం లింగబేధం లేకుండా కృషి చేయాల్సిన సందర్భం ఇది. స్త్రీల చైతన్యం జ్ఞాన, సాంకేతిక, న్యాయ, తాత్విక అధ్యయనం నుండి సాగాలి.

(రచయిత సామాజికత తత్వవేత్త, నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు), 9849741695

కళగల కలంకారి





కాలానికి తగ్గట్టు మన అడుగులూ పడాలి. కొత్త కొత్త ఫ్యాషన్‌లకు మనం స్వాగతం చెప్పాల్సిందే. ఎక్కడా మన సంస్కృతి, సాంప్రదాయాలకు ఇబ్బంది కలగకుండా, చూసేవారికి ట్రెండ్ ఫాలో అవుతున్నట్లు అనిపించే కలంకారీ చీరలు ఎప్పడూ ప్రత్యేకమే. మంచి కలర్ కాంబినేషన్‌లో రంగురంగుల డిజైన్‌లలో రూపొందించిన ఈ చూడముచ్చటైన చీరలు మీరూ ట్రై చేయండి. కంటికి ఇంపుగా కనిపించే కలంకారీ చీరలు ధరిస్తే నిజంగా మీరే సెంట్రాఫ్ ఎట్రాక్షన్.







ఇలా.. ఉందాం ఆరోగ్యంగా!

పెళ్ళిళ్ళ సీజన్, పండగలు మొదలయితే... విందు భోజనాలకు లెక్కే ఉండదు. అప్పటిదాకా ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకునేవారు కూడా తప్పని విందని మినహాయింపులు లేకుండా తినేస్తుంటారు. ఘుమఘుమలాడే వాసనలు, రుచులు మనసును లాగేస్తుంటాయి. అదనపు ఆహారానికి ప్రతిసారీ బ్రేక్ ఇచ్చుకోవడమూ ఒక్కోసారి కష్టమై పోతుంటుంది. శారీరక చురుకుదనంతో అదనపు కేలరీలను కరిగించేయవచ్చు. ఆహారంలో, జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. ఈ చిన్ని మార్పులు ఆరోగ్యంలో, రూపంలో పెద్ద మార్పులకు కారణమవుతాయి. ఇందుకోసం కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు.

- ప్రతిరోజూ ఉదయాన్నే ఓ గ్లాసు కూరగాయల రసాన్ని తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. క్యారెట్, ఉసిరి, ఇతర కూరగాయలు కలిపి తయారు చేసిన రసం తాగాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్, ఎంజైమ్స్ విషతుల్యాలను బయటకు నెట్టేస్తాయి.
- తలనొప్పి, జీర్ణసంబంధిత సమస్యలు, అలర్జీలు శరీరంలోని టాక్సిన్లకు సంకేతాలు. వార్ధక్య లక్షణాల్ని త్వరితంగా ఇచ్చే చక్కెరలు, ప్రాసెస్డ్ పదార్థాలు, రిఫైండ్ పదార్థాలు, వేపుళ్ల వంటివి తగ్గించాలి. ఒత్తిడిని నియంత్రించుకోవాలి. కుటుంబసభ్యులు, మిత్రులతో మంచి సంబంధ బాంధవ్యాలు అవసరం.
- వారంలో కనీసం ఐదురోజులైనా తప్పనిసరిగా



వ్యాయామాలు చేస్తుండాలి. 30-40 నిమిషాల నడక లేదా ఇతర వ్యాయామాలు తప్పనిసరి చేయాలి. ఏరోబిక్ ఎక్సర్‌సైజుల వల్ల జీర్ణప్రక్రియ, బాడీ మెటబాలిజం మెరుగవుతుంది.

- స్మోకింగ్ వంటి అలవాట్లకు స్వస్తి చెప్పాలి. సరైన ఆహారం, జీవనశైలిలో మార్పులు అవసరం. శారీరక బరువుకంటే ఆరోగ్యం అనేది చాలా ముఖ్యమని అర్థంచేసుకోవాలి. సరైన బరువుతో ఉండడమనేది ఎటువంటివారికైనా అవసరమే.



మీ కోసం

క్యారెట్ పేస్టుని ముఖానికి రాసుకుని గంట తర్వాత కడిగితే మొహం నిగనిగలాడుతుంది.

జీవన సౌరభం

ఇతరులతో అనుబంధం చెడిపోకూడదు అనుకుంటే ఎలాంటి ప్రవర్తన అయితే మనకు ఇష్టం ఉండదో అలాంటి ప్రవర్తన ఎదుటివారి పట్ల చూపకూడదు.

తినకపోతే మరింత బరువు

తిండి తగ్గిస్తే బరువు తగ్గుతాము కదా అనే ఉద్దేశం, పనిఒత్తిడి, అశ్రద్ధ ఇలా కారణం ఏదైతేనేం చాలామంది మహిళలు ఉదయం పూట తినాల్సిన అల్పాహారాన్ని మానేస్తుంటారు. అయితే ఇదంతా వారి శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలపై ప్రభావాన్ని చూపుతుంది. ఎందుకంటే రోజంతా ఎంత ఆహారం తీసుకున్నా ఉదయాన్నే తీసుకునే ఆహారం మరింత ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాదు, బరువు తగ్గేందుకు అప్పుడప్పుడు టిఫిన్లు మానేస్తే మంచిదే అనుకునేవారు ఆ తరువాత కాలంలో ఉదయం క్రమం తప్పకుండా టిఫిన్ చేసేవారికంటే అదనంగా బరువు పెరుగుతారని ఆరోగ్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

- సన్నగా తక్కువ బరువుతో ఉండటమే సరైన ఆరోగ్యమనే భ్రమలో ఉండవద్దని కూడా నిపుణులు అంటున్నారు. మానసికంగా ఒత్తిడిని అనుభవిస్తున్న వారు బ్రేక్‌ఫాస్ట్‌ని వదిలి వేయటం అసలు మంచిదికాదు. వీరు అల్పాహారం తీసుకోలేక పోయినా కనీసం ఒక పండుని అయినా తినటం మంచిది. దీనివలన ఆకలి, ఆరోగ్యం పెరుగుతాయి.
- పొద్దున్న ఏమీ తినకుండా స్కూలుకి వెళ్లే పిల్లలు చదువులో ఎక్కువ ప్రతిభని కనబర్చకపోవటం కూడా పరిశోధకులు గమనించారు. ఉదయం ఆహారం తీసుకోకపోవటం మెటబాలిజం రేటుని ప్రభావితం చేయడమే కాకుండా ఏకాగ్రతను తగ్గిస్తుంది.
- ఎంత హడావుడిలో ఉన్నా పిల్లలకు ఉదయం టిఫిను పెట్టకుండా స్కూలుకి పంపకూడదు. మొలకెత్తిన, ఉడికించిన గింజలు, ఉడికించిన గుడ్డు, ఇడ్లీ, ఉప్మా, చపాతీ ఇవే కాదు, పళ్లను కూడా ఉదయపు అల్పాహారంగా తీసుకోవచ్చు.
- పొద్దున్నే తృణధాన్యాలను అల్పాహారంగా తీసుకున్న మహిళలు ఇతర ఆహారాన్ని తీసుకున్న వారికంటే నాజూకుగా ఉన్నట్టు గమనించారు. ఈ ఆహారంలో కొవ్వు కేలరీలు తక్కువగా ఉండి, పీచు, ప్రొటీన్లు ఎక్కువశాతంలో ఉంటాయి. ఈ కారణంగా త్వరగా చక్కగా జీర్ణమవుతాయి. వీటితో పాటు పాలు తీసుకుంటే క్యాల్షియం లభించి అది శరీర బరువుని నియంత్రించడంలో సహాయం చేస్తుంది.




- ఇపుడు చాలా ఇళ్లల్లో ఉదయపు ఆహారంగా బ్రెడ్‌ని తీసుకుంటున్నారు. ప్లెయిన్ బ్రెడ్డే కాకుండా పలురకాల బ్రెడ్‌లు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. బ్రెడ్‌తో పాటు గుడ్డుని ఉడికించి, ఆమ్లెట్ వేసుకుని బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడం కూడా మంచి పద్ధతే. గుడ్డులో ఖనిజాలు, విటమిన్లు ఎక్కువగా ఉండి కొవ్వు తక్కువగా ఉంటుంది. గుడ్డులో ఉండే కొవ్వు ప్రధానంగా పచ్చసొనలోనే ఉంటుంది. ఇది 450 మిల్లీగ్రాముల వరకూ ఉంటుంది. సాధారణ కొలెస్ట్రాల్ ఉన్నవారు ప్రతిరోజు ఉదయం ఒక గుడ్డుని తినొచ్చు. అదే మధుమేహం ఉన్నవారైతే వారానికి రెండు గుడ్లు తీసుకోవచ్చు.

స్వీయ క్రమ-శిక్షణే ముఖ్యం

జీవితమనే పయనంలో గమ్యం చేరడానికి చేసే ప్రయత్నాల్లో గాయాలు కావడం, ఎదురు దెబ్బలు తినడం సహజమే. అలా అక్కడే ఆగిపోతే ఏ ప్రయోజనమూ ఉండదు. ఎలాంటి పరిస్థితినైనా ఎదురించి నిలబడాలంటే, ప్రతి ఉదయం సరికొత్త అవకాశాలనూ, ఆనందాలనూ అందిస్తుందని గ్రహించాలి. ప్రతి రోజూ ప్రత్యేకంగా గడపడానికి తగిన మానసిక పరిణతిని సాధించేలా చేయాలి. సమాజంలో కొన్ని తరాల నుంచి తిష్టవేసిన చాలా రకాల తప్పుడు భావాలు, దురలవాట్లు మనలో వెతికి చూస్తే చాలా ఉంటాయి. వీటిని మనసులోంచి ఏరిపారేస్తే తప్ప సమాజానికి వన్నె తేలేం. సామరస్యం సాధించాలంటే మన ధోరణిని తర్కించుకుంటూ స్వీయ క్రమశిక్షణని నేర్చుకుంటూ ఉండాలి. ఇది జీవిత లక్ష్యాన్ని సాధించడానికి తప్పకుండా పనికొస్తుంది. చదువుకునే సమయంలోనే కాదు, ఏదో ఉద్యోగం సంపాదించిన తర్వాత కూడా ఇది చాలా అవసరమే. ఇదే మీరు ఒంటరివారు కాదన్న భావనని మీ నుంచి తరిమేస్తుంది. జీవితం పట్ల విశాలమైన దృక్పథాన్ని, అవగాహననీ పెంపొందిస్తుంది. మీరు ఇంకా ఎదిగి ఉన్నత స్థానాలకు చేరిన తర్వాతా దీనినే ఆచరణలో పెట్టడం భావి తరాలకు మీరు అందించే ఆస్తి అవుతుంది. అప్పటికీ చిన్నపిల్లలు మిమ్మల్ని అనుకరిస్తారని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.

వాటిని అధిగమించి, ముందుకు సాగాలంటే తప్పనిసరిగా స్వీయ క్రమశిక్షణ చాలా అవసరం. ఇదే సెల్ఫ్ డిసిప్లెన్ కూడా. కొంతమంది అమ్మాయిలకు ఏదైనా సమస్య ఎదురైతే అంతులేని అలోచనల్లో మునిగిపోయి "అందరూ సుఖంగా ఉన్నారు. నాకు మాత్రమే ఈ కష్టం వచ్చిందని" మానసికంగా కుంగిపోతుంటారు. కానీ అది సరైన ఆలోచన కాదు. నదులు ఎక్కడెక్కడి నుంచో కొండలు, గుట్టలు మీదుగా పారుతుంటాయి. అది మనం ఆనందంగా తిలకిస్తాం. మరి అలాగే తమ జీవితం కూడా హెచ్చుతగ్గులెన్ని ఉన్నా, నిర్మలంగా సాగిపోవాలని కోరుకుంటాం. ఇలాంటి విషయాలను ఎంతమంది వారికి నచ్చచెప్పినా వినిపించుకోరు. కాబట్టి వారి మనసుకి వారే సర్దిచెప్పుకొనే విధంగా తగిన సూచనలివ్వాలి.



- సమత, విజయవాడ.

వేలిముద్రల అధ్యయనాన్ని ఏమంటారు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, గుంటూరు.
సెల్ : 9985288150

జ్ఞానేంద్రియాలు

చెవులు

వీటి అధ్యయనాన్ని **'ఓటాలజీ'** అంటారు.

✧ పుట్టుకతో చెవులు లేని జీవులు - పాములు

✧ మొట్టమొదటి వెలుపలి చెవులు కలిగిన జీవులు - క్షీరదాలు

చెవిలో మూడు పొరలు (భాగాలు) ఉంటాయి.

1. బాహ్యచెవి : ఇది మెత్తటి మృధులాస్థి అనే ఎముకతో నిర్మితమై ఉంటుంది.

2. మధ్యచెవి : దీనిలో మూడు ఎముకలు ఉంటాయి.

ఎ. మారియస్ (లేదా) కూటకం : ఇది (ఎం) ఆకారం/ సుత్తి ఆకారంలో ఉంటుంది.


బి. ఇంకస్/ దాగళి : ఇది ఐ ఆకారంలో ఉంటుంది.

సి. స్టెఫిన్/ కర్ణాంతరాస్తి : ఇది గుర్రపు నాడా ఆకృతి/ అంకవన్నె ఆకారంలో ఉంటుంది.

✧ మానవుని శరీరంలోని అతిచిన్న ఎముక - స్టెఫిన్

✧ మానవుని చెవులలో ఎముకల సంఖ్య - 6 (3+3)

3. లోపలి చెవి : దీనిలో కర్ణభేరి ఉంటుంది. కర్ణభేరిలో కర్ణావర్ధనం అనే భాగం ఉంటుంది. దీనినే కో-క్లియా అని అంటారు.



✧ మానవుని చెవిలో శబ్దాన్ని గ్రహించే నిజమైన శ్రవణేంద్రియం - కర్ణావర్ధనం

✧ మానవుని చెవులు 1 నిమిషానికి 16 నుంచి 40,000 శబ్ద తరంగాలను గ్రహిస్తాయి.

✧ మానవుని చెవులు 20 హెజార్డ్ నుంచి 20,000 హెజార్డ్ పౌన్ణపున్యం గల శబ్దాన్ని గ్రహిస్తాయి.

✧ పెద్ద పెద్ద శబ్దాలు నేరుగా కపాలంలోని ఎముకల ద్వారా లోపలి చెవిని చేరుతాయి. దీనినే 'బోనీ కండెక్షన్' అంటారు.

నోట్ :

1. గబ్బిలాలు (బ్యాట్స్) అత్యధిక తరచుదనం గల (1 లక్ష హెజార్డ్) శబ్దాలను వింటాయి.

2. కుక్కలు 50 వేల హెజార్డ్ తరచుదనం గల శబ్దాలను వింటాయి.

చెవుల విధి : శరీరాన్ని సమతాస్థితిలో ఉచండానికి సహాయపడతాయి.

✧ శబ్దాన్ని గ్రహించడానికి సహాయపడతాయి.

నోట్ : చెవి, ముక్కు, గొంతు అధ్యయనం - ఓటోలారింగో రైనాలజీ

చర్మం

దీని అధ్యయనాన్ని **'డెర్మటాలజీ'** అంటారు.

✧ ఇది మానవుని శరీరంలోని అతిపెద్ద జ్ఞానేంద్రియం, అవయవం (నాలుగు కిలోలు)

✧ 70 కేజీల బరువుగల వ్యక్తిలో సుమారు 10.8 కేజీల బరువుగల చర్మం ఉంటుంది.

✧ ఇది 11/2 చదరపు కిలోమీటర్ల ఉపరితల వైశాల్యాన్ని కలిగి ఉంటుంది.

✧ అరచేతులు, అరికాళ్లలో చర్మం మందంగా ఉంటుంది. (1/2 సెంటీమీటర్లు)

✧ కనురెప్పలపై చర్మం పలచగా ఉంటుంది. (1/2 మిల్లీమీటర్లు)

✧ మానవుని శరీర ఉష్ణోగ్రత 370 సెంటీగ్రేడ్/ 98.40 ఫారెన్‌హీట్.

✧ వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 400 సెంటీగ్రేడ్/ 1040 - 1060 ఫారెన్‌హీట్ ఉంటుంది.

✧ వడదెబ్బ తగిలిన వ్యక్తిలో నీటిశాతం తగ్గిపోతుంది. కనుక చమట రాదు.


విధి : ఇది విసర్జన అంగంగా/ రక్షక పొరగా పనిచేస్తుంది.

చర్మానికి కలిగే వ్యాధులు

ఎ. ఫ్లైరైటిస్/ దురద : కలుషిత నీటిలో స్నానం చేయడం వల్ల కలుగుతుంది.

బి. పెల్లగ్రా : ఇది నియాసిన్ విటమిన్ లోపం వల్ల కలుగుతుంది. ఇది అంటువ్యాధి కాదు.

సి. గజ్జి/స్కేబిస్ : ఇది **'ఎకారస్'** అనే కీటకం వల్ల కలుగుతుంది.



✧ ఇది అంటువ్యాధి.

డి. తామర : ఇది శిలీంధ్రం వల్ల కలుగుతుంది.

✧ ఇది అంటువ్యాధి.

ఇ. సోరియాసిస్ : ఇది శిలీంధ్రం వల్ల కలుగుతుంది.

✧ ఇది అంటు వ్యాధికాదు.

✧ చర్మం పొలుసులుగా రాలిపోతుంది.

ఎఫ్. తట్టు : ఇది వైరస్ వల్ల కలుగుతుంది.

✧ ఇది అంటువ్యాధి.

జి. ఎక్సిమా : ఇది అతిసాధారణ చర్మవ్యాధి.

✧ విషవాయువులను పీల్చిన, కల్తీ ఆహారం తిన్నా ఈ వ్యాధి వస్తుంది.

✧ చర్మంపై ముదురు బూడిద రంగులో మచ్చలు వస్తాయి.

హెచ్. మొటిమలు (ఎక్ని) : ఇది బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది.

✧ మానవునిలో మొటిమలు కలిగించే బ్యాక్టీరియా - స్ట్రెప్టో కోకస్ అసియస్

చర్మం నిర్మాణం

మానవుని చర్మంలో ప్రధానంగా రెండు పొరలు ఉంటాయి.

ఎ. బాహ్యచర్మం

బి. అంత్ణచర్మం

ఎ. బాహ్యచర్మం : ఇది చర్మానికి వెలుపలి వైపున ఉండే పొర. ఈ పొరను తిరిగి రెండు పొరలుగా విభజించవచ్చు.

1. కార్నియస్ పొర

2. మాల్పిజియస్ పొర

1. కార్నియస్ పొర : ఇది బాహ్యచర్మంలోని వెలుపలి పొర.

✧ ఈ పొరలోని కణాలు నిర్జీవంగా ఉండి 'కెరాటిన్' అనే ప్రోటీన్‌ను స్రవిస్తాయి.

✧ ఈ ప్రోటీను కొమ్ములు, గిట్టలు, గోళ్లు, వెంట్రుకలలో ఉంటుంది.

✧ ఈ పొర అరిచేతులు, అరికాళ్లలో మందంగా ఉంటుంది.

2. **మాల్ఫీజియస్ పొర/ జననస్థరం :** ఈ పొర సజీవం.

✧ ఈ పొరలోని కణాలు కార్నియస్ పొరలోని కణాలను ఉత్పత్తి చేస్తాయి.

బి. అంతఃచర్మం : ఇది చర్మంలోని లోపలి పొర.

✧ దీనిలో కొవ్వు పదార్థాలు, రక్తనాళాలు, నాడీతంతు కణజాలాలుంటాయి.

✧ కొవ్వు పదార్థాలు **'ఎడిపోస్'** కణజాలంలో నిల్వ అవుతుంది.

✧ ఇది చర్మానికి సాగే గుణాన్ని, బలాన్ని చేకూరుస్తుంది.

✧ దీనిలోని ఎత్తుపల్లాల వల్లే వేలిముద్రలు ఏర్పడతాయి.

✧ వేలి ముద్రల అధ్యయనాన్ని **'డాక్టియాలజీ'**.

✧ అంత్ణచర్మంలో స్పర్శగ్రాహకాలు ఉంటాయి. ఇవి రెండు రకాలు.

1. పాసినియాన్ స్పర్శగ్రాహక కణాలు : ఇవి పీడనానికి సంబంధించిన కణాలు.

2. నాసీ సెప్టార్ కణాలు : ఇవి ఉష్ణం, స్పర్శ, రసాయనాలకు సంబంధించిన గ్రాహకాలను కలిగి ఉంటాయి.

✧ అంత్ణచర్మం నుంచి వెంట్రుకలు ఉత్పత్తి అవుతాయి.

✧ వెంట్రుకలు ఉత్పత్తి అయ్యే భాగాన్ని **'రోమపుటిక'** అంటారు.

✧ వెంట్రుకల గురించి చదివే శాస్త్రాని **'ట్రైకాలజీ'** అంటారు.

✧ అంత్ణచర్మంలో మూడు రకాల గ్రంథులు ఉంటాయి.

1. తైల గ్రంథి (లేదా) సెబేషియన్ గ్రంథి : ఇది **'సీబం'** అనే తెల్లని పదార్థాన్ని స్రవిస్తుంది.

✧ ఈ సీబం చర్మాన్ని ఎల్లప్పుడూ తేమగా ఉంచుతుంది.

✧ తైలగ్రంథి నాళంలో బ్యాక్టీరియా చేరినప్పుడు మొటిమలు (ఎక్ని) ఏర్పడుతుంది.

2. స్వేద గ్రంథి : ఇది చెమటను విసర్జిస్తుంది.

✧ ఈ చెమటలో నీరు **'కార్బన్ డై ఆక్సైడ్', 'యూరియా'**, కొవ్వులు, Nacl వంటి లవణాలుంటాయి.

✧ యూరియా ఉండటం వల్ల చెమట చెడువాసన కలిగి ఉంటుంది.

✧ శీతాకాలంలో చలికి రక్తనాళాలు కుంచించుకుపోతాయి. కావున చెమట తక్కువగా వస్తుంది.

✧ చెమట శరీర ఉష్ణోగ్రతను సమతాస్థితిలో ఉంచుతుంది.

✧ అరచేతులు, అరికాళ్లలో స్వేదగ్రంథులు అధికంగా ఉంటాయి.

✧ పెదాలపై స్వేదగ్రంథులు ఉంచడవు. (పక్షులు, కుక్కలు, ఏనుగులలో కూడా స్వేదగ్రంథులు ఉండవు).

✧ ఒంటెలో స్వేదగ్రంథులు క్రియారహితంగా ఉంటాయి.

నోట్ : ఏనుగు చెవులను ఆడించడం వల్ల, కుక్కలు నాలుకను బయటపెట్టడం వల్ల శరీర ఉష్ణోగ్రతను సమతాస్థితిలో ఉంచుకుంటాయి.

3. క్షీర గ్రంథులు : పాల ఉత్పత్తికి తోడ్పడుతుంది.

✧ ఉష్ణ మండలాలలో జీవించే వ్యక్తుల చర్మంలో **'మెలనోసైట్స్'** అధికంగా ఉంటాయి.

✧ శీతల మండలాలలో జీవించే వ్యక్తుల చర్మంలో **'మెలనోసైట్స్'** ఉండవు. కావున చర్మం తెలుపు రంగులో ఉంటుంది. వీరిని **'ఆల్బినోలు'** అంటారు. ఈ వ్యాధినే **'ఆల్బినిజం'** అంటారు. ఇది అనువంశిక వ్యాధి.

✧ చర్మంలో క్రమంగా మెలనిన్ అదృశ్యం అవ్వడం వల్ల **'విటిలిగో'** లేదా **'ల్యూకోడెర్మా'** అనే వ్యాధి కలుగుతుంది.

✧ సూర్య కిరణాల నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి మెలనిన్ చర్మాన్ని కాపాడతాయి.

✧ సూర్యరశ్మి వల్ల మెలనిన్ ఉత్పత్తి ఎక్కువై చర్మం గాఢమైన రంగుని సంతరించుకుంటుంది. దీనినే **'టానింగ్'** అంటారు.

✧ చర్మానికి రంగునిచ్చే పదార్థం - మెలనిన్

✧ చర్మం ద్వారా విసర్జించే పదార్థాలు - నీరు, లవణాలు, కొవ్వులు.

✧ చర్మంపై సూదులు గుచ్చి చేసే వైద్య చికిత్సను **'ఆక్యుపంక్చర్'** అంటారు.

✧ సాలీడు చర్మంతో కృత్రిమ చర్మాన్ని జర్మనీ శాస్త్రవేత్తలు రూపొందించారు.

✧ మానవ శరీరంలో ఈ కింది మూలకాలు ప్రధానంగా ఉంటాయి. అవి..65 శాతం ఆక్సిజన్, 18 శాతం కార్బన్, 10 శాతం హైడ్రోజన్, మూడు శాతం నైట్రోజన్, 1.5 శాతం క్యాల్షియం, ఒక్క శాతం ఫాస్పరస్ ఉంటాయి. ★

శరీరంలో గల వివిధ భాగాల బరువులు

భాగం		బరువు
చర్మం	-	4000 గ్రా॥ / 4 కేజీలు (లేదా) 10.88 కేజీ.
ఊపిరితిత్తులు	-	1090 గ్రా॥
గుండె	-	300 గ్రా॥ (లేదా) 315 గ్రా॥
కాలేయం (లివర్)	-	1500 గ్రా./1.5 కేజీ (లేదా) 1565 గ్రా॥
మూత్రపిండాలు	-	150-170 గ్రా॥
మెదడు	-	1350 గ్రా॥
క్లోమము	-	98 గ్రా॥
ప్లీహం	-	170 గ్రా॥

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆంధ్రప్రదేశ్ రెండోదశ భూసంస్కరణలు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి అనేక చట్టాల ద్వారా భూసంస్కరణలు అమలు చేశారు. మధ్య దళారీల రద్దు, కౌలు సంస్కరణలు, గరిష్ట భూపరిమితి చట్టాలు వంటి సంస్కరణలను అమలు చేసినప్పటికీ అనేక సమస్యలు ఉత్పన్నం కావడంతో భూసంస్కరణలను విస్తరించాల్సి వచ్చింది.

ఎవరికీ చెందని భూముల స్వాధీన చట్టం - 1974

కొన్ని భూములు, స్థిరాస్తులకు చట్టబద్ధంగా యజమాని లేని సందర్భంలో ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుని ఉపయోగించుకుంది. ఎవరికీ చెందని ఆస్తుల యాజమాన్యం, నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్‌నుగానీ, ఎవరైనా ప్రాంతీయ అధికారినిగానీ ప్రభుత్వం నియమించవచ్చు. ఈ అధికారి దృష్టికి వచ్చిన ఎవరికీ చెందని ఆస్తుల గురించి నిర్వహించి చేపట్టిన విచారణలో సదరు ఆస్తుని మరొక వ్యక్తి చట్ట విరుద్ధంగా స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నట్లు అయితే ఆస్తిని ప్రభుత్వానికి స్వాధీనం చేయాల్సిందిగా ఆ వ్యక్తిని ఆదేశించవచ్చు. ఒకవేళ దీనికి ఆ వ్యక్తి నిరాకరించిన స్థానిక సివిల్ న్యాయస్థానంలో ముందుగా రెవెన్యూ బోర్డు అనుమతితో దావా వేసి, న్యాయస్థానం తీర్పును అనుసరించి ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు.

భూములు యజమానిగా ఉంచి వారసులు ఎవ్వరూ లేనప్పుడు ఆ ఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. వీటిని ఎస్టేట్లు అంటారు. దీనికి సంబంధించి కలెక్టరు లేదా స్థానిక అధికారి స్వాధీనం చేసుకునే సందర్భంలో తప్పనిసరిగా దీనికి సంబంధించిన ఒక బహిరంగ ప్రకటన లేదా నోటీసు ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలి. సదరు నోటీసు వెలువరించిన మూడు నెలలలోపు ఆ ఆస్థికి సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను ప్రాంతీయ అధికారికి అందజేయాలి. ఆ ఆస్తులకు సంబంధించి ప్రకటన వెలువడిన మూడు నెలలలోపు ఎవరూ స్పందించకపోతే సదరు ఆస్తిని ఎవరికీ చెందని ఆస్తిగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజపత్రంలో ఒక నోటిఫికేషన్ వెలువడుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూముల స్వాధీన చట్టం - 1974 ఆస్తులకు సంబంధించి నిజమైన హక్కుదారులను గుర్తించడంతోపాటు మిగులు భూములను గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం కలిగించింది. ఈ చట్టం అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి చట్టబద్ధంగా స్థిర చరాస్తులు ఎక్కువగా లభించాయి.

పట్టణ భూమి గరిష్ట పరిమితి చట్టం - 1976

గ్రామీణ ప్రాంతాల్లో భూములపై గరిష్ట పరిమితి విధిస్తూ చట్టం చేసిన తర్వాత వాటి అమలు ప్రభావాన్ని గమనించిన ప్రభుత్వాలు పట్టణ ప్రాంతాలలో భూసమస్యను పరిష్కరించడానికి పూనుకుంది. అత్యధిక భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం చాలా మందికి గృహ నిర్మాణానికి, ఇంటి జాగా కూడా లేకపోవడంతో ప్రభుత్వం 1976లో పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టాన్ని తీసుకొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో భూమి కేంద్రీకరణ జరగకుండా గరిష్ట పరిమితి విధించడం ద్వారా మిగులు భమిని భూమిలేని పేదలకు పంచాలనే లక్ష్యంతో ఈ చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం

ఎ. ఎ-క్లాసు నగరాల్లో ప్రతి వ్యక్తీ 500 చదరపు మీటర్ల భూమిని కలిగివుండవచ్చు.

బి. బి-క్లాసు నగరాల్లో/పట్టనాల్లో ప్రతి వ్యక్తి 1000 చదరపు మీటర్ల భూమిని కలిగివుండవచ్చు.

సి. సి-క్లాసు నగరాల్లో/పట్టణాల్లో ప్రతివ్యక్తి 1500 చదరపు మీటర్ల భూమిని కలిగివుండవచ్చు.

డి. డి-క్లాసు నగరాల్లో/పట్టణాల్లో ప్రతివ్యక్తి 2000 చదరపు మీటర్ల భూమిని కలిగివుండవచ్చు.



ఈచట్టం ప్రకారం అర్బన్ ఎగ్లామిరేషన్ పరిధిలో ఏదైనా భూమి పూర్తిగా వ్యవసాయ భూమి అయితే ఈ చట్టం వర్తించదు.

పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం అమలులో పూర్తిస్థాయి విజయాలు సాధించిన సందర్భాలు తక్కువే అని పేర్కొనాలి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల పారిశ్రామీకరణ వేగం పెరగడం తదనుగుణంగా పెద్ద పెద్ద పరిశ్రమలు స్థాపనకు ఎక్కువ భూమి అవసరమవ్వడం వల్ల ఈ చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్ పెరగడంవల్ల 2007వ సంవత్సరంలో ఈ చట్టాన్ని రద్దు చేశారు.

ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూములు (బదలాయింపు నిషేధ) చట్టం 1977

భూమిలేని పేదలకు ప్రభుత్వ అధీనంలోని భూమిని గ్రామాలలో సాగుకు, ఇంటి స్థలాలకు ఇవ్వడానికి ఈ చట్టాన్ని రూపొందించారు. ప్రభుత్వం తనవద్ద ఉన్న భూమిని పేదలకు పంచడాన్ని అసైన్డ్ చేయడం అంటారు.

ఎ. అసైన్డ్ భూమిని ఇతరులు కొనకూడదు. బహుమతిగా తీసుకోకూడదు. కౌలుకు తీసుకోకూడదు. మార్పిడి చేసుకోకూడదు. తాకట్టు పెట్టుకోకూడదు.

బి. అసైన్డ్ భూములను వంశపారంపర్యంగా అనుభవించవచ్చు. అంతేతప్ప విక్రయించుకునే అధికారం లేదు.

అసైన్డ్ చేసిన భూముల విషయంలో ఈ చట్ట నిబంధనను అతిక్రమించినట్లయితే జిల్లా కలెక్టరుగానీ, ప్రత్యేక అధికారిగానీ సదరు భూమి ఎవరి స్వాధీనంలో ఉందో వారిని భూమి నుంచి బయటకు పంపి దానిని స్వాధీనం చేసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం-1977 భూమిలేని పేదలకు భద్రత కల్పించే విధంగా ఉంది. ప్రభుత్వం నుంచి పొందిన అసైన్డ్ భూములవల్ల భూమిలేని పేదలకు లబ్ధి చేకూరిందని పేర్కొనవచ్చు.

ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ (నిరోధక) చట్టం -1982

పట్టణ పారిశ్రామిక ప్రాంతాల్లో అంగబలం, అర్ధబలం, పలుకుబడి గలవారు ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూములను ప్రయివేటు వ్యక్తులకు చెందిన భూములను పెద్ద స్థాయిలో కబ్జా చేస్తూ ఉంటారు. దీనివల్ల సంబంధిత ఆస్తులకు నష్టం వాటిల్లడమే కాకుండా సామాజిక పరమైన శాంతి భద్రతల సమస్యగా రుపుదిద్దుకునే అవకాశం ఉంది.

కబ్జాదారులను గుర్తించి వారివద్ద నుంచి నష్టపరిహారాన్ని వసూలు చేయడమే కాకుండా కబ్జాను చట్ట వ్యతిరేక కార్యక్రమంగా గుర్తించి వారికి జైలు శిక్ష విధించే అకాశం ఈ చట్టం కల్పించింది.

ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం-1982 ఒక రకంగా పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం -1976 అమలును మరింత వేగవంతం చేసిందని చెప్పవచ్చు. అంతేకాకుండా పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులను కాపాడడంతోపాటు నిజమైన హక్కుదారులను గుర్తించడం ద్వారా వారికి తగిన న్యాయసహాయం చేయడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ★

ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ డెరైక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో 198 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ డెరైక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏపీ డీఎంఈ)లో 198 ఖాళీల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

పోస్టు పేరు : అసిస్టెంట్ ప్రొఫెసర్

మొత్తం ఖాళీలు : 198 (బ్యాక్‌లాగ్-178, రెగ్యులర్-20).

విభాగాలు : అనాటమీ, ఫిజియోలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యుజన్ మెడిసిన్.

వేతనం : రూ.15,600-రూ.39,100

అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఎండీ/ ఎంఎస్/ డీఎం/ ఎంసీహెచ్/ డీఎన్‌బీ/ ఎంఎస్సీ/ పీహెచ్‌డీ/ ఎండీఎస్/ డీఎస్సీ.

వయోపరిమితి : 2017 జులై 1 నాటికి ఓసీ-40 ఏళ్లు, ఎస్సీ/ ఎస్టీ/ బీసీ-45 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్ క్యాటగిరికి 50 ఏళు మించకూడదు.

ఎంపిక విధానం : అకడమిక్ విద్యార్హతలు, ఉద్యోగానుభవం ఆధారంగా...

దరఖాస్తు ఫీజు : రూ.1000 (ఓసీ/ బీసీ), రూ.500 (ఎస్సీ/ ఎస్టీ).

దరఖాస్తు విధానం : వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'ది డెరైక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్-ఏపీ, విజయవాడ' చిరునామాకు గడువులోగా చేరేలా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాలి. నేరుగా అయినా అందించవచ్చు.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : సెప్టెంబర్ 4, 2017

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : dme.ap.nic.in

గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో 150 ఖాళీలు

బెంగళూరులోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్‌ఈ)లో 150 అప్రెంటీస్ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఇది కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

పోస్టుల పేరు-ఖాళీలు : గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్-90, డిప్లొమా అప్రెంటీస్ ట్రైనీస్ -30, ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్-30.

విభాగాల వారీ ఖాళీలు : గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెకానికల్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్-35, ఏరో/ ఏరో-మెకానికల్-20, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకాట్రోనిక్స్-15, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ-15, మెటలర్జీ-3, సివిల్- 2, డిప్లొమా అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెకానికల్/ ప్రొడక్షన్/ టూల్/ డై డిజైన్-15, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్-10, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-3, మెటలర్జీ-2, ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెషినిస్ట్-4, ఫిట్టర్-4, టర్నర్-4, ఎలక్ట్రీషియన్-2, వెల్డర్-2, షీట్ మెటల్ వర్కర్-2, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా)-8, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్క్ మెయింటెనెన్స్-2, మెకానిక్ మోటార్ వెహికల్-2.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/ బీటెక్ లేదా తత్సమాన విద్యార్హత/ డిప్లొమా (ఇంజనీరింగ్/ టెక్నాలజీ)/ ఇంటర్మీడియెట్ + సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ (ఎన్‌సీవీటీ). అలాగే బీఈ/ బీటెక్/ డిప్లొమా అభ్యర్థులు www.mhrdnats.gov.in వెబ్‌సైట్ ద్వారా, ఐటీఐ **అభ్యర్థులు** ncvtmis.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్రెంటీస్‌షిప్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి.

వయో పరిమితి : 2017 సెప్టెంబర్ 1 నాటికి 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టులకు క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ మార్కులు, ఇంటర్వ్యూ, డిప్లొమా/ ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టులకు క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ మార్కులు, మెడికల్ ఫిట్‌నెస్.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా : ది డెరైక్టర్, గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు-560093, కర్ణాటక

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : సెప్టెంబర్ 5, 2017

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.drdo.gov.in

కాకినాడ కార్పొరేషన్ బరిలో వామపక్షాలు

- నాలుగు డివిజన్లలో పోటీ
- ఆకట్టుకున్న ప్రచారం



కాకినాడ 2వ డివిజన్ సిపిఎం అభ్యర్థి తిరుమలశెట్టి నాగేశ్వరరావు తరపున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా జరిగే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వామపక్షాలు తమ సత్తా చాటేందుకు బరిలో నిలిచాయి. కాకినాడలోని నాలుగు డివిజన్లలో సిపిఎం, సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇతర రాజకీయ పార్టీలకు ధీటుగా వామపక్ష అభ్యర్థులు పోటీలో నిలిచి తమ ప్రచారంతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. 2, 20 డివిజన్లలో సిపిఎం అభ్యర్థులు, 8, 9 డివిజన్లలో సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పది రోజులుగా వామపక్ష అభ్యర్థులు ఇతర పార్టీలకు, వామపక్ష పార్టీలకు ఉన్న తేడాను వివరిస్తూ చేసిన ప్రచారం ప్రజలను ఆకట్టుకుంది. ఉద్యమాలతో మమేకమైన అభ్యర్థులు రంగంలో ఉన్నందున వారి గెలుపు నగర అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుందని వివరిస్తూ నాయకులు చేసిన ప్రచారంపై చర్చ నడిచింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వామపక్ష అభ్యర్థుల తరుపున ప్రచారం చేశారు. వీరితోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జి, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధుల ఆధ్వర్యాన ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

2వ డివిజన్ నుంచి సిపిఎం అభ్యర్థిగా తిరుమలశెట్టి నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారు. ఆయన మాజీ సైనికుడు. దేశం పట్ల, ప్రజల పట్ల అంకిత భావంతో ఉండే నాగేశ్వరరావు పట్ల డివిజన్‌లో అందరూ గౌరవంతో మెలగుతారు. 27 సంవత్సరాల నుంచి డివిజన్‌లో ఉండడం, మాజీ సైనికుడుగా మంచి గుర్తింపుతోపాటు అందరితోనూ సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయనకు కలిసి వచ్చే అంశం. మాజీ ఎంపి తోట సుబ్బారావు, గతంలో మున్సిపల్ చైర్మన్లుగా పనిచేసిన జ్యోతుల సీతారామమూర్తి, బీరక చంద్రశేఖర్‌లతో ఉన్న పరిచయాలతో డివిజన్ అభివృద్ధికి కృషి చేసిన అనుభవం ఆయనది. డివిజన్‌లో సమస్యలను కరపత్రం ద్వారా ప్రజలకు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

20వ డివిజన్ నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీచేస్తున్న జిఎస్ఆర్ కృష్ణ కార్మిక సంఘంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. మెస్ వర్కర్‌గా పనిచేస్తూ సిఐటియులో చురుగ్గా పాల్గొంటున్నారు. కార్మిక సంఘంతో ఉన్న పరిచయాలు, తోటి కార్మికులు ఆయన విజయానికి కృషి చేస్తున్నారు. కొన్నేళ్ళుగా డివిజన్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారు. డివిజన్‌లోని అందరితో కలుపుగోలుగా ఉండడం, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు ఇళ్ల పట్టాలు, తాగునీరు, రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలపై నిత్యం పోరాడడం ఆయనకు లాభించనుంది. 8వ డివిజన్ నుండి సిపిఐ అభ్యర్థిగా తాటిపాక కమలకుమారి పోటీ చేస్తున్నారు. ఆమె సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు సతీమణి. ఆమె భర్తకు తోడుగా కార్మిక ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. సిపిఐ, ఎఐటియుసి తరుపున జరిగే ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటూ కార్మికవర్గ పోరాటానికి కృషి అందించడం, మహిళా సంఘంలో చురుగ్గా పాల్గొనడం ఆమెకు కలిసి వస్తుంది. తమ డివిజన్‌లో బిల్డింగ్ వర్కర్లు ఎక్కువగా ఉండడం, కొత్త కాకినాడలో శ్రామికులు ఎక్కువగా ఉండడం ఆమె విజయానికి దోహదపడనున్నాయి.

9వ డివిజన్ నుండి సిపిఐ అభ్యర్థిగా పెదిరెడ్డి సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా బాధ్యుడు కావడం ఆయనకు కలిసి వస్తుంది. కార్మిక నాయకుడుగా ఉద్యోగులతో ఉన్న పరిచయాలు ఉపయోగపడుతున్నాయి. ప్రజా ఉద్యమాల్లో, కార్మిక వర్గంలో ఆయన ఉద్యమాల నేపథ్యంలో విస్తృతమైన పరిచయాలు ఉన్నాయి. ఎఐటియుసిలో జిల్లా బాధ్యుడుగా ఉన్నారు. మున్సిపల్ కార్మిక సంఘానికి నాయకుడుగా వ్యవహరిస్తూ చేస్తున్న పోరాటాలతో ఆయనకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది.

9న హైదరాబాద్‌లో చేనేతల నిరసన

జిఎస్‌టి నుంచి మినహాయించాలని డిమాండ్

ప్రజాశక్తి – మంగళగిరి (గుంటూరు)

జిఎస్‌టి నుంచి చేనేతకు పూర్తిగా మినహాయింపునివ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిరసన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నిర్ణయించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో పోలా రామాంజనేయులు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశమై తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిఎస్‌టిపై 9న అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చేనేత రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టాలని నిర్ణయించామన్నారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జిఎస్‌టి పేరుతో ఏకపన్ను విధానాన్ని తెచ్చినా చేనేత రంగానికి బహుళ పన్ను అమలవుతోందని, నూలుపై 5 శాతం, రంగులపై 18 శాతం, కెమికల్స్‌పై 18 శాతం, తయారైన వస్త్రంపై 5 శాతం, కార్మికుల వేతనాలపై 5 శాతం, మొత్తం 51 శాతం పన్ను విధించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల చేనేత పరిశ్రమ సహకార రంగం, సహకారేతర రంగం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో సిల్క్ సబ్సిడీ కార్డుల సర్వే పేరుతో రద్దుచేయడం మానుకోవాలని, సిల్క్ సబ్సిడీ డబ్బు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2017–18 బడ్జెట్‌లో సిల్క్ సబ్సిడీకి కేటాయించిన రూ.30 కోట్లు ఒక్క నెలకే వస్తుందని తెలిపారు. సమావేశంలో చేతివృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.



విశాఖలో సిపిఎం నేత బొట్టా ఈశ్వరమ్మను అరెస్టు చేస్తున్న పోలీసులు

మహిళలను అరెస్టు చేసి వైన్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి– కంచరపాలెం, విశాఖ

జనావాసాల్లో వైన్‌షాపును ప్రారంభించొద్దంటూ వ్యతిరేకించిన సిపిఎం నేతలు, స్థానిక మహిళలపై పోలీసులు విరుచుకుపడ్డారు. విశాఖలో 45 రోజులుగా మహిళలు చేస్తున్న దీక్షను ఆదివారం భగ్నం చేశారు. సిపిఎం నాయకురాలు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మను అరెస్టు చేసి, ఉద్రిక్త పరిస్థితుల నడుమ వైన్‌షాపును తిరిగి ప్రారంభించి అమ్మకాలు కొనసాగించారు. జివిఎంసి 36వ వార్డు రవీంద్రనగర్ మెయిన్‌రోడ్డులో కనకదుర్గ వైన్‌షాపును తరలించాలని సిపిఎం నాయకులు, స్థానిక మహిళలు షాపు వద్దే టెంట్ వేసి ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం వారి ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులపై సిపిఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైన్‌షాపును తొలగించాలని హైకోర్టు స్టే ఆర్డర్ జారీ చేసిందనీ, రెండ్రోజులు గడువిస్తే స్టే ఆర్డర్‌ను తీసుకొస్తామనీ ఆమె అన్నారు. అప్పటివరకు వైన్‌షాపును ప్రారంభించడానికి వీల్లేదని డిమాండ్ చేశారు. అయినప్పటికీ స్థానికులను చెదరగొట్టి బొట్టా ఈశ్వరమ్మతో పాటు ఆందోళన చేస్తున్న స్థానిక మహిళ కమలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రయివేటు ఏజెన్సీలతో ఉద్యోగులకు తీవ్రనష్టం

మిర్చి యార్డు చైర్మన్ మన్నవ

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రయివేటు ఏజెన్సీల దోపిడీ వల్ల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం వాటిల్లుతోందని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ల ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటుపల్లి శేషగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రయివేటు ఏజెన్సీల అత్యాశ వల్ల అనేక మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. బినామీ పేర్లతో కొంత మంది పని చేస్తున్న క్రమంలో అర్హులను గుర్తించి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ప్రజాకర్ష సంక్షేమం కాదు

ఏపి బిసి సంఘాల జెఎసి చైర్మన్ అన్నా రామచంద్రయ్య

ప్రజాశక్తి – సత్యనారాయణపురం (విజయవాడ)

రిజర్వేషన్లు ఇవ్వటం అనేది ప్రజాకర్ష సంక్షేమ పథకం కాదని, రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన అంశమని ఎపి బిసి సంఘాల జెఎసి చైర్మన్ అన్నా రామచంద్రయ్య యాదవ్ అన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులకు బిసి రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాగ్దానం చేయటం మోసం చేయడమేనని అన్నారు. కాపులను బిసిల్లో చేర్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సంక్షోభంలో వ్యవసాయం

- రైతు సమస్యలపై నిరంతర పోరాటం
- బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ ప్రతినిధి

కేంద్రలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. రైతు పండించిన ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతోందన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ప్రొద్దుటూరులో సిపిఎం తూర్పుకృష్ణా డివిజన్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి పి.రంగరావు అధ్యక్షతన ప్రొద్దుటూరు సెంటర్‌లో ప్రదర్శన, బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ధరలు పతనమైన సందర్భంలో ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనే విధానానికి స్వస్తి పలికి మిర్చి క్వింటాకు రూ.1500 చెల్లించి చేతులు దులుపుకోవడం వంటి చర్యలు రైతాంగ వ్యతిరేక విధానాలకు అద్దం పడుతున్నాయన్నారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు, రైతు రుణమాఫీకి పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించాయన్నారు. డ్వాక్రా రుణమాఫీ, నిరుద్యోగభృతి విస్మరించారన్నారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, వి.కృష్ణయ్య, సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు తదితరులు పాల్గొన్నారు.

గొరిగెనూరులో ఆది, పిఆర్ వర్గీయుల దాడి



వాగ్వాదం చేసుకుంటున్న ఆది, పిఆర్ వర్గీయులు

ప్రజాశక్తి – జమ్మలమడుగు టౌన్

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గొరిగెనూరు గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా మంత్రి ఆదినారాయణరెడ్డి, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి వర్గీయుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. నిమజ్జనం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రామసుబ్బారెడ్డి వర్గీయులు విగ్రహాన్ని తీసుకుని వెళ్తుండగా విగ్రహాన్ని తీసుకుని తమ వీధి వెంట వెళ్లవద్దని గొరిగెనూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో జడ్‌పిటిసి సతీమణి రామసుబ్బారెడ్డి వర్గానికి చెందిన ఉప్పలూరు క్రిష్ణారెడ్డిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహంతో ఇరువర్గాలకు చెందిన వారు రాళ్లు విసురుకున్నారు. సంఘటనలో కొందరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అర్బన్ సిఐ ప్రవీన్‌కుమార్, ఎస్ఐలు హనుమంతు, మియా, రూరల్ సిఐ ఉమా మహేశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిచారు. ఉత్సవ విగ్రహాలు అల్లాడుపల్లి మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేశారు.

ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాలు

వ్యవసాయ శాఖ మంత్రి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి – కడపఅర్బన్

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటలకు వందశాతం సబ్సిడీతో విత్తనాలు, సూక్ష్మ పోషక పదార్థాలు రైతులకు పంపిణీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన నీరు–చెట్టు, చెక్‌డ్యాముల నిర్మాణం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయని తెలిపారు. వేరుశనగసాగుకు సమయం దాటి పోయినందున రైతులకు వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటలు సాగు విత్తనాలు, పోషక పదార్థాలు అందజేస్తామని తెలిపారు. దీని కోసం రూ.105 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. రైతులకు మూడవ విడత రుణమాఫీ కింద రూ.3,600 కోట్లు విడుదల చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సాయిప్రతాప్, గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, హరిప్రసాద్, పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను కబళించడానికే..



- స్వయం పోషక స్వతంత్ర పాఠశాల చట్టంపై పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి– అనకాపల్లి (విశాఖ)

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కబలించి కార్పొరేట్ సామ్రాజ్యానికి కట్టబెట్టేందుకే ప్రభుత్వం స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం–2017ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలుసుబ్రహ్మణ్యం విమర్శించారు. 'స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం 2017 ఎవరి కోసం? ఎందుకోసం' అనే అంశంపై విద్యా వికాస వేదిక ఆధ్వర్యాన అనకాపల్లిలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిక్కీ అనే సంస్థ ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను కబలించాలని, శాసించాలని చూస్తోందని, దానికి ప్రభుత్వం వంత పాడుతుందని విమర్శించారు. ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఒక ముసాయిదా చట్టం దర్శన మిస్తుందన్నారు. ఈ చట్టం విద్యను వ్యాపారంగా మార్చేందుకు ఉద్దేశించిందని చెప్పారు. ఈ చట్టం మూలంగా యజమానులు ఏడాదికి 12 శాతం ఫీజులు పెంచుకునే అవకాశముంటుందని, కార్పొరేట్ పాఠశాల లపై ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ ఉండదన్నారు. న్యాయ స్థానాలకతీతంగా కార్పొరేట్ పాఠశాలలు ఈ చట్టం వల్ల అజమాయిషీ చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం వస్తే చిన్న, మధ్యతరగతి ప్రయి వేటు స్కూళ్ల బతకలేని పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. విద్యావ్యవస్థంతా కార్పొరేట్ల హస్తగతమవుతుందన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి – అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా నంబులపూలకుంట మండలం మర్రికొమ్మదిన్నె పరిధిలోని ఎర్రవంకపల్లి ఎస్‌సి కాలనీలో శ్మశాన స్థలం ఆక్రమించి, దేవాలయాన్ని కూల్చి దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీవరత్నం, వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులపై దాడిని ఖండిస్తూ కెవిపిఎస్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రస్తాల్లో సైతం దళితులు వెళ్లకుండా అడ్డంగా గుంతలు తవ్వి ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడికి పాల్పడుతున్నారని అన్నారు. నెల రోజులుగా దళితుల శ్మశానాన్ని, దేవాలయాన్ని అధికారపార్టీ నాయకురాలు ఆక్రమించుకొని తొలగించడంతో కెవిపిఎస్‌గా తాము గ్రామాన్ని సందర్శించామని, నిరాహార దీక్షలను చేస్తున్నామన్నారు. 26న మండలంలోని దళిత ప్రజా సంఘాలు నిజనిర్ధారణ కమిటీగా గ్రామంలోకి వెళ్లి చూశారని, ఆక్రమణ వాస్తవమని తేలిందన్నారు. తహశీల్దార్ కూడా ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దళిత మహిళ లక్ష్మిదేవి, హరిజన గంగాద్రి, హరి, సుధాకర్‌లను గ్రామానికి చెందిన పెత్తందారులు దాడి చేశారన్నారు. దీంతో వారు అసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రాజా, సూరి, గోపాలస్వామి, వన్నూరుస్వామి, పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు పోరాడాల్సిందే

- డివైఎఫ్ఐ రాష్ట్ర సదస్సులో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, సాధించేవరకు యువత పోరాడాల్సిందే నని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. విభజన ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం పెరిగిందని, పరిశ్రమలు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.. డివైఎఫ్ఐ పశ్చిమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'విభజన చట్టం–ఉపాధి–ప్రత్యేక హోదా' అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఏటా లక్షల మంది చదువులు పూర్తి చేసుకొని బయటకొస్తున్నా, వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించలేకపోతోందన్నారు. పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతోనే అందరికీ ఉపాధి సాధ్యమవుతుందన్నారు. గాజువాక వద్ద స్టీల్ ప్లాంట్ రావడంతోనే రాష్ట్రంలో తలసరి ఆదాయంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రైల్వేజోన్, కపడ ఉక్కు పరిశ్రమ, శ్రీకాకుళం నుండి చెన్నైవరకు పారిశ్రామిక కారిడర్ వంటి అంశాలు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం షెడ్యూల్ 13 సెక్షన్‌లో ఉన్నాయన్నారు. వీటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఫలితంగానే నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రత్యేకహోదా పదేళ్ళు ఇస్తామని మోసం చేసిన వెంకయ్య నాయుడుకు యాత్రలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాల సాధనే లక్ష్యంగా పోరాడాలన్నారు.

హోదా ఇచ్చి ప్రజల మనోభాల్ని కాపాడాలి
డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే హోదాను ఇచ్చి ప్రజల మనోభావాల్ని కాపాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా పదేళ్ళు ఇస్తామన్న బిజెపి అధికారంలోచ్చాక 14వ ఆర్థికసంఘం, నీతిఅయోగ్ అంగీకరించడంలేదంటూ కుంటిసాకులు చెప్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల్ని బిజెపి మాయమాటలతో మోసం చేసిందని, దానికి టిడిపి కూడా తోడయ్యి ందని, అందువల్లే హోదా కోసం ఉద్యమాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కేంద్రమంత్రిమండలి ఎనిమిది రాష్ట్రాలకు హోదాను పునరుద్ధరించిందని, వాటికి లేని అడ్డంకులు రాష్ట్రానికెందుకొచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్ని భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో డివైఎఫ్ఐ సెంట్రల్, తూర్పు, పశ్చిమ సిటీ కార్యదర్శులు స్వామి,భార్గవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు కోటి తదితరులు పాల్గొన్నారు.


ప్రజ్ఞ

జవాబులు

1. హర్యానాలోని సిర్సా
2. సైనా నెహ్వాల్
3. లీ జే యాంగ్
4. 20.7 కోట్లు
5. హాల్(బెంగళూరు)

29,30 తేదీల్లో సిడబ్ల్యూఎఫ్ఐ జాతీయ కమిటీ సమావేశాలు

- భవన కార్మికుల సంక్షేమంపై సమీక్ష
- నేడు విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన పిల్లి నరసింహారావు



పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు నరసింహారావు, తదితర రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సిడబ్ల్యూఎఫ్ఐ) అఖిల భారత కమిటీ సమావేశాలు ఈ నెల 29,30 తేదీల్లో జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు విజయవాడలోని కృష్ణా జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఈ సమావేశాల్లో సమీక్షిస్తారని, వివిధ రాష్ట్రాల్లో అమలు చేయాల్సిన పథకాల సాధనం కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తారన్నారు. భవన నిర్మాణ రంగంలో రోజురోజుకూ యంత్రాల వినియోగం పెరిగి నిర్మాణ రంగ కార్మికుల పనిదినాలు తగ్గిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్మాణాల్లో తప్పని సరిగా కార్మికుల ద్వారానే పనులు చేయించాలనే డిమాండ్లపై చర్చిస్తామన్నారు. సిమెంట్, స్టీల్, కలప, రంగులు తదితరాలపై జిఎస్టీ పేరుతో పన్నులు పెంచడం వల్ల నిర్మాణ రంగానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. జీఎస్టీ అమలైనప్పట్నించి నిర్మాణాలు మందగించాయని, నిర్మాణదారులు పనులు చురుకుగా చేపట్టడం లేదని తెలిపారు. ఈ సమావేశాలకు ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సింగారవేలు, దేబంజన్ చక్రబర్తితో పాటు 29 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సోమవారం విజయవాడలోని హనుమంత రాయ గ్రంథాలయంలో రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అప్పారావు, పిల్లి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బిసిల రాజకీయ పార్టీ

కాపులను చేరిస్తే అన్యాయమే : ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసిల ఓట్లను ఉపయోగించుకుంటున్న రాజకీయ పార్టీలు బిసిల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని, ఈ క్రమంలో ఒక రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన చేస్తున్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీపై తమ సంఘంలోని వివిధ సామాజిక తరగతుల ప్రతినిధులతో, ఇతర మేధావులతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో బహిరంగ సభలను నిర్వహించనున్నామని చెప్పారు. కాపులను బిసిల్లో చేరిస్తే తమకు అన్యాయమే జరుగుతుందని, కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం సరికాదని అన్నారు. అగ్ర కులాల్లోని ఇతరులతోపాటు బాగానే అభివృద్ధి చెందిన కాపులకు రిజర్వేషన్ అవసరం లేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ శాతం పెంచినా కాపులే ఎక్కువగా ఫలాలను అనుభవిస్తారని, బిసిల్లో వర్గీకరణ, అన్ని కులాలకు సమాన ప్రాతినిథ్యాన్ని తాము కోరుతున్నామని తెలిపారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, 13 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పళనికి ఉద్వాసన

సేలం కార్యదర్శిగా తొలగింపు

ప్రజాశక్తి - చెన్నయ్ ప్రతినిధి

తమిళ రాజకీయాలు క్షణానికో మలుపు తిరుగుతున్నాయి. ఎపుడు ఎవరికి పదవి వస్తుందో, ఎవరిది ఊడుతుందో తెలియని ఉత్కంఠ. అధికారపక్షం, ప్రధాన ప్రతిపక్షం, అన్నాడిఎంకె నుంచి చీలిన ఎంఎల్ఏల ఎత్తుకు పైఎత్తులతో ఆ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. పళనిస్వామి ముఖ్యమంత్రిగా మాకొద్దంటూ గవర్నర్‌కు లేఖలు అందించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ధనపాల్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో.. అన్నాడిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి టిటివి దినకరన్ దూకుడు పెంచారు. అన్నాడిఎంకె సేలం రూరల్ కార్యదర్శిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి పళనిస్వామిని ఆ బాధ్యత నుంచి తొలగించారు. ఆయన స్థానంలో నూతన కార్యదర్శిగా సెల్వంను నియమించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని తొలగించే అధికారం దినకరన్‌కు ఏముందని, ఆయన పార్టీ సభ్యుడే కాదంటూ సహచర ఎంఎల్ఏలు దినకరన్‌పై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం, చీలిన పక్షం పళని స్వామి బలనిరూపణ చేసుకోవాలని పట్టుబట్టడంతో ముఖ్యమంత్రి సోమవారం ఎంఎల్ఏలతో భేటీ కానున్నారు.

గవర్నర్‌పై వత్తిడి పెంచిన ప్రతిపక్షం

మైనార్టీలో పడిన పళనిస్వామి సర్కారు అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి బలనిరూపణ నిరూపించుకోవాలని డిఎంకె ఎంఎల్ఏలు, ఎంపిలు, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిశారు. మైనార్టీలో పడిన ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని, వెంటనే సిఎం పళనిస్వామి బలనిరూపణ చేసుకోవాలని డిఎంకె ఉప ప్రధాన ప్రతిపక్ష నేత దొరాయిమురుగన్ డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్‌గా స్పందిస్తూ బల నిరూపణ చేసుకోవాలని తక్షణమే సిఎంను ఆదేశించాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో అన్నాడిఎంకె ఎంపిలు కనిమొళి, కాంగ్రెస్ ప్రతిపక్ష నేత విజయధరణి, ఇండియన్ ముస్లిం లీగ్ ఎంఎల్ఏ అంబుబక్కర్ ఉన్నారు.

పశ్చిమబెంగాల్‌లో దారుణం

గోవుల్ని దొంగిలించారనే ఆరోపణతో ఇద్దరి హత్య

గ్రామస్తులే కొట్టి చంపినట్లు విచారణలో వెల్లడి

జల్పాయిగురి: పశ్చిమ బెంగాల్‌లో ఆదివారం వేకువజామున దారుణం చోటుచేసుకుంది. గోవుల్ని దొంగిలించి తరలిస్తున్నారనే అనుమానంతో ఇద్దరు వ్యక్తుల్ని గ్రామస్తులు కొట్టి చంపిన ఘటన జల్పాయిగురి జిల్లాలోని దాడన్ గ్రామంలో సంభవించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతులు అస్సాంకు చెందిన హఫిజుల్ షేక్, కూచ్‌బిహార్‌కు చెందిన అన్వర్ హుస్సేన్‌లుగా గుర్తించారు. అయితే వాళ్లు గోవుల్ని దొంగిలించారా? లేక కొనుగోలు చేసి తరలిస్తున్నారా అన్న విషయం ఇంకా తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. వాళ్లు వెల్లడించిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటిన అనంతరం గ్రామంలోకి ఓ వ్యాను ప్రవేశించింది. అయితే డ్రైవర్ దారి తప్పడంతో ఎటు వెళ్లాలో తెలీక అక్కడికక్కడే వాహనం చక్కర్లు కొట్టింది. దీన్ని గమనించిన గ్రామస్తులు వాహనాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అయితే డ్రైవర్ తప్పించుకోవడానికి వాహనాన్ని వేగవంతం చేయడంతో గ్రామస్తులు అన్ని వైపులా మార్గాల్ని మూసేశారు. దీంతో వాహనాన్ని అక్కడ వదిలేసి డ్రైవర్ పారిపోయాడు. అందులో ఏడు గోవులతో పాటు హఫిజుల్ షేక్, అన్వర్ హుస్సేన్‌లు ఉన్నారు. చుట్టుముట్టిన గ్రామస్తులు ఆ గోవులు ఎక్కడివి అంటూ అడిగిన ప్రశ్నకు వారు జవాబుఇవ్వకపోవడంతో అందరూ ఒక్కసారి దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అన్వర్, హఫిజుల్‌లను ఆసుపత్రికి తరలించగా..మార్గమధ్యంలోనే వారు చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మొదటిపేజీ తరువాయి

నేడు గుర్మీత్‌కు శిక్ష ఖరారు

తరలించే క్రమంలో అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా జైలునే న్యాయస్థానంగా మార్చి, సిబిఐ న్యాయమూర్తిని ప్రత్యేక విమానంలో రోహతక్‌కు తీసుకువచ్చి శిక్ష ఖరారు చేయనున్నారు. కాగా డేరా ఆశ్రమ ప్రధాన కార్యాలయం ఉన్న సిర్సాలో కర్ఫ్యూ విధించారు. సిర్సాలోని గుర్మీత్ ఆశ్రమ ప్రధాన కార్యాలయం వద్ద కర్ఫ్యూ విధించారు. ఆ ఆశ్రమంలో దాదాపు 30 వేల మంది గుర్మీత్ అనుచరులు మకాం వేశారని పోలీసులు పేర్కొన్నారు. దాదాపు 28 కంపెనీలకు చెందిన పారా మిలటరీ బలగాలు రోహతక్‌లో బందోబస్తు నిర్వహిస్తున్నాయి. గుర్మీత్‌ను దోషిగా నిర్ణయించిన తరువాత జరిగిన హింసాత్మక సంఘటనలలో 36 మంది ప్రాణాలు కోల్పోగా, 250 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

జైలులో నిద్రలేకుండా..

గుర్మీత్ సింగ్‌కు జైలులో అతిధి మర్యాదలేమీ జరగలేదని అధికారులు తెలిపారు. గుర్మీత్ సింగ్‌ను శుక్రవారం సాయంత్రం జైలుకు తీసుకెళ్ళిన తరువాత నిబంధనల మేరకు నడుచుకున్నట్లు వివరించారు. తొలుత ఖైదీగా గుర్మీత్ వివరాలు నమోదు చేసి రాత్రి 8.30 గంటల సమయంలో ఆయనకు కేటాయించిన సెల్‌లోకి పంపినట్లు తెలిపారు. గుర్మీత్ మొదటి రోజు రాత్రి ఒక చపాతీ, గ్లాసు పాలు మాత్రమే తీసుకున్నారని, అధికారులు పేర్కొన్నారు. గుర్మీత్‌ను సాధారణ ఖైదీలాగానే చూసినట్లు చెప్పారు.

దత్త పుత్రికకు డేరా బాధ్యతలు

జైలుకెళ్ళిన గుర్మీత్ సింగ్ స్థానంలో సచ్చా సౌదా యజమానిగాఆయన దత్త కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్ బాధ్యతలు నిర్వహించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. హర్యానాలోని ఫతేపూర్‌కు చెందిన హనీ ప్రీత్ డేరా అనుచరుడు విశ్వాస్ గుప్తాను 1999లో వివాహం చేసుకుంది. ఆ తరువాత అత్తింటి వేధింపులకు గురైన ఆమెను 2009లో గుర్మీత్ దత్తత తీసుకున్నారు.

'బిజెపి భగావో..దేశ్ బచావో'

భారీ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ, యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్, జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరేన్ సహా పలు ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. లాలూ ఇద్దరు కుమారులు, కుటుంబసభ్యులు కూడా వేదికపై ఉన్నారు. ఈ సందర్భంగా శరద్‌యాదవ్ మాట్లాడుతూ బీహార్‌లో మహాగట్‌బంధన్ నుంచి బయటకివెళ్లినవారు ఓ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని, త్వరలోనే జాతీయస్థాయిలో మహాగట్‌బంధన్‌ను ఏర్పాటు చేస్తామని నితీశ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. రెండు నెలలు ఆగితే జెడి(యు) తమ పార్టీ అని రుజువు చేస్తానని సవాలు విసిరారు. ఈ సారికి బీహార్ ప్రజలు మోసపోయారని, ఇకపై అలా జరగకుండా దేశంలో ప్రతి మూలకీ వెళ్లి మహాగట్‌బంధన్ గురించి ప్రచారం చేస్తానని శరద్‌యాదవ్ ప్రకటించారు. రాజకీయాలతో మతం కలిస్తే ప్రమాదరక పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లో నెలకొన్న పరిస్థితులే ఇక్కడ సంభవిస్తాయని వివరించారు. ఊపిరి ఆగిపోయేంతవరకూ విచ్చిన్న శక్తులపై తన పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అనంతరం లాలూ ప్రసాద్‌తో కరచాలనం చేసి ఆలింగనం చేసుకున్నారు. ఆ సమయంలో నినాదాలతో క్రీడా ప్రాంగణం మారుమోగింది. సభ పూర్తయిన అనంతరం పాట్నా వీధుల్లో భారీ ర్యాలీ ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచీ పెద్ద ఎత్తున ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రతిపక్షాల నోరును ప్రభుత్వం నొక్కేస్తోంది : లాలూ

ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్ మాట్లాడుతూ బిజెపి, నరేంద్ర మోడీలపై విమర్శలు ఎక్కుపెట్టారు. మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాల నోరును నొక్కేస్తోందన్నారు. ప్రస్తుతం దేశంలో చాలా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజ్యాంగబద్ధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పాలన జరగట్లేదని విమర్శించారు. నితీశ్ కుమార్‌ను గెలిపించేందుకు చాలా కష్టపడ్డానని, గుండె ఆపరేషన్ జరిగిన తరువాత కూడా జెడి(యు) అభ్యర్థి కోసం ప్రచారం నిర్వహించానని గుర్తు చేశారు. ఉద్యోగం కోసం నిరుద్యోగులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన మోడీ, ఇప్పుడు 2022 వరకూ ఆగాలని కొత్త నినాదం ఎత్తుకోవడం తప్పించుకునేందుకు వేసిన ఎత్తు అని పేర్కొన్నారు. ఈ ఏడాది బీహార్ వరదల్లో ఎవరూ చనిపోలేదని, ప్రభుత్వమే ప్రజల్ని చంపేసిందని, నితీశ్ ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగానే వరదలు ముంచెత్తాయని లాలూ అన్నారు. తాజా పరిస్థితులపై ప్రజలకి సమాధానం చెప్పే ధైర్యం నితీశ్‌కుమార్‌కి లేదని ఆయన విమర్శించారు.

సిర్సాలో సమాంతర ఆర్థిక వ్యవస్థ

గుర్మీత్ అనుచరుల దందా

సిర్సా: దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్‌సింగ్ అనుచరులు ఆ సంస్థ ప్రధాన కార్యాలయం వున్న సిర్సాలో సమాంతర ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. డేరా ఆవరణ చుట్టుపక్కల వున్న షాపులు, వ్యాపార సంస్థలన్నీ గుర్మీత్ అనుచరుల ఆధీనంలోనే నడుస్తున్నాయి. ఇక్కడ వినియోగదారులకు చిల్లర అందించే వ్యవహారంలో వారు ఒకవైపు 'సచ్ (సత్యం)', రెండోవైపు తమ పేర్లు ముద్రించిన ప్లాస్టిక్ టోకెన్(నాణా)లను అందచేస్తుంటారు. రు.10, రు.5 వంటి వాటికి చిల్లర సమస్య ఎదురైనపుడు వారు ఈ ప్లాస్టిక్ టోకెన్ల ద్వారా దందా నడిపేవారు. 'సచ్' షాపుల్లో తరువాత వినిమయ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వారు ఈ టోకెన్లను ఉపయోగించవచ్చన్నమాట. ఒక వేళ వినియోగదారుడు రు.70 విలువైన వస్తువులు కొనుగోలు చేసి రు.100 నోటు ఇచ్చినపుడు దుకాణదారు అతడికి రు.10 విలువైన మూడు టోకెన్లు ఇస్తాడు. దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం దాదాపు ఒక చిన్న టౌన్‌షిప్‌లా వుంటుంది. సొంత స్కూళ్లు, క్రీడల గ్రామం, ఆస్పత్రి, సినిమా హాలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు. సచ్ షాపులు నిర్వహించే దుకాణదారులు ఒక్కో ప్లాస్టిక్ టోకెన్‌కు ప్రత్యేకమైన రంగులను వినియోగిస్తుంటారు. సిబిఐ కోర్టు గుర్మీత్‌కు శిక్ష విధించిన తరువాత ప్రధాన కార్యాలయం ఆవరణలోకి వెళ్లిన కొందరు పాత్రికేయులకు అక్కడి దుకాణ దారులు సాధారణ కరెన్సీకి బదులు ఈ టోకెన్లు ఇచ్చారు. వినియోగదారులు ఎవరైనా చిల్లర ఇవ్వలేని సమయంలో ఈ టోకెన్లు ఇవ్వటం ఇక్కడ పరిపాటేనని స్థానికులు చెబుతున్నారు.



గుర్మీత్ అనుచరుల తరలింపు

డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం ఆవరణలో వున్న దాదాపు 30 వేల మంది గుర్మీత్ అనుచరులను తరలించేందుకు సైన్యం, పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో 100 ఆర్టీసీ బస్సులను రప్పించిన భద్రతా దళాలు వాటిలో గుర్మీత్ అనుచరులను తరలిస్తున్నాయి. ప్రస్తుతం కర్ఫ్యూ నిషేధాజ్ఞలు కొనసాగుతున్న రోహతక్, సిర్సా పట్టణాలలో సోమవారం నాటికి సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హర్యానా పోలీసులు చెప్పారు. ప్రస్తుతం రోహతక్ జైలులో వున్న గుర్మీత్‌కు సోమవారం మధ్యాహ్నం శిక్షను ఖరారు చేయనున్నారు.

ఘర్షణలు సహజం

హర్యానా మంత్రి మనీష్ గ్రోవర్

న్యూఢిల్లీ: డేరా సచ్చ సౌదా (డిఎస్ఎస్) అధినేత గుర్మీత్ రామ్ రాహీమ్ సింగ్ అనుచరులు పెద్దఎత్తున హింసకు దిగిన ఒక రోజు తర్వాత హర్యానా మంత్రి, రోహతక్ ఎమ్మెల్యే మనీష్ గ్రోవర్ స్పందించారు. "హింస సహజం', వారి సహజ ఆగ్రహాన్ని ఈ విధంగా వ్యక్తం చేశారు.' అని పేర్కొన్నారు. 50 వేల నుంచి లక్ష మంది గుర్మీత్ మద్దతు దారులు వారి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారన్నారు. రెండు గంటల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామనీ ఇదంతా సహజంగా జరిగే ప్రక్రియేనని వ్యాఖ్యానించారు. స్థానికులను మీడియా భయకంపితుల్ని చేస్తుందనీ, పదిరోజులుగా బాబా వార్త అంశంపైనే మీడియా దృష్టిసారించిందన్నారు. కోర్టుకు హాజరవుతాడా..? లేదా..? అంటూ ఈ అంశానికి ప్రచారం కల్పించిందనీ, దీంతో పరిస్థితి ఉద్రిక్తతను ఊతం ఇచ్చిందని పేర్కొన్నారు. గ్రోవర్ ఆర్ఎస్ఎస్‌లో సభ్యుడిగా కూడా కొనసాగుతున్నాడు. ఆయన రూ.11 లక్షల ప్రభుత్వ నిధులను డిఎస్ఎస్ సంస్థకు మళ్లించారు. ఆగస్టు 25న బాబా భారీ కాన్వాయ్‌తో వచ్చాడనీ, అయితే రెండు వాహనాలనే లోనికి అనుమతించామనీ పేర్కొన్నారు. కోర్టు తీర్పు ప్రకారం జైలుకు తరలించామన్నారు.

గుర్మీత్‌ను తప్పించేందుకు యత్నించిన

ఏడుగురిపై రాజద్రోహ కేసు

వారిలో ఐదుగురు హర్యానా పోలీసులు

ఛండీగఢ్: అత్యాచార కేసులో నేరస్తుడు గుర్మీత్ రామ్ రహీమ్‌ను తప్పించేందుకు యత్నించారనే ఆరోపణలతో ఏడుగురిపై రాజద్రోహ, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వారిలో ఐదుగురు హర్యానా పోలీసులు కాగా, మిగిలిన ఇద్దరూ గుర్మీత్ వ్యక్తిగత సిబ్బంది అని పంచకుల పోలీసు ఇన్స్‌పెక్టర్ కరంబీర్ సింగ్ ఆదివారం తెలిపారు. పంచకులలోని సిబిఐ కోర్టు గుర్మీత్‌ను శుక్రవారం దోషిగా పేర్కొంటూ తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అనంతరం కోర్టు నుంచి గుర్మీత్ బయటకు వస్తుండగా ఆయన్ను తప్పించేందుకు వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు ప్రభుత్వం కల్పించిన భద్రతా సిబ్బందిలోని కొంతమంది యత్నించారని, దీంతో వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించించామని పోలీసు అధికారులు వెల్లడించారు. మరోవైపు డేరా ఆస్తుల కోసం అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆయనకు సంబంధించిన ఖాతాలు, ఆస్తుల వివరాలను వెల్లడించాలని పంజాబ్, హర్యానాలోని బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారంలోగా డేరా ఆస్తుల సమాచారాన్ని అందించాలని హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

రైల్వే సర్వీసుల పునరుద్ధరణ

'డేరా' హింసాత్మక ఘటనల నేపథ్యంలో పంజాబ్, హర్యానాల్లో నిలిచిపోయిన రైల్వే సర్వీసులను ఆదివారం అధికారులు పునరుద్ధరించారు. ఇటీవల రెండు రాష్ట్రాల్లో చెలరేగిన హింసల్లో పలు రైళ్లకు, వాహనాలకు ఆందోళనకారులు నిప్పంటించిన సంగతి తెలిసిందే. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఢిల్లీ నుంచి ఈ రాష్ట్రాలను అనుసంధానించే మార్గాల్లోని రైళ్లతో పాటు పలు లోకల్ సర్వీసులను రద్దు చేశారు.

పథకం ప్రకారమే హింస

హర్యానాలో పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ : డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అనుచరులు హర్యానాలో ఒక పథకం ప్రకారమే హింసకు పాల్పడినట్లు తెలియ వచ్చింది. అత్యాచారం కేసులో గుర్మీత్ సింగ్‌ను కోర్టు దోషిగా ప్రకటించిన నేపథ్యంలో హర్యానాలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్న ఒక రోజు తరువాత డేరా సచ్చా సౌదాకు చెందిన పలు కేంద్రాల నుంచి, నామ్ చర్చాఘర్‌ల నుంచి, పలు వాహనాల నుంచి పోలీసులు పదునైనా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పెట్రోలు బాంబులు, రెండు ఎకె47లు, ఒక పిస్టల్‌తో సహా పలు పేలుడు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో పదునైన ఆయుధాలు కూడా ఉన్నాయి. హర్యానాతో పాటు, పంచకుల, దక్షిణ పంజాబ్‌లోని పలు ప్రాంతాలలోనూ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లలోనూ గుర్మీత్ అనుచరులు విధ్వంసం సృష్టించారు.

ఎకె47, పెట్రోలు బాంబులు స్వాధీనం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నామ్ చర్చా ఘర్‌లలో పెద్ద ఎత్తు పెట్రోలు బాంబులను స్వాధీనం చేసుకున్నామని హర్యానా డిజిపి బి.ఎస్. సంధూ తెలిపారు. డేరాకు చెందిన వాహనాల నుంచి ఎకె47 వంటి తుపాకులను స్వాధీనం చేసున్నట్లు ఆయన తెలిపారు. పదునైన ఆయుధాలతో పాటు, వేల సంఖ్యలో ఉన్న కర్రలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముందుగానే హెచ్చరించిన స్థానిక మీడియా

గుర్మీత్ సింగ్‌పై నమోదైన అత్యాచారం కేసులో కోర్టు తీర్పు వెలువడటానికి కొన్ని రోజులు ముందుగానే డేరా కేంద్రాలకు అనుచరులు పదునైన ఆయుధాలతోనూ, పెట్రోలు బాంబులతోనూ చేరుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కాని మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం మీడియా హెచ్చరికలను నిర్లక్ష్యం చేసింది. కోర్టు తీర్పు వెలువడటానికి ముందే పంజాబ్ డిజిపి(శాంతి భద్రతలు)కి కూడా ఇదే విధమైన హెచ్చరికలు అందాయి. కాని హింసను నివారించడంలో ఈ హెచ్చరికలు ఏ మాత్రం పనిచేయలేదు. దక్షిణ పంజాబ్‌లోని మాల్లా ప్రాంతంలో డేరా అనుచరులు పెద్ద ఎత్తున దహనకాండకు పూనుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై పెట్రోలు బాంబులు రువ్వారు. దాదాపు 15 వాహనాలు, ఆరు పెట్రలో బంక్‌లు, ఎనిమిది పవర్ గ్రిడ్‌లు, 20 సేవా కేంద్రాలు, మూడు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు మంటలకు ఆహుతయ్యాయి. వీటితోపాటు రెండు రైల్వేస్టేషన్లపై కూడా గుర్మీత్ అనుచరులు దాడి చేశారు. దీంతో పంజాబ్ ప్రభుత్వం స్పందించి ఎనిమిది జిల్లాల్లో కర్ఫ్యూ విధించింది. సైనికుల సహాయాన్ని కూడా తీసుకుంది. డేరాకు సంబంధించిన రాష్ట్రస్థాయి కమిటీ నాయకులను అదుపులోకి తీసుకుంది. బటిండాలోని బుల్వానా రైల్వే స్టేషన్‌కు నిప్పుపెట్టేందుకు ప్రయత్నించిన ఐదుగురు డేరా మద్దతుదారులను అదుపులోకి తీసుకుంది.

దిగ్భ్రాంతి నుంచి తేరుకుంటున్న పంచకుల

సిబిఐ కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే గుర్మీత్ అనుచరులు విధ్వంసానికి సాక్షిగా నిలిచిన పంచకుల ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. గుర్మీత్ అనుచరులు తాము ప్రవేశించిన కాలనీలలోని ప్రజలపైనే కాకుండా, రోడ్డుపై కనపించిన వారిని కూడా కొట్టారు. గుర్మీత్ అనుచరుల దాష్టీకాన్ని తప్పించుకునేందుకు తాము ఇంటి కప్పులపై నుంచి పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నట్లు కొంతమంది స్థానికులు తెలిపారు. పంచకుల లోని సెక్టార్ 16 మార్కెట్‌లో ఒక రెస్టారెంట్‌ను దగ్ధం చేశారు. పెద్ద సంఖ్యలో అగ్నికి ఆహుతైన భవనాలు, దగ్ధమైన వాహనాలు పంచకులలో చోటు చేసుకున్న హింసను కళ్ళకు కట్టినట్లు చూపిస్తోంది.

చేతిలో పది కేజీల బాంబు.. కిమీ పరుగు..

- విద్యార్థుల కోసం పోలీసు సాహసం
- రివార్డు ప్రకటించిన అధికారులు



భోపాల్: విద్యార్థుల ప్రాణాలు కాపాడేందుకు మధ్యప్రదేశ్‌లో ఓ పోలీసు సాహసం చేశారు. బాంబు నిర్వీర్యం చేసే వాళ్లు లేకపోవడంతో పదికేజీల బరువున్న ఆ బాంబును చేతితోనే పట్టుకుని కిమీ దూరం వరకూ వేగంగా పరుగెట్టి అనంతరం నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టి విద్యార్థుల కళ్లల్లో భయాన్ని పోగొట్టారు. సాగర్ జిల్లాలోని చితోరా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఈ ఘటన జరిగినట్లు పోలీసు అధికారులు తెలిపారు. బాంబు ఉందని ఉపాధ్యాయులు సమాచారం ఇచ్చిన వెంటనే తమ బృందం పాఠశాలకు చేరుకుందని హెడ్‌కానిస్టేబుల్ అభిషేక్ పటేల్ చెప్పారు. బాంబు నిర్వీర్యం చేసే స్క్వాడ్ లేకపోవడంతో ఏం చేయాలన్నదానిపై ఉపాధ్యాయులు, పోలీసులు తీవ్రంగా చర్చిస్తున్న నేపథ్యంలో అభిషేక్ పటేల్ ఒక్కసారిగా రంగంలోకి దిగి 12 అంగుళాల పరిమాణమున్న బాంబును చేతిలోకి తీసుకుని సుమారు ఒక కిమీ దూరం వరకూ పరుగెట్టారు. 500మీ పరిధిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఆయన అక్కడ బాంబును వదిలివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రదర్శించిన సాహసానికిగాను అభిషేక్ బృందానికి రివార్డు ప్రకటించినట్లు సీనియర్ పోలీసు అధికారి సతీష్ సక్సేనా చెప్పారు. అయితే ఆ బాంబు అక్కడికి ఎలా వచ్చిందో ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు.

'రక్షణ' కోసం దేశ వనరులు : జైట్లీ

భద్రతా సంసిద్ధత కోసం వినియోగించాలని వ్యాఖ్య



బెంగళూరు: ఆయుధ సంపత్తిని మెరుగుపరుచుకోవడం కోసం జాతీయ వనరులన్నిటినీ వినియోగించాల్సిన అవసరముందని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. శనివారం సాయంత్రం ఇక్కడున్న హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఎఎల్)లో తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక-రాజకీయ అంశాల రీత్యా భారత్ చుట్టూ అత్యంత సున్నిత పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భద్రతా పరంగా సంసిద్ధం కావడం కోసం వనరుల వినియోగం తప్పదని పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆయుధాలు, రక్షణ సాంకేతికత కోసం భారత్ ఇతర దేశాలపై ఆధారపడిందని, ఇప్పుడిప్పుడే సొంతంగా ఆయుధాలు తయారుచేయడం ప్రారంభించామని జైట్లీ తెలిపారు. భవిష్యత్తులో ఆయుధ తయారీ హబ్‌గా భారత్ మారుతుందని, ఇతర దేశాలకూ ఆయుధాలు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ నిర్వహణలో ప్రయివేటు సంస్థల భాగస్వామ్యంతో అంతర్జాతీయ పెట్టుబడులను సైతం ఆకర్షించగలమని చెప్పారు. కొనుగోలుదారుని స్థాయి నుంచి తయారీదారు స్థాయికి ఎదగడంలో భారత్ 'గ్రాడ్యుయేషన్' పొందాలని పేర్కొన్నారు.

స్వతంత్ర పోరాటంలో హిందుత్వ శక్తుల వ్యతిరేక పాత్రపై పుస్తకాన్ని అడ్డుకున్న ఐసిహెచ్ఆర్

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య పోరాటంలో హిందూత్వ సంస్థల వ్యతిరేక పాత్రలకు సంబంధించిన వివరాలతో కూడిన పుస్తకం పట్ల ప్రభుత్వ సంస్థలు అసంతృప్తిగా ఉన్నాయని ప్రముఖ చరిత్ర కారుడు అర్జున్‌దేవ్ విమర్శించారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఇండియన్ కౌన్సిల్ హిస్టరీ రీసెర్చ్ (ఐసిహెచ్ఆర్) సంస్థ స్వాతంత్ర్య పోరాటంలో హిందూత్వ సంస్థల వ్యతిరేక వైఖరిని తెలియచేస్తూ రాసిన చారిత్రక పుస్తకాన్ని వెలుగులోకి తీసుకు రాకుండా అడ్డుకుంటున్నదని, ఐసిహెచ్ఆర్ మోడీ ప్రభుత్వ ప్రభావానికి లోనయ్యిందని పేర్కొన్నారు. చివరి పదేళ్ళ కాలంలో జరిగిన (1938-1947) స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా తాను సంకలనం చేసిన రాతప్రతిని రెండేళ్ళ క్రితమే తాను ఐసిహెచ్ఆర్‌కు సమర్పించానని ఆయన చెప్పారు. దానిని స్వాతంత్ర్య పోరాట గ్రంథాల విభాగంలో ప్రచురించాల్సి ఉందని అర్జున్ దేవ్ చెప్పారు. అయితే ఆగస్టు 1, 2015న తాను సమర్పించిన రాతప్రతిని ఐసిహెచ్ఆర్ పక్కన పెట్టిందన్నారు. అందులో 1941లో జరిగిన రాజకీయ పరిణామాలు ప్రముఖంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా మూడు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. బ్రిటీషు పాలనలో స్వాతంత్ర్యోద్యమ స్వభావం, ఆ కాలంలో జరిగిన మత రాజకీయాలు, కార్మిక, రైతు ఉద్యమాలకు సంబంధించిన వివరాలు న్నాయి. ఇందులో రెండో భాగంలో హిందూ మహా సభ, ఆరెస్సెస్ వంటి హిందూ జాతీయ వాద సంస్థల పాత్రను చిత్రీకరించడం జరిగిందన్నారు. తన రాత ప్రతి ప్రచురణకు నోచుకోక పోవడానికి అదే కారణమని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జనరల్ ఎడిటర్ సవ్యసాచి భట్టాచార్య ప్రచురణకు అనుమతించినప్పటికీ, ఐసిహెచ్ఆర్ దానిని ప్రచురణకు పంపలేదని పేర్కొన్నారు. జనరల్ ఎడిటర్ ప్రచురణకు అనుమతిస్తూ సంబంధిత లేఖను ఐసిహెచ్ఆర్ మెంబర్ సెక్రటరీకి పంపారని కూడా తెలిపారు. దీనిని కాదని ఐసిహెచ్ఆర్ తన రాత ప్రతిని ఇంతకుముందెన్నడూ లేనివిధంగా, నిబంధనలకు విరుద్ధంగా నిపుణుల కమిటీ పరిశీలనకు పంపిందని, ఆ కమిటీ కొన్ని అంశాల పట్ల అభ్యంతరాలను లేవనెత్తిందని ఆయన చెప్పారు. అయితే నిపుణుల కమిటీలో సభ్యుల పేర్లను ఐసిహెచ్ఆర్ వెల్లడించలేదు. హిందూ మహాసభ నేత, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ప్రసంగంలోని కొన్ని అంశాల విశ్వసనీయతపై నిపుణుల కమిటీ అభ్యంతరాలను లేవనెత్తిందని అర్జున్‌దేవ్ తెలిపారు.

విశ్వాసం పేరుతో హింసను సహించం

దోషులకు శిక్ష తప్పదు

హర్యానాలో హింసపై ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: హింస ఏ రూపంలో చెలరేగినా సహించేది లేదని, దోషులను శిక్షించి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. డేరా సచ్చ సౌదా అనుచరులు జరపిన హింసాకాండలో 36 మంది చనిపోగా, వందల మంది గాయపడ్డ నేపథ్యంలో ప్రధాని తన 35వ మన్ కీ బాత్ కార్యక్రమంలో పై వ్యాఖ్యలు చేశారు. "విశ్వాసం పేరుతో ఏ ఒక్కరికీ కూడా చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకునే హక్కు లేదు" అని మోడీ పేర్కొనారు. " నా దేశ ప్రజలకు హామీనిస్తున్నాను, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వారిని, హింసాయుత మార్గంలోకి చెలరేగిన వారిని, వారు ఒక వ్యక్తి కావచ్చు లేదా ఒక గ్రూపు కావొచ్చు, ఈ దేశం కానీ, ప్రభుత్వం కానీ వాళ్లను సహించదు. చట్టం అటువంటి వారిని గుర్తించి శిక్ష పడేలా చేస్తుంది" అని మోడీ అన్నారు.

భద్రతాంశాలు గాలికి

ట్రంప్‌పై సైబర్‌భద్రతా బృందం విమర్శలు

మూకుమ్మడి రాజీనామాలతో నిరసన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దేశ రక్షణకు అత్యంత కీలకమైన భద్రతాంశాలను ట్రంప్ గాలికి వదిలేయడానిన నిరసిస్తూ సైబర్ భద్రతా బృందానికి ఏడుగురు సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారిలో భారతీయసంతతికి చెందిన సమాచార శాస్త్రవేత్త కూడా ఉన్నారు. వీరంతా ఒకే రాజీనామా లేఖను ప్రభుత్వానికి అందించారు. అమెరికన్ల సైబర్ భద్రతకు సంబంధించిన కీలక వ్యవస్థలకు ఇటీవల భద్రతాపరమైన దాడి హెచ్చరికలు వెల్లువెత్తాయని, వీటి గురించి ప్రభుత్వానికి సమాచారం అందించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో పెరిగిన అసంతృప్తి, విద్వేష గ్రూపులు సృష్టిస్తున్న హింసను ఖండించడంలో ట్రంప్ దారుణంగా విఫలమవ్వడం కూడా ఓ కారణమని సైబర్ భద్రతా బృందం పేర్కొంది. త్వరలోనే త్రైమాసిక సమావేశం జరగాల్సి ఉండగా, బృంద సభ్యులు రాజీనామా చేయడం విశేషం.

మహిళ శవాన్ని తిన్న కుక్కలు

లక్నో ప్రభుత్వాస్పత్రిలో దారుణం

లక్నో: ఓ వైపు మౌలిక సదుపాయాల లేమి.. మరోవైపు ఆస్పత్రివర్గాల నిర్లక్ష్యం...వెరసి ఓ మహిళ శవం.. వీధి కుక్కలపాలైన దౌర్భాగ్య పరిస్థితి తలెత్తింది. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చోటు చేసుకున్నది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చిన్హాట్ ప్రాంతానికి చెందిన పుష్పా తివారి(40) అనే మహిళకు ఫుడ్ పాయిజన్ కావడంతో ఆమెను శనివారం లోహియా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయింది. అయితే పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మార్చురీ వద్ద ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ఆమె శవాన్ని కుక్కలు తిన సాగాయి. కొన్ని అవయవాలను వేరు చేసి దూరంగా ఎత్తుకెళ్లాయి. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రివర్గాల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తున్నది. ఘటనకు బాధ్యుల్ని చేస్తూ మార్చురీ గార్డు, సూపర్‌వైజర్, వార్డు బాయ్‌ను విధుల నుంచి తప్పించారు. ఘటనపై దర్యాప్తు చేసి, నివేదిక ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ప్రశాంత్ త్రివేది ఆదేశించారు.

జులై 2 నుంచి పెట్రోల్ ధర రూ.6, డీజిల్ ధర రూ.3.67 పెరిగాయి

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ ధరలు గత నెలన్నరగా పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు వెల్లడించిన లెక్కల ప్రకారం జులై 2 నుంచి ఆగస్టు 27 వరకు లీటర్ పెట్రోల్ ధర రూ.6 పెరగగా, డీజిల్ ధర రూ.3.67మేర పెరిగింది. తాజా ధరల ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.70.33 కాగా, డీజిల్ ధర 57.03. ఆయిల్ కంపెనీలు ఈ ఏడాది జూన్ 16 నుంచి ధరల విధానాన్ని మార్చాయి. ఏరోజు ధరను ఆరోజు నిర్ణయిస్తున్నాయి. జూన్ 16న ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.65.48 ఉండగా, జులై 2నాటికి 63.06కు చేరింది. డీజిల్ ధర జూన్ 16న రూ. 54.49 ఉండగా, జులై 2 నాటికి రూ. 53.36కు చేరింది. జులై నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. తాజా ధరల్ని పోల్చి చూస్తే డీజిల్ ధరలు నాలుగు నెలల గరిష్టానికి, పెట్రోల్ ధరలు మూడేండ్ల గరిష్టానికి చేరాయి. 2014 ఆగస్టులో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.69.04 ఉండగా, ఇప్పుడది రూ.70.33కు చేరింది. కొత్త విధానం అమలులోకి రాకముందు 15 ఏండ్లపాటు ప్రతినెలా 1, 16 తేదీల్లో మాత్రమే పెట్రోల్,డీజిల్ ధరల్లో మార్పును ప్రకటించేవారు.

జార్ఖండ్‌లో నెల రోజుల్లో 52 మంది శిశువుల మృతి

రాంచి: గోరఖ్‌పూర్‌లో బిఆర్‌డి ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక పిల్లలు మరణించిన ఘటన మరువక ముందే జార్ఖండ్ రాష్ట్రంలో మరో విషాదఘటన వెలుగు చూసింది. జంషెడ్‌పూర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ మెడికల్ కాలేజీ(ఎంజిఎం) ఆస్పత్రిలో 52 మంది శిశులు మృతిచెందిన సంఘటన వెలుగు చూసింది. గత నెలరోజుల వ్యవధిలో ఈ మరణాలు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. సరైన పౌష్టికాహారం అందకపోవడంతోనే శిశువుల మృతిచెందారనీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

అభిశంసనతో ట్రంప్‌కు గుణపాఠం

అమెరికన్ల మనోగతమిది



వాషింగ్టన్: మొండితనంతో, పెడధోరణితో వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అభిశంసనతో సరైన గుణపాఠం నేర్పాలని పలువురు అమెరికన్లు భావిస్తున్నారు. హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన సెంటర్ ఫర్ అమెరికన్ పొలిటికల్ స్టడీస్, రిసెర్చ్, మార్కెటింగ్ సంస్థ ఇన్‌సైట్స్ అండ్ అనలిటిక్స్ సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. ట్రంప్‌కు ఏదో ఒక విధంగా అధ్యక్ష పదవి నుండి ఉద్వాసన పలకాలని 43 శాతం మంది అభిప్రాయపడగా, ఏదైతే అదవుతుందంటూ మరో 42 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. అధ్యక్షుడిని కాంగ్రెస్ ద్వారా అభిశంసించాల్సిందేనని మరో 12 శాతం మంది స్పష్టం చేశారు. అక్రమ వలసదారులతో ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు, అమెరికా, ఉ.కొరియా మధ్య తాజాగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఛార్లెట్స్‌విల్లె హింసాకాండపై అధ్యక్షుడి వివాదాస్పద వ్యాఖ్యల వంటి అంశాల నేపథ్యంలో ట్రంప్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగినట్లు తమ అధ్యయనంలో వెల్లడయిందని నిర్వాహకులు చెబుతున్నారు. రష్యాకు సంబంధించిన దర్యాప్తులు దేశానికి మేలు చేయకపోగా, కీడే చేస్తున్నాయని దాదాపు 60 శాతం మంది పేర్కొన్నారు. కాగా మరికొందరు మాత్రం ట్రంప్‌ను ఎందుకు అభిశంసించాలంటూ అధ్యయన నిర్వాహకులను ప్రశ్నించారు. ట్రంప్ అవినీతికి, రాజ్యాంగ ఉల్లంఘనకు, మరే ఇతర నేరాలకు, పాల్పడినట్లు కానీ ఎక్కడా ఆధారాలు లభించటం లేదని, ఈ పరిస్థితుల్లో ఆయన్ను ఎందుకు అభిశింసించాలని వారు ప్రశ్నించారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో మసీదుపై దాడి

ప్రభుత్వ వైఫల్యంపై బాధిత కుటుంబాల నిరసన

కాబూల్: శుక్రవారం నాడు నగరంలోని ఒక మసీదుపై జరిగిన ఉగ్రదాడిని నిరోధించటంలో విఫలమైన ఆఫ్ఘన్ ప్రభుత్వంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఆత్మాహుతి దళ సభ్యులు, పోలీసు యూనిఫారంలో వున్న సాయుధులు గత శుక్రవారం మసీదుపై దాడి చేసి 40మందికి పైగా బలితీసుకున్న విషయం తెలిసిందే. ఈ దాడిలో మరో వందమందికి పైగా గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దాడి జరిగిన సమయంలో మసీదు రెండో అంతస్తులో చిక్కుకుపోయిన వారిలో మహిళలే ఎక్కువగా వున్నారు. ఈ దాడిలో 20 మంది మరణించారని, మరో 30 మంది గాయపడ్డారని ఐరాస ప్రకటించగా ఆఫ్ఘన్ హోం శాఖ మాత్రం 28 మంది మరణించగా 50 మందికి పైగా గాయపడ్డారని ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం నాడు కుటుంబ సభ్యులు, బంధు, మిత్రుల రోదనల మధ్య మరణించిన వారి మృతదేహాలను ఆ మసీదు ఆవరణలోనే ఖననం చేశారు. ప్రభుత్వం తమను గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. తమను రక్షించటానికి ప్రయత్నించని ప్రభుత్వం నుండి తాము ఏం ఆశించగలమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం తమను రక్షించలేనపుడు, ఆత్మరక్షణకు తామే ప్రయత్నిస్తామని వారు స్పష్టం చేశారు.

దక్షిణ చైనాలో పఖర్ తుపాను బీభత్సం

బీజింగ్: చైనా దక్షిణ ప్రాంతంలోని మకావు నగరంలో కొద్దిరోజుల క్రితం హటో తుపాను సృష్టించిన విధ్వంసం కనుమరుగు కాక ముందే ఆదివారం నాడు కురిసిన భారీ వర్షాలతో సంభవించిన పఖర్ తుపాను మరోసారి విధ్వంసం సృష్టించింది. గత కొన్ని దశాబ్దాల కాలంలో అత్యంత తీవ్రమైనదిగా భావిస్తున్న ఈ తుపానులో కనీసం 22 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. గంటకు 90 నుండి 105 కి.మీ వేగంతో వీచిన తుపానుగాలులు వీచాయి. ఆదివారం ఉదయం హాంకాంగ్, మకావులోని తుపాను హెచ్చరికల బృందం జారీ చేసిన హెచ్చరికలతో ముందు 1, 2 నెం ప్రమాద సంకేతాలు వెలువరించటంతో నగరంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. అయితే మధ్యాహ్నానికి తీవ్రత కొంత తగ్గటంతో సంకేతాలను 3వ నెంబర్‌కు మార్చారు. పఖర్ తుపాను కారణంగా దాదాపు 300 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధి ఒకరు వివరించారు. కాగా సోమవారం కూడా కొన్ని విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం వుందని నగరానికి చెందిన విమాన సంస్థ కాథే పసిఫిక్ ప్రకటించింది.

'మేం భయపడం..'!

బార్సిలోనా దాడులపై స్పెయిన్ వాసుల నిరసన

బార్సిలోనా: తమపై ఎటువంటి దాడులు జరిగినా తాము భయపడబోమని స్పెయిన్ వాసులు ముక్త కంఠంతో నినదించారు. ఈ నెల 17న నగరంలోని లాస్ రాంబ్లాస్ బోలీవర్డ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ బార్సిలోనా నగరంలో శనివారం నాడు దాదాపు ఐదు లక్షల మందితో భారీ ప్రజా ప్రదర్శన జరిగింది. స్పెయిన్ రాజు నాల్గవ ఫిలిప్ తొలిసారిగా ఈ ప్రదర్శనలో పాల్గొని నేతృత్వం వహించటం విశేషం. ఆయనతో పాటు ప్రధాని మరియాన రజోయ్, ఇతర స్పానిష్ కాటలన్ ప్రాంతీయ నేతలు ప్రదర్శనలో అగ్రభాగాన నడిచారు. ఎటువంటి దాడులకూ 'మేం భయపడం' అని రాసిన భారీ బ్యానర్‌ను చేతపట్టి వారు ప్రదర్శనకు నేతృత్వం వహించారు. ఇదిలా వుండగా ఈ దాడిలో గాయపడిన దాదాపు 22 మంది ఇప్పటికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా వుందని వైద్య అధికారులు తెలియచేశారు. బార్సిలోనాతో పాటు తీర



ప్రాంత నగరం కాంబ్రిల్స్‌లో కూడా కొద్దిగంటల వ్యవధిలో జరిగిన ఈ దాడుల్లో 15 మంది మరణించగా 120 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడులను తామే చేసినట్లు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ లివెంట్ (ఐఎస్ఐఎల్) ప్రకటించింది. టటటటటట

శ్వేత జాత్యహంకారంపై వెల్లువెత్తిన నిరసన



శాన్‌ఫ్రాన్సిస్కో: శ్వేతజాత్యహంకారాన్ని, ఆధిపత్య ధోరణిని నిరసిస్తూ శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. అధికారులు తమ ర్యాలీని, మీడియా సమావేశాన్ని రద్దు చేసినప్పటికీ నిరసనకారులు నగరంలోని అలామో స్క్వేర్ పార్క్‌లో గోడలపై నినాదాలు రాసి తమ నిరసనను తెలియచేశారు. ఇది తాము సాధించిన విజయమని నిరసన కారులు కొందరు మీడియాకు చెప్పారు. అధికారులు తమ నిరసన ర్యాలీని రద్దు చేయటం ద్వారా వారి నాజీ ధోరణిని మరోసారి బయటపెట్టుకున్నారని నిరసనకారులు విమర్శించారు.

షరతులతోనే పాక్‌కు భద్రతా సహాయం : అమెరికా

వాషింగ్టన్ : పాక్‌కు అందించే భద్రతా సహాయం షరతులతో ఉంటుందని వైట్ హౌస్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తాలిబన్, హక్కాని వంటి ఉగ్రవాద సంస్థలపై పాక్ తీసుకునే చర్యల ఆధారంగా అమెరికా సహాయం ఉంటుందని ఆయన చెప్పారు. పాక్ నిఘా సంస్థలకు చెందిన అధికారులకు, ఉగ్రవాద సంస్థలకు మధ్య ఎంతోకాలంగా సంబంధాలు కొనసాగుతున్నాయని, రాత్రికి రాత్రే పరిస్థితులు మారతాయని తాము భావించడం లేదని, కాల క్రమేణా మార్పులను తాము ఆశిస్తున్నామని ఆయన తెలిపారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికన్లను హతమారుస్తున్న ఉగ్రవాదులకు పాక్ స్వర్గధామంగా మారిందని, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడాన్ని పాక్ విరమించుకోవాలని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొన్ని రోజుల తరువాత వైట్‌హౌస్ అధికారి ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. తాము కోరిన చర్యలను పాక్ తీసుకుంటుందన్న విశ్వాసం తమకుందని ఆయన చెప్పారు. పాక్‌లో నెలకొన్న పరిస్థితిని అమెరికా జాగ్రత్తగా పర్యవేక్షిస్తోందని, కొంత పురోగతిని కూడా ఆశిస్తున్నదని ఆయన చెప్పారు. ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకునేందుకు పాక్‌కు అమెరికా గడువేమైనా విధించిందా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గడువు విధించడం సరికాదని, అయితే సమీప భవిష్యత్‌లో కొన్ని మార్పులు జరుగుతాయని ఆశిస్తున్నామని చెప్పారు.



సైనిక విన్యాసాలు ప్రారంభించిన వెనిజులా

అమెరికా బెదిరింపులను తీవ్రంగా ఖండించిన క్యూబా, బొలీవియా

కారకాస్/హవానా/లాపాజ్: సైనిక చర్యకు వెనుకాడబోమన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో వెనిజులా సైన్యం దేశవ్యాప్తంగా రెండు రోజుల సైనిక విన్యాసాలను శనివారం ప్రారంభించింది. యుద్ధ విమానాలు, ట్యాంకులతో పాటు నేషనల్ బొలివేరియన్ ఆర్మ్‌డ్‌ఫోర్సెస్ (ఎఫ్ఎఎన్‌బి)కి చెందిన దాదాపు 2 లక్షల మంది సైనికులు, పౌర రక్షక బృందాలు, రిజర్వ్ దళాలకు చెందిన దాదాపు 7 లక్షల మంది సభ్యులు ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణకు ప్రజలు, ఎఫ్ఎఎన్‌బి సభ్యులు సిద్ధంగా వున్నారని అధ్యక్షుడు నికొలస్ మదురో ట్విట్టర్‌లో స్పష్టం చేశారు. అమెరికా బెదిరింపులకు వ్యతిరేకంగా 18-60 ఏళ్ల మధ్య వయస్కులైన వెనిజులా ప్రజలందరూ దేశ రక్షణకు ముందుకు రావాలని ప్రభుత్వ ఆధ్వర్యంలోని అధికార టెలివిజన్ ఛానల్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.

సైనిక జోక్యానికి సైతం వెనుకాడబోమంటూ రెండు వారాల క్రితం ట్రంప్ చేసిన ప్రకటన, శుక్రవారం నాడు ప్రకటించిన తాజా ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో వెనిజులా ఈ విన్యాసాలను నిర్వహించినట్లు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వెనిజులా రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అవసరమైతే సైనిక జోక్యానికి కూడా వెనుకాడబోమంటూ ట్రంప్ ఈ నెల 11న ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తరువాత అమెరికన్ నేతలు ఈ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. సమీప భవిష్యత్తులో ఎటువంటి సైనిక జోక్యమూ వుండబోదని అమెరికా జాతాయ భద్రతా సలహాదారు హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్ స్పష్టం చేశారు. కానీ అమెరికా వెనిజులాపై శుక్రవారం నాడు తాజా ఆంక్షలు ప్రకటించటంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

అమెరికా ఆంక్షలను ఖండించిన మదురో

'ఒక దేశాన్ని రాజకీయంగా గెలవటానికి ఒక్కరూ ఆర్థిక, ద్రవ్యపరమైన ఆంక్షలు విధించరని ఆయన జాతీయ టెలివిజన్‌లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. ఇది తమపై అమెరికా ప్రకటించిన ఆర్థిక యుద్ధమేనని, ఈ రకమైన వత్తిళ్లు, బ్లాక్‌మెయిలింగ్‌లూ చెల్లబోవని ఆయన స్పష్టం చేశారు.

క్యూబా ఖండన

అమెరికా శుక్రవారం నాడు వెనిజులాపై ప్రకటించిన తాజా ఆంక్షలను క్యూబా ఉప విదేశాంగ మంత్రి అబెలార్డో మొరేనో తీవ్రంగా ఖండించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం నాడు వెనిజులాకు వ్యతిరేకంగా జారీ చేసిన ఆర్థిక పరమైన ఆంక్షలను, ఆదేశాలను తమ దేశం తీవ్రంగా ఖండిస్తున్నదని క్యూబా విదేశాంగశాఖ వెబ్‌సైట్‌లో ప్రచురించిన ఒక ప్రకటనలో పేర్కొంది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మదురో సర్కారుకు వ్యతిరేకంగా జారీ చేసిన ఈ కఠిన ఆంక్షలు అంతర్జాతీయ చట్ట నిబంధనలకు విరుద్ధమైనవని క్యూబా తన ప్రకటనలో పేర్కొంది. దీనితో పాటు 'సమీప భవిష్యత్తులో వెనిజులాపై ఎటువంటి సైనిక చర్యలూ వుండబోవని తాము ఆశిస్తున్నట్లు క్యూబా తన ప్రకటనలో తెలిపింది.

బొలీవియా ఖండన

వెనిజులాపై అమెరికా ప్రకటించిన తాజా ఆర్థిక ఆంక్షలను బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్ ఖండించారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు విఫలయత్నం చేసిన అమెరికా తన పాచికలు పారకపోవటంతో ఇప్పుడు ఆర్థిక యుద్ధానికి దిగిందని ఆయన విమర్శించారు.

యెమెన్‌లో వైమానిక దాడిపై సౌదీ కూటమి విచారం

సనా: యెమెన్ రాజధాని సనా నగరంలో ఒక పౌర నివాస భవనంపై జరిగిన దాడి సాంకేతికపరమైన పొరపాటుతో జరిగిందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి విచారం వ్యక్తం చేసింది. కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ దాడిలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తమ యుద్ధ విమానంలో తలెత్తిన సాంకేతికపరమైన సమస్య ప్రమాదకరమైన ఈ దాడికి దారి తీసిందని కూటమి ప్రతినిధి కల్నల్ తుర్కి అల్ మాలికి చెప్పారు. ఈ దాడి పట్ల, యెమెన్ పౌరులకు జరిగిన నష్టం పట్ల ఆయన తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ ఘటనపై జాయింట్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ యాక్సిడెంట్స్ టీమ్ (జెఐఎటి) దర్యాప్తునకు ఆదేశించామని ఆయన చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

రెండో ప్రయోగ వేదిక పైకి పిఎస్ఎల్‌వి-సి39

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 31న నింగిలోకి పిఎస్ఎల్‌వి-సి39 రాకెట్‌ను పంపేందుకు శాస్త్రవేత్తలు చురుగ్గా సన్నాహాలు చేస్తోన్నారు. ఇప్పటికే రాకెట్ అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. రాకెట్‌కు తుది పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు వాహన అనుసంధాన భవనం నుంచి పిఎస్-ఎల్‌వి-సి39 రాకెట్‌ను రెండో ప్రయోగ వేదిక పైకి తీసుకొచ్చారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించిన అనంతరం 31న సాయంత్రం నింగిలోకి పిఎస్ఎల్‌వి రాకెట్ దూసుకెళ్లనుంది. ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ స్థానంలో 1హెచ్ ఉపగ్రహాన్ని ఇస్రో పంపనుంది. జూలై 2013లో నావిగేషన్ వ్యవస్థ కోసం ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి పంపింది. ఇందులో గడియారాలు పని చేయక ఉపగ్రహం సేవలు అందించడం లేదు. దీని స్థానంలో ప్రత్యామ్నాయంగా ఐఆర్ఎస్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని పంపాల్సి వస్తోంది.

మోసగాళ్లకు ఓటేస్తే మురిగిపోతుంది : జగన్

ఉద్యోగులనే తొలగించే కుట్రలు పనుతున్నారని ఆరోపించారు. రేషన్‌షాపుల్లో పేదలకు బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. అన్ని రంగాల్లో అవినీతి అంతకుమించి పెరిగిపోయిందని ఆరోపించారు.కాకినాడ, రాజమహేంద్రవరం సిటీలకు తూర్పుగోదావరి జిల్లాలోని మత్స్యకారులు, బిసిల పిల్లలకు టిడిపి ప్రభుత్వం వస్తే సాయం చేస్తామని, పేదలకు ఇళ్లు కట్టిస్తానని చెప్పి మోసం చేశారని, ఇలాంటి మోసగాళ్లను ఎన్నికల్లో ఓడించాలని ఆయన ఓటర్లను కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకొస్తే మూడు నెలల్లోనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే నవరత్నాల పాలనకు నంద్యాల నాంది పలుకుతుందని, కాకినాడ కూడా నాంది పలకాలని కోరారు.

దొంగలను తరిమికొట్టండి : చంద్రబాబు

అధికారంలోకొస్తే నగరాన్ని శ్మశానంగా మార్చి వేస్తారని చెప్పారు. గతంలో బెల్టుషాపులు ఉంటే తాటతీస్తామని చెప్పానని, ప్రస్తుతం ఇసుక దందాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళల కోసం, ప్రజల కోసం అత్యాధునిక టెక్నాలజీతో ప్రతి ప్రాంతంలోనూ సిసి కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేసి తప్పు చేసినట్లు తేలితే జైలులో పెడతానని హెచ్చరించారు. అభివృద్ధికి అడ్డొస్తే ఎవరినైనా తాటతీస్తానని హెచ్చరికలు జారీచేశారు. గతంలో ఎవరైనా తప్పులు చేస్తే ఎలా ఉండేవాడినో అందరికీ తెలుసునని, ఇప్పుడు కూడా అవినీతిపరుల గుండెల్లో చండశాసనుడిగా ఉండి ఉగ్రరూపుణ్ని అవుతానని అన్నారు.

కొద్ది గంటల్లో నంద్యాల విజేత

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 12 మంది డిఎస్‌పిలు, 18 మంది సిఐలు, 600 మంది పోలీసు బలగాలతో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. నంద్యాల పట్టణమంతా 144 సెక్షన్‌ను విధించారు. మొత్తం 255 పోలింగ్ కేంద్రాలలో నమోదైన 1,73,335 ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకోసం కౌంటింగ్‌ను ప్రతి రౌండ్‌కు 9,000 చొప్పున లెక్కిస్తూ మొత్తంగా 19 రౌండ్లలో పూర్తి చేయనున్నారు. అధికార టిడిపికి, ప్రతిపక్షమైన వైసిపితో పాటు 2014 సాధారణ ఎన్నికల్లో ఓటమి చెందిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. మొత్తం 15 మంది బరిలో ఉన్నప్పటికీ చర్చంతా టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలకు పోలయ్యే ఓట్లపైనే నడుస్తోంది. భూమా నాగిరెడ్డి మృతితో ఖాళీ అయిన నంద్యాల స్థానంలో మొదట్లో ఎన్నికే జరగదనుకున్నప్పటికీ భూమా నాగిరెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉంటూ మరణించినందున.. వైసిపి తమ సీట్లో తాము పోటీ చేస్తామని ప్రకటించడంతో పోటీ అనివార్యమైంది. టిడిపి తరపున భూమా బ్రహ్మానందరెడ్డి, వైసిపి తరపున మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున గడ్డం అబ్దుల్‌ఖాదర్‌తో కలిపి మొత్తం 15 మంది బరిలో ఉన్నారు. ఇందులో కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ సమితి తరపున గాండ్ల పుల్లయ్య, రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీలు చీల్చే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయనే అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. రణరంగాన్ని తలపించే రీతిలో సాగిన ఈ ఎన్నికల్లో గెలుపెవరిదనే ఉత్కంఠతకు సోమవారం మధ్యాహ్నానికి తెరపడనుంది.

రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్య మహోద్యమం

- జమిలి ఎన్నికలతో సామాజిక న్యాయానికి నష్టం
- డిఎస్ఎంఎం జాతీయ సెమినార్‌లో బివి రాఘవులు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్యంగా మహోద్యమాన్ని నిర్మించాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు బివి రాఘవులు పిలుపునిచ్చారు. డిఎస్ఎంఎం జాతీయ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అధ్యక్షతన 'రాజ్యాంగం- సామాజిక న్యాయం- సవాళ్లు'అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో కోరుకున్న సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం లేదన్నారు. అసమానతల మధ్య సమానత్వం సాధ్యం కాదని, అందుకే రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ సందర్భంగా నీతిఅయోగ్ రూపొందించిన మూడేళ్ల 'యాక్షన్ అజెండా'గా, ఏడేళ్ల వ్యూహం, 15 ఏళ్ల విజన్ గురించి ప్రస్తావించారు. ఇందులో మూడేళ్ల అజెండాను కేంద్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. ఈ అజెండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఇందులో రిజర్వేషన్లకు ప్రమాదం కలిగించే అంశాలే ఉన్నాయన్నారు. దేశంలో 235 ప్రభుత్వ సంస్థలు, శాఖల్లో 74 సంస్థలను మూసేయాలని, 20 సంస్థలను విక్రయించాలని నీతి అయోగ్ సూచించిందన్నారు. ఆ సూచనల ప్రకారం ఇప్పటికే ఆరింటిని మూసివేశారన్నారు. ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన తరువాత రిజర్వేషన్లు అమలయ్యే ప్రసక్తే లేదన్నారు. రాజ్యాంగం ఉన్నా రిజర్వేషన్లు కాగితాలకే పరిమితమవుతాయన్నారు. 'రిజర్వేషన్లు మాకు కల్పించండి లేకుంటే తీసేయండి' అంటూ మరాఠాలు చేసిన ఉద్యమాన్ని రాఘవులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ కూడా రిజర్వేషన్ల ప్రక్రియను పున:సమీక్షించాలంటూ చేసిన వ్యాఖ్యాల్ని గుర్తు చేశారు. ద్రవ్యలోటు మూడు శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసిందని, దీంతో విద్య, ఆరోగ్యం మీద ప్రభుత్వ ఖర్చు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోందని, తద్వారా పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు పడతాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి కేటాయించిన నిధులు యంత్రాలకే ఇస్తున్నారు తప్ప కార్మికులకు చెల్లించడం లేదన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ధ్వంసమవుతుందన్నారు. ఆధార్ అనుసంధానం చేయడం వల్ల పేదలు నష్టపోతారన్నారు. ప్లాన్, నాన్‌ప్లాన్ బడ్జెట్ లేనప్పుడు సబ్‌ప్లాన్‌కు అవకాశమే లేకుండా కేంద్రం చేసిందన్నారు. నీతి అయోగ్ అజెండాలో సబ్‌ప్లాన్ అన్నపదానికే చోటు ఇవ్వలేదన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరిగితే సామాజిక న్యాయానికి తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ దుర్వినియోగమవుతోందంటూ వస్తున్న ప్రకటల్ని ప్రస్తావిస్తూ, అసలు అమలయితే కదా దుర్వినియోగమయ్యేదని వ్యాఖ్యానించారు. ధనవంతుల కారణంగా ఏ చట్టం దుర్వినియోగం కాలేదో చర్చకు సిద్ధమా.? అని సవాల్ విసిరారు. చివరకు సేవలను కూడా పిపిపి పద్ధతుల్లో ప్రయివేటీకరణకు అప్పగిస్తున్నారని,దీని కారణంగా పేదలకే నష్టమెక్కువని పేర్కొన్నారు. 50, 100 పడకల ఆసుపత్రులను పిపిపి పద్ధతిలో అప్పగిస్తే.. పేదల అనారోగ్య సమస్యలపై ఎక్కడికెళ్తారని ప్రశ్నించారు. భూ చట్టాన్ని మారుస్తామంటున్నారని, దాన్ని మార్చక ముందే ఏపిలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్ పేదల భూముల్ని లాక్కొని పెద్దలకు అప్పచెబుతున్నారని విమర్శించారు. చట్టాల అమలు కోసం ఉద్యమించాలన్నారు. సామాజిక న్యాయ సాధన, రిజర్వేషన్ల పరిరక్షణకు అన్ని సంఘాలూ కలిసి ఐక్య మహోద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.



హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న బివి రాఘవులు

దళితులు, మైనారిటీలకు రక్షణ లేదు : రాధాకృష్ణన్

మోడీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు దేశంలో రక్షణ లేదని డీఎస్ఎంఎం జాతీయ కన్వీనర్, కేరళ మాజీ స్పీకర్ కె రాధాకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా సామాజిక న్యాయం అమలు కావడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 71 ఏళ్లయినా స్వేచ్ఛ లేదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే కేరళలో ఎస్సీ, ఎస్టీలకు హక్కులు, సంక్షేమ ఫలాలు ఎక్కువగా అందుతున్నాయన్నారు. ఎంపి సోమప్రసాద్ మాట్లాడుతూ రిజర్వేషన్లకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని విమర్శించారు. మాజీ ఎంపి రామచంద్రడోన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హక్కుల్ని బిజెపి సర్కార్ కాలరాస్తోందన్నారు. కార్పొరేట్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు.

అధికారంలో రాజ్యాంగ వ్యతిరేకులు; సుభాషిణి అలీ

రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారు అధికారంలో కొనసాగుతున్నారని డిఎస్ఎంఎం జాతీయ నాయకురాలు, మాజీ ఎంపి సుభాషిణీ అలీ అన్నారు. బిజెపి కారణంగా దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. బిజెపి అధికారంలోకొచ్చాక దళితులపై దాడులు పెరిగిపోతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. ఇందుకు హెచ్‌సియులో రోహిత్ వేముల ఆత్మహత్యే నిదర్శనమన్నారు.

పోరాటాల ద్వారానే సామాజిక న్యాయం : కాకి మాధవరావు

ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ కుల, వర్గ పోరాటాలు నిర్వహించడం ద్వారానే సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. సంపన్నుల ప్రయోజనాల కోసమే వారి ఆదాయమ్మీద 70 శాతం నుంచి 30 శాతానికి పన్ను తగ్గించారన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ఆవుల రక్షణ పేరుతో మనుషుల్ని చంపే పార్టీ అధికారంలో ఉందని విమర్శించారు.

నవంబర్‌లో డిఎస్ఎంఎం మహాసభలు

నవంబర్ 4 నుంచి 6 వరకు తమిళనాడులోని మధురైలో డిఎస్ఎంఎం జాతీయ మహాసభలు జరుగుతాయని డిఎస్ఎంఎం జాతీయ సమన్వయకర్త వి. శ్రీనివాసరావు తెలిపారు. దేశంలో కుల అసమానతలకు హిందూత్వ సిద్ధాంతమే కారణమని, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను చీల్చి చెండాడాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘ్ పరివార్ శక్తులు దేవుడి పేరుతో రాజకీయ వ్యాపారం చేస్తున్నారన్నారు. డిసిఎంఎం, కెవిపిఎస్ కారణంగా చిత్తూరు జిల్లాలో 'మహా భారతం' కార్యక్రమంలో ఈసారి దళితులు పాల్గొంటున్నారన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై జరుగుతున్న దాడుల్ని ఆయన ఖండించారు. దళితులు, మైనారిటీలపై బిజెపి ప్రజా ప్రతినిధులు ఇష్టమొచ్చినట్టు అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

ముద్రగడ అరెస్టు

వెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులు పాదయాత్రను అనుసరిస్తూ వస్తున్న తరుణంలో యువకులు నినాదాలు, వాహనాల సైరన్‌లతో గందరగోళం నెలకొంది. ముద్రగడ తన అనుచరులతో మూడు కిలోమీటర్ల పాదయాత్ర సాగించారు. ముద్రగడ పాదయాత్ర తమ గ్రామానికి ఎప్పుడు వస్తుందా అంటూ మహిళలు హారతులతో ఎదురుచూశారు. రాజుపాలెం, కొత్తూరు జంక్షన్ వద్ద మహిళలు, ప్రజలు పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. కిర్లంపూడి మండలం వీరవరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ముద్రగడను అరెస్టు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలపడంతో స్వచ్ఛందంగా అరెస్టవుతున్నట్లు ముద్రగడ తెలిపారు. ముద్రగడ అరెస్టుతో ఆయన అనుచరులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ముద్రగడను స్టేషన్‌కు తరలించే క్రమంలో పోలీసు వాహనాన్ని ఉద్యమకారులు అడుగడుగునా నిలుపు చేశారు. వీరవరం, రామచంద్రపురం, గోనేడ, పాలెం గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద దుంగలువేసి వాటికి నిప్పటించి వాహనాన్ని అడ్డగించారు. రోడ్డుకు అడ్డంగా మహిళలు, యువకులు బైఠాయించారు.

జిల్లా ఎస్‌పిని చుట్టుముట్టిన మహిళలు

కిర్లంపూడి చేరుకున్న జిల్లా ఎస్‌పి విశాల్‌గున్నిని మహిళలు చుట్టుముట్టారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆయన వద్దకు చేరుకుని తమకు ఇస్తామన్న రిజర్వేషన్లు అమలు చేయాలని, లేకుంటే పాదయాత్రకు అనుమతివ్వాలని పట్టుబట్టారు.

పోలీస్ నిబంధనలు ఉల్లఘించిన ముద్రగడపై కేసు : డిజిపి

పోలీసు నిబంధనలు ఉల్లఘించి పాదయాత్ర ప్రారంభించిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై కేసు నమోదు చేస్తున్నామని డిజిపి నండూరి సాంబశివరావు చెప్పారు. ముద్రగడ పాదయాత్రకు తాము అనుమతి ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ పర్యటన కాకినాడలో ఉండటంతో సమయం చూసుకుని పాదయాత్ర చేపట్టారన్నారు. పోలీస్ అధికారులు రెండుచోట్ల కలిసి నిబంధనలు ఉల్లఘించడం మంచిదికాదని చెప్పినప్పటికీ ముందుకెళ్లే ప్రయత్నం చేశారన్నారు. విధుల్లో వున్న పోలీస్ అధికారి ఆదేశాలు ఉల్లఘించటం, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించడం చట్టవిరుద్ధమని అన్నారు. ముద్రగడ పాదయాత్రకు తాము వ్యతిరేకం కాదని, అనుమతి తీసుకోవాలని కోరుతున్నామన్నారు. హింస లేకుండా పాదయాత్ర జరగాలని, గతంలో ముద్రగడ చేసిన యాత్రల్లో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్న దాఖలాలు ఉన్నాయన్నారు. ముద్రగడపై ఇప్పటికే 69 కేసులు ఉన్నాయని, అందులో 65 కేసులపై చార్జిషీట్ దాఖలు చేశామని చెప్పారు.

పెద్దాపురం డిఎస్‌పిపై సస్పెన్షన్ వేటు!

ముద్రగడ పోలీస్ వలయాన్ని చేధించుకుని పాదయాత్ర చేపట్టడం పోలీసుల వైఫల్యమేనని, దీనికి బాధ్యుడిని చేస్తూ పెద్దాపురం డిఎస్‌పి సిహెచ్.రామారావును సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరికొందరిపైనా చర్యలు ఉంటాయని తెలుస్తోంది. జిల్లా ఎస్‌పి విశాల్ గున్నీతోపాటు గతంలో ఇక్కడ పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి రవిప్రకాష్‌ను కిర్లంపూడి పంపించారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ బి.రాజకుమారిని పాదయాత్ర సాగుతున్న ప్రాంతానికి పంపించారు. ముద్రగడ జనసమీకరణ చేస్తున్నట్లు సమాచారం వున్నప్పటికీ ఏమి చేయబోతున్నారో తెలుసుకోలేకపోవడం, బందోబస్తుగా వున్నవారు విధులను సరిగా చేయలేకపోవడం వైఫల్యంగానే పరిగణిస్తున్నట్లు డిజిపి విలేకరుల సమావేశంలో అంగీకరించారు.



బాలకృష్ణ హీరోగా, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'పైసా వసూల్' చిత్రం ఆడియోను ఇటీవల విడుదల చేశారు. ఇది విజయవంతమైన సందర్భంగా చిత్రబృందం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఆడియో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. వేదికపై హీరోయిన్లతో బాలకృష్ణ వేసిన డాన్స్ అలరించింది. ఈ కార్యక్రమంలో కోదండ రామిరెడ్డి, పూరి జగన్నాథ్, మోహన్ బాబు, శ్రియ, బాలకృష్ణ, చార్మి, కైరా దత్, కబీర్ బేడీ తదితరులు పాల్గొన్నారు.



నాగ చైతన్య, లావణ్య త్రిపాఠి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'యుద్ధం శరణం'. కృష్ణ మరిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. వివేక్ సాగర్ బాణీలు సమకూర్చిన ఆ చిత్రం ఆడియోను ఆదివారం రాత్రి విడుదల చేశారు. బిగ్ సీడీని ఎం.ఎం. కీరవాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రానా, నాగ చైతన్య, వివేక్ సాగర్, కృష్ణ మరిముత్తు, రాజమౌళి, సురేష్ బాబు, వంశీ పైడిపల్లి తదితరులు హాజరయ్యారు.



అల్లు అర్జున్

సూర్య యాక్షన్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తోన్న సినిమా 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడుగా పరిచయమవుతున్నాడు. కె. నాగబాబు సమర్పణలో, రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అర్జున్, శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఫిలింసిటిలో ఫైట్‌మాస్టర్స్ రామ్ లక్షణ్ సారథ్యంలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సినిమాను 2018, ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ - శేఖర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

అది నా మైండ్ సెట్ కాదు

- జాక్విలిన్ ఫెర్నాండేజ్



దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి...అనే సామెతను చాలా మంది నటులు ఉపయోగిస్తారు. ముఖ్యంగా కథానాయికలు. ఎందుకంటే వారికి ఎక్కువ ఏళ్ల పాటు అవకాశాలు ఉండవు. ఐదారేళ్లు కంటే రాణించినా డిమాండ్ ఉన్నప్పుడున్న ఆఫర్లు మాత్ర రావు. అందుకే ఉన్న రెండుమూడేళ్లలోనే ఎక్కువ సినిమాలు చేసేందుకు యత్నిస్తుంటారు. ఇంతకీ విషయం ఏమిటంటే.. జాక్విలిన్ ఫెర్నాండేజ్ బాలీవుడ్‌లో క్రేజ్ ఉన్న కథానాయిక. ఇప్పుడు సినిమాలతో బిజీగా ఉండొచ్చు. కానీ జాక్విలిన్ మాత్రం కాస్త భిన్నం. ఒక సినిమా అయిన తర్వాత మరొకటి చేస్తూ ఉంటుంది. లేదంటే రెండేసి సినిమాలను మాత్రమే అంగీకరిస్తుంది. తనకు ఇప్పుడు ఫుల్‌క్రేజ్ ఉంది కదా అని ఎడాపెడా సినిమాలు చేసుకోవాలని తన స్నేహితులు చాలా మంది సలహా ఇస్తున్నారట. దానిపై ఆమె స్పందించింది. తనది అటువంటి మైండ్ సెట్ కాదని, నటన పరంగా తనేంటో నిరూపించుకోవడానికి వచ్చేనే తప్పా చేతి నిండా ప్రాజెక్టులను ఒప్పేసుకుని తీరిక లేకుండా ఉండాలనుకోవడం లేదు అని పేర్కొంది. " నేను, నా ఆలోచనలు పూర్తిగా భిన్నం. ఒక నటిగా నా పని నేను చేస్తున్నాను. నా పనిని ఎవరూ జడ్జ్ చేయలేరు. ఇది ప్రయాణం అంతే. నేనేదైతే ఎంపిక చేసుకుంటున్నానో దానికి న్యాయం చేస్తున్నాను" అని చెప్పింది జాక్విలిన్. చిత్రసీమలో మంచి అభిరుచి, కష్టపడేతత్వమే ముందుకు తీసుకెళ్లగలవని, అవే జీవితాన్ని నిర్దేశిస్తాయని తాను నమ్ముతున్నట్టు స్పష్టం చేసింది. బయట నుంచి వచ్చిన వారైనా, నటుల పిల్లలైనా కష్టపడాల్సిందేనని తెలిపింది. జాక్విలిన్ హీరోయిన్‌గా చేసిన 'ఏ జెంటిల్‌మన్' చిత్రం విడుదలైంది. తరుణ్ మన్సుఖ్కి దర్శకత్వంలో రూపొందుతోన్న 'డ్రైవ్'లో నటిస్తోంది.

ప్రేమకు 'దర్పణం'



తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్

తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'దర్పణం'. వి. రామకృష్ణ దర్శకత్వంలో వి.ప్రవీణ్ కుమార్ యాదవ్ (వెంకట్ యాదవ్) నిర్మిస్తున్నారు. రామానాయుడు స్టూడియోలో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పూజా కార్యక్రమాలు చిన శ్రీశైలం యాదవ్ నిర్వహించగా, పరుచూరి వెంకటేశ్వరరావు మొదటి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. దర్శకుడు ఎన్. శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు.చిత్ర నిర్మాత ప్రవీణ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 'ఇది నా మొదటి చిత్రం. దర్శకుడు రామకృష్ణ కథ చెప్పిన విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. మంచి ప్రేమకథ. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమాను పూర్తి చేయనున్నాం' అన్నారు.

'2.0' తెలుగు హక్కులు రూ.81 కోట్లు



రజనీ కాంత్

రజనీ కాంత్ హీరోగా, అక్షయ్ కుమార్ ప్రతినాయకుడిగా చేస్తోన్న సైన్స్‌ఫిక్షన్ మూవీ '2.0'. రోబోకు సీక్వెల్ చిత్రమిది. ఈ సినిమాను వచ్చే జనవరి 25వ తేదీన విడుదల చేయబోతున్నారు. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించి ఈ సినిమా రైట్స్‌ను లైకా ప్రొడక్షన్ నుంచి గ్లోబల్ సినిమా కొనుగోలు చేసింది. అదీ భారీ మొత్తంలో అమౌంట్ చెల్లించింది. 'బాహుబలి' ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే రూ.198 కోట్లు కలెక్ట్ చేసింది. దాన్ని దృష్టిలో ఉంచుకుని '2.0'కు రూ. 81 కోట్లు చెల్లించి తెలుగు హక్కులు సొంతం చేసుకుంది. ఇది సరికొత్త రికార్డుగా చెప్పవచ్చు. 2010లో వచ్చిన 'రోబో' చిత్రానికి మాత్రం కేవలం రూ. 27 కోట్లతో తెలుగు హక్కులను పొందారు. ఇప్పుడు దీని సీక్వెల్‌కు మూడింతలు ఎక్కువగా పెట్టి రైట్స్‌ను కొనుగోలు చేశారు.

వలపు సౌధం



సాయి కిరణ్, ప్రాచి అధికారి

సాయికిరణ్, ప్రాచి అధికారి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'వలపు సౌధం'. మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తుల్జా భవాని ఫిలింస్ పతాకంపై పి.విజయ శేఖర్ సమర్పణలో కృష్ణమోహన్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ సునీల్‌సాగర్, మజ్ను సౌరబ్ నిర్మిస్తున్న చిత్రమిది. షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఈ చిత్రం ఆడియోని త్వరలో విడుదల చేసి చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. లవ్ అండ్ హార్రర్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించామని, ఈ చిత్రంలో ఏడు పాటలున్నాయని, నూతన సంగీత దర్శకుడు ఎస్.కె.మజ్ను స్వరపరచిన పాటలు శ్రోతలను అలరిస్తాయని నిర్మాత తెలిపారు.

కొత్తవారు... గొప్ప కథలు



ప్రియాంక చోప్రా

" గొప్ప కథలు నిర్మించాలి..ప్రతిభావంతులైన కొత్తవారికి ప్లాట్‌ఫారమ్ ఇచ్చి వారి కలలను నిజం చేయాలి. ఓ నిర్మాతగా అదే లక్ష్యం" అని గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా పేర్కొంది. పర్పుల్ పెబెల్ పిక్చర్స్ బ్యానర్‌లో ప్రియాంక నిర్మాతగా ప్రాంతీయ చిత్రాలను నిర్మిస్తోంది. ఒక పక్క హాలీవుడ్ చిత్రాలు, క్వాంటికో అమెరికన్ టీవీ సిరీస్‌లో నటిస్తూనే మరో పక్క నిర్మాతగా బాధ్యతలను చూస్తోంది. ఇప్పటికే ఐదు చిత్రాలను నిర్మించింది. గత ఏడాది మరాఠీలో చేసిన 'వెంటిలేటర్'కు జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు వరించింది. ఇప్పుడు 'పహునా' (బుల్లి సందర్శకులు) తీస్తోంది. ఇది నేపాల్‌లో మావోయిస్టుల ఆందోళనలు జరుగుతున్న సమయంలో కొందరు తల్లులు, పిల్లలు వేరైపోయి ఆ దేశం వదిలేసి మన దేశంలో సిక్కిం రాష్ట్రానికి వచ్చేశారు. అలా ఆ సమయంలో తల్లిదండ్రుల నుంచి వేరైపోయిన ఇద్దరు చిన్నారుల కథే ఈ చిత్రం. ఈ సినిమాను వచ్చే నెల ఏడో తేదీన జరగనున్న 42వ టొరొంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్(టీఐఎఫ్ఎఫ్)లో ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రాన్ని పాఖీ తైరేవాలా దర్శకత్వం

ఎవరి 'ఇగో' వారిది

వికెఎ ఫిలిమ్స్ నిర్మిస్తున్న చిత్రం 'ఇగో'. విజయ్ కరణ్-కౌసల్ కరణ్-అనిల్ కరణ్ నిర్మిస్తున్నారు. ఆశిష్ రాజ్-సిమ్రాన్ లు జంటగా నటిస్తున్నారు. ఈ నవతరం ప్రేమకథకు సుబ్రమణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలె రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకొన్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ కోసం గోదావరి పరిసర ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ రోమాంటిక్ సస్పెన్స్ ఎంటర్ టైనర్‌గా రూపొందిస్తున్నామని నిర్మాతలు తెలిపారు త్వరలోనే ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేయనున్నామని దర్శకుడు అన్నారు.



ఆశిష్ రాజ్ సిమ్రాన్

రూపాయి

భవిష్యత్తు ఆర్థిక అవసరాల నిమిత్తం కేవలం పొదుపు ఒక్కటి చేయడమే సరిపోదు. పొదుపు పేరుతో దాచిపెట్టిన మొత్తం.. సరైన మార్గంలోనే పొదుపు చేస్తున్నామా? లేదా? అనేది చాలా ముఖ్యం. ఇంతటి కీలకమైన పెట్టుబడి విషయంలో మనం అనేక తప్పులు చేస్తుంటాం. సాధారణంగా చేసే ఆర్థిక పొరపాట్లు... వాటిని సరిదిద్దుకునేందుకు ఏం చేయాలో తెలుసుకున్నప్పుడే ఆర్థికంగా ఉన్నతస్థితి సాధ్యమవుతుంది.

అందుకే ఏఏ మార్గాల్లో పొదుపు చేయాలి, ఎక్కడ పెట్టుబడులు పెట్టాలి..? ఆయా విషయాలు ఈ వారం రూపాయి కథనలో తెలుసుకుందాం!!



పొదుపులో ఆచితూచి



పొదుపులో ప్రతిఒక్కరి జీవితంలో ఒక్కో దశలో ఒక్కో ఆర్థిక లక్ష్యాలుంటాయి. ఆ లక్ష్యాల సాధనకు వేర్వేరు పథకాలు అందుబాటులో ఉంటాయి. వీటిలో ఏవి ఎప్పుడు ఎంచుకోవాలి? వేటికి ఎప్పుడు దూరంగా ఉండాలనే విషయం చాలా ముఖ్యం. ఏదైనా పొరపాటు నిర్ణయం తీసుకుంటే సాధ్యమైనంత వేగంగా దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

పన్ను ఆదా విషయంలో

ఈరోజుల్లో పన్ను చెల్లించడం, పన్ను ఆదా చేయడం అనేది సర్వసాధారణ విషయంగా మారింది. చిరుద్యోగులు మొదలుకుని, చిరువ్యాపారుల వరకూ పన్ను భారం భరించాల్సి వస్తుంది. కొంతమంది పన్ను ఆదా చేసుకోవడానికి ఏదో ఒక పథకంలో పెట్టుబడి పెడుతుంటారు. ఈ సమయంలో బీమా పాలసీలు, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఎక్కువగా మదుపు చేస్తారు. స్నేహితులు, బంధువులు, తెలిసినవారిలో ఒకరో ఇద్దరో బీమా సలహాదారులు తప్పకుండా ఉంటారు. మన గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులు కాబట్టి, సరైన పాలసీనే ఇస్తారని మనమూ భావిస్తాం. ఫలానా పాలసీ అచ్చంగా మీ కోసమే వచ్చింది అన్నట్లు మభ్యపెట్టి పాలసీని అంటగట్టేస్తారు. నమ్ముతాం కాబట్టి,



వారు చెప్పిన విషయాన్ని కాదనలేం. జీవిత బీమా పాలసీల విషయంలో చాలామటుకు జరిగేది ఇదే. అయితే, అందరూ ఇలాగే ఉంటారని ఇక్కడ చెప్పడం లేదు. మీ బీమా సలహాదారు ఒకే పాలసీ గురించి మిమ్మల్ని ఒత్తిడి చేస్తే మాత్రం అనుమానించాల్సిందే. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. బీమా సలహాదారుడు తన సంస్థ తరఫున మీకు పాలసీని విక్రయిస్తున్నాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ మిమ్మల్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండడు. అంతమాత్రాన మీరు మొహ మాటంతో, ఏదో ఒకటి తీసుకునేదేగా అని అనుకున్నారో... మంచి పాలసీని ఎంచు కునే అవకాశాన్ని కోల్పోయినట్లే. తర్వాత మిమ్మల్ని మీరు నిందించుకున్నా, సలహాదారుడిని అన్నా ఫలితం మాత్రం ఉండదు. అందుకే సంబంధించిన పథకాల విషయంలో అనుభవంగల వ్యక్తి సలహా, సూచన, వ్యక్తిగతంగా అధ్యయనం చేయడం మంచిది.



ఉచిత సలహాలైతే.. ఆచీతూచీ

ఒకరు ఏదైనా పాలసీ తీసుకున్నామనో, ఒక పథకంలో మదుపు చేశారనో చెప్పగానే మనం తొందరపడకూడదు. అసలు అందులో ఉన్న విషయం ఏమిటి? మన ఆర్థిక పరిస్థితికి అది నప్పుతుందా? పరిశీలించాలి. అందుకే ఉచితంగా దొరికే ఇలాంటి సలహాలను వినగానే దానికి సంబంధించి సొంత పరిశోధన చేయాలి. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకోవాలి. అవసరమైతే ఆయా సంస్థల సేవాకేంద్రాలకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోవాలి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

ఒక్కో సమయంలో ఒక్కో పథకం మంచి ఫలితాలను ఇస్తుంది. అంతమాత్రాన అది మనకు మంచి పథకం కాకపోవచ్చు.

ఏదో ఒక పథకమేగా అనుకోవద్దు

ఒక పెట్టుబడి పథకాన్ని ఎంచుకునేముందు మన లక్ష్యం, ఇచ్చే వ్యవధి విషయంలో ఒక స్పష్టత ఉండాలి. ఉదాహరణకు మీరు ఆరునెలల పాటు ఏదైనా మదుపు చేయాలనుకున్నారు. దీనికోసం ఎక్కువ నష్టభయం ఉన్న మిడ్/స్మాల్ క్యాప్ ఫండ్లను ఎంచుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. దీనికి సరిపోయే ఫండ్లు షార్ట్, అల్ట్రాషార్ట్ డెట్ ఫండ్లలో మదుపు చేయడమే సరైంది. కాబట్టి, మదుపు చేసేప్పుడు అందుబాటులో ఉన్న పథకం కాకుండా.. నిజంగా అవసరం ఏమిటి? అనేదాని ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి.

ఏదైనా పథకంలో మదుపు చేసేముందు మనం ఆలోచించే విషయం రాబడి ఎంతొస్తుంది? అని. 10, 12, 15శాతం అనగానే మనం కొద్దిగా ఆకర్షితులం అవుతాం. ఈ పథకాలు గతంలో ఇంత రాబడిని అందించాయని, అందువల్ల భవిష్యత్తులోనూ ఇదే విధంగా ఇస్తాయని ఆశిస్తాం. ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి ఆ పథకం అందించిన రాబడి ఒక్కటే ప్రామాణికమా? ఎంతమాత్రం కాదు. ఫండ్ మేనేజర్ శక్తి సామర్థ్యాలు, పన్ను ప్రయోజనాలు, వెంటనే నగదుగా మార్చుకునే వీలు, నష్టభయం ఇలాంటి ఎన్నో విషయాలను తెలుసుకోవాలి. ముందుగానే ఆ పథకంలో ఉండే లాభనష్టాలు తెలుసుకోవడం వల్ల విలువైన కాలం వృథా కాదు.

ఒకేచోట పొదుపు వద్దు!

చాలామంది ఒకే పథకంలో మదుపు చేస్తుంటారు. ఇది పెద్దపొరపాటే. వైవిధ్యానికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వాలనే ప్రశ్న ఇక్కడ రావచ్చు. మీ లక్ష్యాల సాధనకు మీరు కట్టుబడి ఉన్నప్పుడు... కొంత అధిక రాబడి వచ్చేలా, కొంత సురక్షితంగా ఉండేలా పెట్టుబడులను చూసుకోవాలి. అప్పుడే దీర్ఘకాలంలో ప్రయోజనం సిద్ధిస్తుంది.

పొదుపు.. ఒక సహనం

పొదుపు చేయడం, పెట్టుబడులు పెట్టడం వంటి విషయాల్లో చాలా సహనం అవసరం. తొందరపడటం వల్ల చాలా సందర్భాల్లో నష్టమే తప్ప లాభం ఉండదు. పెట్టుబడులకూ ఇది వర్తిస్తుంది. కొన్ని పెట్టుబడులు ఎంత దీర్ఘకాలంగా కొనసాగిస్తే అంత మంచి రాబడిని అందిస్తాయి. అయితే, చాలామంది పెట్టుబడుల విషయంలో చేసే పొరపాటేమిటంటే.. ఏ మాత్రం ఓపిక పట్టకపోవడం. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు లేదా ఇతర పెట్టుబడి పథకంలోనైనా కొనుగోలు చేసిన ధరకంటే కొద్దిగా తగ్గిందా? వెంటనే అమ్మేద్దామని సిద్ధమవుతారు. ఇలా అనుకోవడం మంచిది కాదు. కాస్త ఓపిక పడితే.. మీరు వూహించిన రాబడిని అందుకోవచ్చు.

సంప్రదాయ పథకాలతోపాటు

నష్టభయం భరించే శక్తి అందరికీ ఉండదు. అయితే, ఇప్పుడిప్పుడే ఆర్జన మొదలు పెట్టినవారు ఇందుకు భిన్నం. బాధ్యతల బరువులు లేనప్పుడు కొంత నష్టం వచ్చినా తట్టుకునే శక్తి ఉంటుంది. ఇలాంటివారు కూడా సురక్షిత పెట్టుబడి మార్గాలనే ఎంచుకుంటే దీర్ఘకాలంలో తమకున్న లక్ష్యాలను సాధించడం కష్టమే. సంప్రదాయ పథకాల్లో పన్ను చెల్లించాక ఇంత రాబడి ఆశించడం కష్టమే. వివాహం, పిల్లలు, వారి చదువులు, సొంతిల్లు, పిల్లల వివాహాలు, పదవీ విరమణ ప్రణాళికలు ఇలా అన్నీ దీర్ఘకాలిక లక్ష్యాలే ఉంటాయి కాబట్టి, కనీసం పదేళ్లకు తక్కువ కాకుండా వ్యవధితో ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాల్లో మదుపు చేయడం యువతకు ఎంతో ఉత్తమం.


-వి.చైతన్య



వానాకాలంలో..వాహన బీమా!

వానకాలంలో టు, ఫోర్ వీలర్ వాహనాలతో ఎక్కువ సమస్యలు వస్తుంటాయి. సాధారణంగా వాహనాలకు ప్రమాదబీమా చేయించడం సర్వసాధారణం. అయితే వర్షాకాలంలో అనుకోకుండా వాహనం ప్రమాదంలో చిక్కుకుంటే.. బీమా పొందడానికి కొన్ని నియమాలు, నిబంధనలు పాటించాల్సిందే.

కొన్ని గ్యారేజీలకు బీమా సంస్థతో ఒప్పందం ఉంటుంది. అక్కడ మరమ్మతు చేయిస్తే మీరు చేతి నుంచి డబ్బు పెట్టక్కర్లేదు. అంటే నగదు రహిత మరమ్మతు అన్నమాట. బీమా సంస్థ వెబ్‌సైట్లలోనూ ఈ వివరాలు లభిస్తాయి. లేదంటే వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే సరిపోతుంది. అయితే, దీనికన్నా ముందు మీరు బీమా క్లెయిం ఫారం, పాలసీ కాపీ, వాహన రిజిస్ట్రేషన్ ఒరిజినల్‌కాపీ, డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. వాహనం వల్ల ఇతరులకు నష్టం వాటిల్లినప్పుడు పోలీస్ ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) కూడా అవసరమవుతుంది. వీటన్నింటితో వాహనాన్ని తిరిగి సిద్ధం చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో గ్యారేజీ నుంచి అంచనా పత్రాన్నీ తీసుకోవాలి. వాహన బీమాను క్లెయిం చేసుకోవడానికి ఇవన్నీ తప్పనిసరిగా కావాల్సిన పత్రాలలేనన్న సంగతిని మర్చిపోవద్దు. వీలైనంత వరకూ క్లెయిం ఫారాన్ని స్వయంగా నింపడం మంచిది. ★



'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయా లపై మీరూ మీ అనుభ వాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవై నా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

వజ్రాలమూట – 1

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్ 94410 73755)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్ 98492 27509)



గుర్తించండి!

పిల్లలూ.! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలు వాటి పేర్లు ఉన్నాయి. వాటిని అక్షరాల బాక్సుల్లో గుర్తించండి!

raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log

b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పొదుపు కథ



ఒక స్తంభానికి నలుగురు దొంగలు ఏమిటది?

జోక్ :

డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ మందుల షాపువాడికి ఇచ్చి 'ఇందులో రాసిన మందు సీసాలు రెండివ్వండి' అని అడిగాడు వాసు.

షాపువాడు : "రెండెందుకండీ?'

వాసు : 'ఈ సీసాలోని మందు నిద్రపోయేముందు తాగమన్నారు. ఒకటేమో ఇంట్లోకి, రెండోది ఆఫీసులోకి..'

షాపువాడు : ఆ ..!!??

వేగంగా పరిగెత్తే జంతువు?



పిల్లలూ..! భూమి మీద నివసించే ప్రాణులలో అత్యంత వేగంగా పరిగెత్తే జంతువు ఏమిటో తెలుసా? అదే పిల్లలూ చిరుతపులి. ఇది గంటకు 70 మైళ్ల వేగంతో పరిగెత్తగలదు. చిరుతపులి తర్వాత వేగంగా పరిగెత్తగలిగింది మనదేశంలో నివసించే బ్లాక్‌బక్ అనే లేడి. ఇది గంటకు 65 మైళ్ల వేగంతో పరిగెత్తగలదు. మంగోలియన గజెల్, ఫ్రాంగ్ హర్న్ అనే జాతి లేళ్లు గంటకు 60 మైళ్ల వేగంతో పరిగెత్తగలవు. సింహం తన ఆహారాన్ని, శత్రువుని వెంబడించడానికి గంటకు 50 మైళ్ల వేగంతో పరిగెత్తగలదు. అయితే ఎల్లప్పుడూ సింహం ఇదే వేగంతో పరిగెత్తలేదు. అంతేగాక సింహం ఈ వేగంతో ఎక్కువ దూరం పరిగెత్తలేదు. త్వరగా అలసిపోతుంది. మామూలుగా మనం చూసే సాధారణ జాతి లేళ్లు అత్యంత వేగంగా పరిగెత్తగలవు అనుకుంటాం. కానీ వీటి వేగం గంటకు 45 నుంచి 50 మైళ్లు మాత్రమే. పందెపు గుర్రాలు గంటకు 45–50 మైళ్లు పరిగెత్తగలవు. వేటకుక్కలు అత్యంత వేగంగా పరిగెత్తినట్టు కనబడినా ఇవి గంటకు 35–40 మైళ్లు మాత్రమే పరిగెడతాయి. కుందేళ్లు గంటకు 40–45 మైళ్ల వేగంతో పరిగెత్తుతాయి. జంతువుల పరుగు వేగాన్ని లెక్కించడానికి మనిషి దానిమీద స్వారీ చేస్తూ లేదా దాన్ని తరుముతూ వెళ్లడం కష్టం. అందువల్ల వాటిని కారులో వెంబడిస్తూ స్పీడో మీటరు చూపించే వేగాన్నిగానీ, స్టాప్‌వాచ్ చూపించే సమయాన్నిగానీ కొలుస్తారు. ★



రజతం సాధించిన సింధూ

- హోరాహోరీగా సాగిన ఫైనల్
- ఆకట్టుకున్న తెలుగుతేజం పోరాటం
- భారత్‌కు 2 పతకాలు



గ్లాస్గో : ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన పివి సింధూ రజతంతో సరిపెట్టుకుంది. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో సింధూపై జపాన్‌కు చెందిన నొజోమి ఒకుహర 21-19, 20-22, 22-20 పాయింట్లతో విజయం సాధించి స్వర్ణం గెలుచుకుంది. అయితే ఈ మ్యాచ్‌లో సింధూ అద్భుత పోరాట ప్రతిభను ప్రదర్శించింది. స్వర్ణం కోల్పోయినా కోట్లాది మంది భారతీయుల హృదయాలను వశం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌లో సింధూ ఓడినా, రెండో సెట్‌ను గెలుచుకుంది. దీంతో మూడో సెట్ నిర్ణయాత్మకంగా మారింది. ఈ సెట్‌లో సింధూ-ఒకుహర హోరాహోరీ తలపడ్డారు. మూడో సెట్ అనుక్షణం అధిక్యం మారుతూ ఉత్కంఠ రేపింది. ఈ మూడో సెట్‌లో ఒకుహర ముందుగా బోణీ చేసింది. సింధూ ఒక్క పాయింట్ సాధించే సరికి ఒకుహర 4 పాయింట్లు సాధించింది. అయితే 5 పాయింట్లు దగ్గర స్కోరును సింధూ సమం చేసింది. ఇక్కడ బ్యాడ్మింటన్‌లో అసలు మాజా ప్రారంభమయింది. స్కోరు ఒక్కరూ పోటాపోటీగా పాయింట్లు సాధించారు. దీంతో స్కోరు 6-6, 9-9, 11-11, 13-13, 15-15, 17-17, 19-19, 20-20గా మారుతూ పోయింది. అయితే దశలో సింధూ సర్వీస్‌ను కోల్పోయింది. దీంతో తరువాత సరీస్వ్‌లో రెండు పాయింట్లు గెలుచుకున్న ఒకుహర మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. సింధూ రజితంతో సరిపెట్టుకుంది. గత ఏడాది రియో ఒలింపిక్స్ ఫైనల్‌ల్లోనూ ఒకుహర చేతిలోనే సింధూ పరాజయం చవిచూసింది. కాగా, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ రజతం సాధించడం ఇది రెండో సారి. 2015లో సైనా నెహ్వాల్ రజతం గెలుచుకుంది.



పతకాలతో నొజోమి ఒకుహర, సింధూ, సైనా

ఈ చాంపియన్‌షిప్‌ల్లో 2013, 2014లో సింధూ కాంస్య పతకాలు సాధించింది. ఈ టోర్నిలో సింధూకు ఇది మూడో పతకం. ఈ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఓడినా అది సింధూ శక్తి చాలక పొరపాటు చేయడం వలన ఒకుహర నెగ్గింది. ఏది ఏమైనా ఈ సారి పతకం రంగు మార్చుకుంటానన్న తన మాటను సింధూ నిలబెట్టుకుంది. సెమీస్‌లోనూ సింధూ చైనాకు చెందిన చెన్ యుఫీ వరస సెట్లలో విజయం సాధించింది. 21-13, 21-10 స్కోరుతో విజయం సాధించింది. తనదైన షాట్లతో చెలరేగిన సింధూ కేవలం 48 నిమిషాల్లోనే సెమీస్‌ను ముగించింది. కాగా, ప్రస్తుత చాంపియన్‌షిప్‌లో మరో భారత క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కాంస్యం సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఒకేసారి రెండు పతకాలు సాధించడం భారత్‌కు ఇదే మొదటిసారి. అలాగే 40 ఏళ్ల భారత బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్ ఇప్పటి వరకూ గెలిచిన పతకాలు ఐదే. ఇప్పుడు ఒకేసారి రెండు పతకాలతో భారత్ బృందం స్వదేశానికి తిరిగిరానుంది.

సింధూ, సైనాలకు రాష్ట్రపతి శుభాకాంక్షలు

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి రెండు పతకాలు సాధించిన భారత క్రీడాకారిణులు సింధూ, సైనాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభినందించారు. వీరి విజయాలకు దేశం గర్విస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ కూడా వీరి అభినందించారు. కాగా, చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన సింధూ, కాంస్యం సాధించిన సైనాకు భారత బ్యాడ్మింటన్ సమాఖ్య నజరానాలను ప్రకటించింది. సింధూకు రూ 10. లక్షలు, సైనాకు రూ. 5 లక్షలు అందచేస్తామని సమాఖ్య అధ్యక్షుడు హిమాంత బి శర్మ తెలిపారు.

మేవెదర్ @50 విజయాలు



లాస్ వేగాస్ : అమెరికా స్టార్ బాక్సర్ ఫ్లాయిడ్ మేవెదర్ బాక్సింగ్ చరిత్రలో సరికొత్త చరిత్ర లిఖించాడు. అజేయంగా 50 మ్యాచ్‌లు గెలిచిన తొలి బాక్సర్‌గా రికార్డు సృష్టించాడు. ఐర్లాండ్‌కు చెందిన కానర్ మెక్ గ్రెగర్‌తో జరిగిన సూపర్ వెల్టర్‌వెయిట్ బౌట్‌లో మేవెదర్ విజేతగా నిలిచాడు. రూ. 1700 కోట్ల మెగా ఫైట్‌లో పైచేయి సాధించాడు. 40 ఏళ్ల మేవెదర్ కానర్ మెక్ గ్రెగర్‌తో జరిగిన 10 రౌండ్ల బౌట్‌లో మేవెదర్ విజయం సాధించాడు. విజయం సాధించిన వెంటనే మేవెదర్ రోప్స్‌లోకి దూకి ప్రేక్షకులతో ఆనందం పంచుకన్నాడు. అయితే ప్రత్యర్థి గ్రెగర్‌ను మేవెదర్ ప్రశంసలతో ముంచెత్తాడు. 'అతను నాకంటే కొంచె మెరుగు అని అనుకుంటున్నాను' అని బౌట్ అనంతరం మేవెదర్ వ్యాఖ్యానించాడు. 'అతను చాలా విభిన్నమైన యాంగిల్స్ ఉపయోగించాడు. అతను గట్టి పోటీదారుడు. అయితే ఈ రాత్రి నేను విజయం సాధించాను' అని మేవెదర్ అన్నాడు. కాగా, ఈ మ్యాచ్‌కు ముందు కూడా మెక్‌గ్రెగర్‌పై భారీ అంచనాలు వున్నాయి. కానీ అనుభవజ్ఞుడైన మేవెదర్ చివరికి విజయం సాధించాడు. రెండేళ్ల క్రితం పకియాతో జరిగిన 'బిగ్ ఫైట్' అనంతరం మేవెదర్ బాక్సింగ్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ మనసు మార్చుకుని మెక్ గ్రెగర్‌తో బౌట్‌కు సిద్ధమయ్యాడు. లాస్‌వేగాస్‌లోని టీ మొబైల్ ఎరీనాలో భారత కాలమాన ప్రకారం ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ బౌట్ జరిగింది. ఈ విజయంతో మేవెదర్‌కు సుమారు రూ. 1200 కోట్లు లభించగా, మెక్ గ్రెగర్‌కు సుమారు రూ. 400 కోట్లు లభించాయి.

నేటి నుంచే యుఎస్ ఓపెన్

గాయంతో తప్పుకున్న ఆండీ ముర్రే

న్యూయార్క్ : ప్రతిష్టాత్మక యుఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నీ సోమవారం ప్రారంభంకానుంది. ప్రపంచ నంబర్‌టూ, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే గాయం కారణంగా ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటి వరకూ మూడు గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సాధించిన ముర్రే తన తొలి గ్రాండ్‌స్లామ్‌ను 2012లో ఇక్కడే సాధించాడు. గత నెలలో జరిగిన వింబుల్డన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌లో దశ నుంచి ముర్రే నిష్క్రమించాడు. జూన్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో స్టాన్ వావ్రింకాతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ముర్రే గాయపడ్డాడు. అప్పటి నుంచి ముర్రే గాయంతో బాధపడుతున్నాడు. 'గాయం తీవ్రత ఇంకా తగ్గలేదు. దుర్భష్టవశాత్తూ ఈ ఏడాది యుఎస్ ఓపెన్‌లో నేను పాల్గొనడం లేదు' అని ముర్రే ప్రకటించాడు. కాగా, ఈ టోర్నీ నుంచి తప్పుకున్న ఐదో ప్రముఖ ఆటగాడు ఆండీ ముర్రే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో వున్న నోవాక్ జకోవిచ్, స్టాన్ వావ్రింకా, కే నిషికోరి, మిలోస్ రోనిక్ కూడా ఇప్పటికే గాయం కారణంగా ఈ ఏడాది యుఎస్ ఓపెన్ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో రఫెల్ నాదెల్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. కాగా, మహిళ సింగిల్స్‌లో టాప్ స్టార్ సెరెనా విలియమ్స్ కూడా ఈ టోర్నీకి దూరంగా వుంది. సెరెనా త్వరలో ఒక బిడ్డకు జన్మనివ్వనుంది. సెరెనా విలియమ్స్ దూరంగా వుండటంతో ఈ ఏడాది మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకుంటారో అని అంతా అసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ విభాగంలో చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ప్లిస్కోవా టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. కరోలినాతో పాటు సైమోనా హలెప్, ముగురుజ, కెర్బర్, జోహన కొంటా, వీనస్ విలియమ్స్.. తదితరులు టైటిల్‌పై కన్నేశారు. అలాగే రష్యా క్రీడాకారిణి మరియా షరపోవా వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగుతోంది. 2016 ఆస్ట్రేలియా ఓపెన్‌లో డోపింగ్ టెస్టులో దొరికిన తరువాత షరపోవా పాల్గొంటున్న తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఇదే. ఈ టోర్నీలో షరపోవా ఏ విధంగా సత్తా చాటుతుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మనోజ్ కుమార్, కవిందర్ విజయాలు

న్యూఢిల్లీ : హంబర్గ్‌లో జరుగుతున్న 19వ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజున భారత్‌కు చెందిన మనోజ్‌కుమార్, కవిందర్ బిస్త్‌లు తమ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. ఆదివారం 69 కేజీలు విభాగంలో మోల్డోవన్ విసిల్లిపై మనోజ్ 3-2తో విజయం సాధించగా, 52 కేజీల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన ర్యుసయి బాబాపై 3-2తో కవిందర్ విజయం సాధించాడు. అయితే 91 కేజీల విభాగంలో భారత్‌కు చెందిన సతీష్ కుమార్ విజయం సాధించాడు. సతీష్‌పై 5-0 స్కోరుతో మహమ్మదుసుల్ మజిదోవ్ విజయం సాధించాడు. కాగా, ఈ టోర్నీలో ప్రారంభమైన రోజైన శనివారం భారత్‌కు చెందిన అమిత్ పంగల్ 49 కేజీల విభాగంలో ఫెడెరిస్కో సెర్రాపై విజయం సాధించాడు.

రో'హిట్'తో వన్డే సిరిస్ భారత్ కైవసం

- సెంచరీతో ఆదుకున్న రోహిత్ శర్మ
- అర్ధసెంచరీతో రాణించిన ధోని

పల్లెకెలె : శ్రీలంక పర్యటనలో భాగంగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరిస్‌ను భారత్ ఇంకా రెండు వన్డేలు మిగిలి ఉండగానే 3-0తో గెలుచు కుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన శ్రీలంక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 217 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం 218 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 44 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసిన దశలో సహనం కోల్పోయిన శ్రీలంక ప్రేక్షకులు బాటిల్స్, వ్యర్థ పదార్థాలను గ్రౌండ్‌లోకి విసిరి మ్యాచ్‌కు అంతరాయం కలిగించారు. వివాదం సద్దుమణిగిన అనంతరం మ్యాచ్ పున: ప్రారంభమయింది.



అనంతరం భారత్ 45.1 ఓవర్లలో విజయలక్ష్యాన్ని 4 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. రోహిత్ శర్మ 124 పరుగులు, ధోని 67 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టులో తిరిమానే 80, చండిమాల్ 36, సిరివర్ధనే 29 అత్యధిక పరుగులు చేశారు. శ్రీలంక కెప్టెన్ కుపుగేదర కేవలం 14 పరుగులు మాత్రమే చేసి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. భారత బౌలర్లు బుమ్రా 27 పరుగులకు 5 వికెట్లు సాధించాడు. పాండ్యా, అక్షర్‌పటేల్, జాదవ్‌లకు తలా ఒక వికెట్ లభించాయి. 218 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు కేవలం 19 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెన్ ధావన్ 5, కెప్టెన్ కోహ్లీ కేవలం 3 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యారు. కె.ఎల్. రాహుల్ 17 పరుగులు చేసి ధనంజయ బౌలింగ్‌లో తిరిమానేకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. జాదవ్ ధనంజయ బౌలింగ్‌కు డకౌట్ అయ్యాడు. దీంతో భారత్‌జట్టు కేవలం 61 పరుగులకే నాలుగు ప్రధానమైన వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ రోహిత్ శర్మ సెంచరీతో కదంతొక్కి భారత్‌ను గెలిపించాడు. రోహిత్ శర్మకు కీపర్ ధోని అండగా నిలిచాడు. రెండో వన్డే ఓడిపోవాల్సిన దశలో భువనేశ్వర్‌కు తోడుగా నిలిచి గెలిపించిన ధోనీ మరోమారు రోహిత్‌శర్మకు తోడుగా నిలిచి భారత్ సిరిస్ విజయానికి తోడ్పడ్డాడు. ఐదు వికెట్లు తీసిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

నైరుతి బలహీనత వల్లే పిడుగులు

అల్పపీడనం ఏర్పడితే పిడుగులు తగ్గుముఖం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆగస్టులో సహజత్వానికి భిన్నంగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తున్నాయి. ఉదయం ఎండ, మధ్యాహ్నానికి నల్లని మేఘాలు కమ్ముకుని సాయంత్రం పలుచోట్ల భారీవర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల బలహీనత వల్ల పిడుగులు ఎక్కువగా పడుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రోజులు, గంటల తరబడి వర్షం కురుస్తుందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ వివరించారు. నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటే పిడుగులు పడే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నైరుతి పవనాల ప్రభావం లేదన్నారు. ఇటీవల చైనా పరిసరాల్లో ఏర్పడిన తుఫానుకు నైరుతి పవనాలు అటువైపుగా మళ్లాయన్నారు. మళ్లీ అవి తిరిగి రావాలంటే బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా వాయుగుండం వంటివి ఏర్పడాలన్నారు. రెండ్రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. వేసవిని తలపించే ఎండలు, రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం, ద్రోణులు మూలంగా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మేఘాలు 9 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటే పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. పెద్ద చినుకులు, అది కూడా పావుగంట నుంచి గంటలోపు మాత్రమే పడుతుంటాయని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వారం రోజులుగా పడుతున్నవి క్యుములోనింబస్ వర్షాలేనని, అందుకే విజయనగరం, విశాఖ, శ్రీకాకుళంతో పాటు కోస్తాలో పలుచోట్ల విస్తారంగా పిడుగులు పడ్డాయన్నారు. రెండ్రోజుల్లో అల్పపీడనం ఏర్పడితే పిడుగులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

24 గంటల్లో అల్పపీడనం

ఒడిశా-పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో 4.5 కిలోమీటర్ల ఎత్తులో శనివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇది క్రమంగా బలపడుతోందని, 24 గంటల్లో అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు ముఖ్యంగా రాయలసీమలోనూ రుతుపవనాలు తీవ్ర ప్రభావం చూపించనున్నాయని తెలిపింది. వీటి ప్రభావంతో కర్నూలు జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. కోస్తాలోనూ సోమవారం అక్కడక్కడా భారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములు, పిడుగులతో కూడిన ఓ మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. పలాసలో 5.4, గజపతినగరం 4.2, పార్వతీపురం 3.5, మెంటాడ 3.3, బొండపల్లి 3.0, రాపూర్ 2.7, గూడూరు 2.5, కొమరాడ 2.2, అరకువేలీ 2.1, గోనెగండ్ల 8.5, నందవరం 7.3, ఎమ్మిగనూరు 6.9, బనగానపల్లె, కొయిలకుంట్ల 6.3, ఆళ్లగడ్డ 5.4, కర్నూలు 5.3, ఆస్పిరి 5.1, ఓక్, రుద్రవరం , డోర్నపాడు 5.0, ఆత్మకూరు 4.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

గిరిజనుడి హత్య

పజాశక్తి- మెంటాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఆగూరు పంచాయతీ మధుర గిరిజన గ్రామమైన సంగంగుడ్డివలస గ్రామానికి చెందిన గమ్మిల పొట్టయ్య (రాజు) (25) శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. కె.చిన్నయ్య తన కుమారుడు జన్మదిన వేడుకల సందర్భంగా కొర్రాయి లక్ష్మణరావు, గమ్మిల పొట్టయ్యకు సమీపంలోని గూడెంలో శనివారం మద్యం పార్టీ ఇచ్చాడు. అనంతరం గ్రామానికి చేరుకున్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. ఇందులో సెల్ మెమొరీ కార్డు ద్వారా పాటలు వేసుకున్నారు. వేడుకల అనంతరం మెమొరీ కార్డు కనిపించలేదు. అందుకు కొర్రాయి లక్ష్మణరావును బాధ్యుడ్ని చేస్తూ చిన్నయ్య గొడవకు దిగాడు. ఇద్దరు మధ్య ఘర్షణ మొదలైంది. లక్ష్మణరావుపై చిన్నయ్య చేయి చేసుకున్నాడు. లక్ష్మణరావు బావమరిది పొట్టయ్య కలుగజేసుకుని చిన్నయ్యపై ఇరువురు గొడవకు దిగారు. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన చిన్నయ్య కత్తితో పొట్టయ్య ఛాతీపై పొడిచాడు. దీంతో పొట్టయ్య మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని గజపతినగరం సిఐ లీలారావు, ఎస్ఐ భాస్కనరావు పరిశీలించారు. చిన్నయ్యతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఖర్చు తడిసిమోపెడు..!

- అదనపు వ్యయం ఏటా 76.32 కోట్లు
- ఆరోగ్య సేవలు నామమాత్రమే
- అర్బన్ హెల్త్ సెంటర్లపై ప్రయి'వేటు'



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు గతంలో కంటే మెరుగైన వైద్య సేవలు అందిస్తామంటూ పట్టణ ఆరోగ్య కేంద్రాలను (యుహెచ్‌సి) అప్‌గ్రేడ్ చేస్తూ, ప్రభుత్వం వాటి నిర్వహణ బాధ్యత పూర్తిగా ప్రయివేటు సంస్థలకు అప్పగించింది. అయితే ఆ సంస్థలు ప్రజారోగ్యం కంటే వ్యాపారానికే పెద్దపీట వేస్తున్నాయి. రాష్ట్రంలోని 212 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణను ధనుష్ ఇన్ఫోటెక్, అపోలో సంస్థలకు అప్పగించింది. గతంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలను కొన్నింటిని ప్రభుత్వమే నిర్వహించగా మరికొన్నిటిని 2000 సంవత్సరం నుంచి ప్రభుత్వ సహకారంతో రెడ్ క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థలు నిర్వహించేవి. గతంలో యుహెచ్‌సి నిర్వహణ, సిబ్బంది వేతనాలు తదితర ఖర్చులకు అప్పట్లో ఒక్కో కేంద్రానికి నెలకు రూ 1.14 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. కానీ నెలకు రూ 70 వేల నుంచి రూ 80 వేలు మాత్రమే విడు దల చేసేది. ప్రయివేటు సంస్థలకు యుహెచ్‌సిల నిర్వహణ అప్పగించినప్పటి నుంచి ఒక్కో కేంద్రానికి నెలకు దాదాపు రూ 4.20 లక్షలు ఆ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో కంటే ఒక్కో కేంద్రానికి అదనంగా రూ 3 లక్షలు వెచ్చిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 212 యుహెచ్‌సిలకు నెలకు రూ 6.36 కోట్లు, ఏడాదికి రూ 76.32 కోట్లు ప్రభుత్వం అదనంగా ఖర్చు చేస్తోంది.

క్షేత్ర స్థాయి పర్యటనలకు మంగళం

ప్రయివేటు సంస్థలు కేవలం వారి వద్దకు వచ్చిన ఔట్ పేషెంట్లను చూసి, మందులు ఇవ్వడం తప్ప వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించడం లేదు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమాలను చేపట్టడంలేదు. ఆ నిబంధనలను టెండర్లలోనే పేర్కొనలేదు. ఆ సంస్థలు క్షేత్ర స్థాయిలో సిబ్బంది పర్యటనలను నిర్వర్తించడంలేదు. యుహెచ్‌సిలను ప్రయివేటు సంస్థలకు అప్పగించడంతో ప్రజా సేవలు తగ్గడంతోపాటు, ప్రజాధనాన్ని అదనంగా వ్యయం చేస్తున్నారని పలు ప్రజాసంఘాల నేతలు విమర్శిస్తున్నారు. ఆ సంస్థల పనితీరుపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిందంటున్నారు.

టెండర్లలోనూ గోల్‌మాల్

టెలీ మెడిసిన్ సేవలు అందించేందుకు ఎలక్ట్రానిక్ యుహెచ్‌సిలు (ఇ-యుహెచ్‌సి)లను ప్రయివేటు సంస్థలకు అప్పగించే విషయంలో అక్రమాలున్నాయనే విమర్శలూ ఉన్నాయి. ఇ-యుహెచ్‌సిలను నిర్వహించే బాధ్యత ప్రభుత్వం ధనుష్ ఇన్ఫోటెక్ సంస్థకు అప్పగించింది. విశాఖలో 4, విజయవాడలో 4, తిరుపతిలో 2 ఇ-యుహెచ్‌సిలను ఆ సంస్థ ఈ వైద్య ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సెంటర్ల నిర్వహణ చేపట్టాలంటే పది మంది వైద్యులతో కన్సల్టెన్సీ హబ్ నిర్వహించాలి. టెలీ మెడిసిన్ నిర్వహణలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. కాని ధనుష్ ఇన్ఫోటెక్ సంస్థకు నిబంధనల్లో పేర్కొన్న అర్హతలేమీ లేవని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ఆ కంపెనీ అర్హతలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కమిటీని వేసింది. ఇప్పటికీ ఆ కమిటీ నివేదిక జాడ లేదు.

ప్రభుత్వమే యుహెచ్‌సిలను నిర్వహించాలి

సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందాలంటే ప్రభుత్వమే పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్వహించాలి. ఇప్పుడున్న కేంద్రాల్లో కేవలం వెళ్ళిన వారికి నామమాత్రంగా సేవలందించడమే తప్ప వ్యాధి నివారణపై అవగాహన కల్పించడంలేదు. గతంలో యుహెచ్‌సిలో ఆస్పత్రి పరిధి దాటిన రోగులకు ప్రభుత్వ ఆస్పత్రికి పంపి చికిత్స చేయించేవారు. ప్రయివేటుకు కాంట్రాక్ట్ ఇచ్చినప్పటి నుంచి టెలీ మెడిసిన్ పేరుతో కేవలం సలహాలు తీసుకుని జిల్లాలో ఒప్పందం కుదుర్చుకున్న ప్రయివేటు ఆస్పత్రులకు పంపిస్తున్నారు. ప్రజాసేవ కంటే వ్యాపార దృష్టితోనే ఆ ప్రయివేటు సంస్థలు యుహెచ్‌సిలను నిర్వహిస్తున్నాయి.

- ఎ.వి. నాగేశ్వరరావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు

ఆర్ఎంపి వ్యవస్థను తొలగించాలి

జీవో 465ను రద్దు చేయాలి

సిఎంకు ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాన్యుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఆర్ఎంపి, పిఎంపిలకు కంటి తుడుపు శిక్షణిచ్చి సమాజంలోకి వదలాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదిక సభ్యులు లేఖ రాశారు.

2008లో అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో తీసుకొన్న ఈ చట్ట వ్యతిరేక నిర్ణయాన్ని గత తొమ్మిదేళ్ల నుంచి ఐఎంఎ తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల ప్రభుత్వం తన నిర్ణయాన్ని వాయిదా వేసిందన్నారు. మళ్లీ అదే నిర్ణయాన్ని జిఒ 465గా విడుదల చేశారన్నారు. ఓట్ల కోసమే అధికార పార్టీ ప్రజారోగ్యాన్ని భ్రష్టు పట్టించే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. ఆర్ఎంపి వ్యవస్థ పూర్తిగా తొలగించాలని అనేక రాష్ట్రాల కోర్టులు తీర్పిచ్చాయని లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు వైద్య సేవలు నిజంగా అందించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే, ఎంతో మంది నిరుద్యోగ నర్సింగ్, పారా మెడికల్ చదువుకున్న వారికి ఉద్యోగాలివ్వాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారులు పునరాలోచించి జిఒ 465ని రద్దు చేయాలని లేఖలో కోరారు.


సిఎంఓ అస్తవ్యస్థం

- పెరుగుతున్న అవినీతి పోకడలు
- చక్రం తిప్పుతున్న ఒక సాధారణ అధికారి
- సొమ్ములు ఓరియంటల్ బ్యాంకులోనే వెయ్యాలంటూ ఒత్తిళ్లు
- ఉన్నతాధికారికి తెలిసినా స్పందన కరవు
- బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కంపెనీలకూ బిల్లులు చెల్లింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పాలనా యంత్రాంగానికి అత్యంత కీలకమైన ముఖ్యమంత్రి కార్యాలయంపై విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పారదర్శకత లోపిస్తోందని, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణ లొస్తున్నాయి. ఇవన్నీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇటీవల స్వయంగా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు సిఎంఓపై చేసిన ఆరోపణల్లో వాస్తవాలున్నట్లు తాజా పరిస్థితులు తేల్చిచెబుతున్నాయి. చివరకు ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక ఉన్నతాధికారి వద్ద పనిచేసే ద్వితీయ శ్రేణి అధికారి పాత్ర కూడా ఈ వ్యవహారంలో చాలా ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రభుత్వం అమలు చేసే ఏ కార్యక్రమానికి ఆమోదం లభించాలన్నా ముఖ్యమంత్రికి ఫైలు వెళ్లాల్సి ఉంటుంది. అయితే చాలా ఫైళ్లు ముఖ్యమంత్రికి చేరడం లేదని, చివరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి తెలియకుండానే కొన్ని ఆదేశాలు క్షేత్ర స్థాయి అధికారులకు వెళ్లిపోతున్నాయని తెలుస్తోంది. మరికొన్ని అంశాల్లో ఉన్నతాధికారులకు వాస్తవాల్ని వివరించకుండానే వారిని తప్పుదోవ పట్టిస్తున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నట్లు సమాచారం. ఇవే ప్రభుత్వానికి నష్టం కలిగించేవిగా పరిణమిస్తున్నాయని సీనియర్ అధికారులు కూడా కొంతమంది అంటున్నారు. గతంలో ఎసిబి కేసులుండి ప్రస్తుతం పేషీలో ఉన్న ఒక అధికారికి తాజాగా పదోన్నతి కూడా కల్పించినట్లు తెలిసింది. ఇదే సమయంలో ఆయనపై ఉన్న కేసులు ఎత్తివేసినట్లు సమాచారం. ఇదే అధికారి ఇప్పుడు పేషీలో పెత్తనాన్ని చూపిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి.



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ నిధులను జాతీయ బ్యాంకుల్లో నిల్వ చేసే సాంప్రదాయం ఉంది. దీనిపై గతంలోనే కొన్ని అధికారిక సూచనలు కూడా జిల్లాలకు వెళ్లాయి. అయితే తాజాగా జిల్లాల్లో ఉన్న నిధులను ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్‌లో డిపాజిట్ చేయాలని పేషీ నుంచి ద్వితీయ శ్రేణి అధికారి ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. దీనిపై కొన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గతంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు, ఆసుపత్రులకు మందులు సరఫరా చేసే కొన్ని సంస్థలను ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టింది. అయితే వాటిల్లో కొన్ని సంస్థలకు పాత బకాయిలను చెల్లించారని, దానిపై పెద్ద ఎత్తున ఒత్తిళ్లు పనిచేసాయని అంటున్నారు. ఇటువంటి కొన్ని ఘటనలు ఉన్నతాధికారి దృష్టికి వెళ్లినప్పటికీ, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇతర సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒకవైపు అవినీతిని నివారించాలని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నప్పటికీ, తన పేషీలోనే పారదర్శకత సన్నగిల్లడం విమర్శలకు తావిస్తోంది. వీటిని దగ్గరుండి పరిశీలించిన ఐవైఆర్ కృష్ణారావు కొద్ది రోజుల క్రితం సిఎంఓపై ఘాటుగానే స్పందించి నేరుగా ముఖ్యమంత్రికే లేఖ రాసారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం గమనార్హం.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68